PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 81 | విజయవాడ, శనివారం 21 అక్టోబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 21 October 2023 | Rs



## వార్నర్, మార్ష్ సెంచరీలు

- జంపా మ్యాజిక్
- పాక్‌పై 62పరుగుల తేడాతో ఆసీస్ గెలుపు

8



అచ్యుతానందన్‌కు కేకు తినిపిస్తున్న ఆయన కుటుంబ సభ్యులు

## శత వసంతాలు పూర్తి చేసుకున్న వియస్

● లోపలి పేజీలో.. ●

విధి నిర్వహణలో మాన్యువల్ స్కావెంజర్ మరణిస్తే

# రూ.30 లక్షల పరిహారం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం





**న్యూఢిల్లీ :** దేశంలో మురుగు కాలవలను శుభ్రం చేసే కార్మికులు (మాన్యువల్ స్కావెంజర్స్) పని ప్రదేశాల్లో మరణిస్తుండటంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మురుగు కాల్వలను శుభ్రం చేసే సమయంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. మాన్యువల్ స్కావెంజర్ల మరణాలపై దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని విచారించిన బెంచి శుక్రవారం ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. శాశ్వత అంగ వైకల్యం సంభవించిన వారికి కనీస నష్టపరిహారంగా రూ.20 లక్షలు చెల్లించాలని జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన బెంచ్ ఆదేశించింది. మాన్యువల్ స్కావెంజింగ్ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరింది. ఒకవేళ మురుగును శుభ్రం చేసే సమయంలో ఆ వ్యక్తి ఇతరత్రా వైకల్యం పొందితే రూ.10 లక్షలు చెల్లించాలని జస్టిస్ భట్ తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సంస్థలు సమన్వయంతో వ్యవహరించాలని బెంచ్ ఆదేశించింది. మురుగు కాలవల మరణాలకు సంబంధించిన కేసులను హైకోర్టులు కూడా పర్యవేక్షించవచ్చని తెలిపింది. గత ఐదేళ్లలో దేశంలోని పలు రాష్ట్రాల్లో మురుగు కాల్వలను, సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేస్తూ 347 మంది స్కావెంజర్లు మరణించారు. 2022లో లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన సమాచారం ప్రకారం... ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, తమిళనాడులోనే 40 శాతం మరణాలు సంభవించాయి.

2013, 2018లో నిర్వహించిన సర్వేల ప్రకారం దేశంలో 58,098 మంది మురుగు కాలువలను శుభ్రం చేసే పనిలో కొనసాగుతున్నారని కేంద్రప్రభుత్వం రాజ్యసభకు తెలిపింది. మాన్యువల్ స్కావెంజింగ్‌పై నిషేధం ఉన్నందున ఆ వృత్తిలో కొనసాగుతున్న వారికి పునరావాసం కల్పించాలని చట్టం చేశారు. అయినప్పటికీ నేటికీ ఆ వృత్తి కొనసాగుతుండటం, ఏటా వందలాది మంది మరణించడం విషాదం.

## జిపిఎస్ బిల్లుకు గవర్నరు ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అమలు చేసే బిల్లుకు గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. జిపిఎస్ బిల్లుకు ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం పాఠకులకు తెలిసిందే. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం మాత్రం తాను అనుకున్నట్లు ముందుకు సాగుతోంది.





## రక్తపాతం, ఊచకోతను తక్షణమే ఆపండి

- పాలస్తీనాకు సంఘీభావం
- 23వ ఐఎంసిడబ్ల్యుపి తీర్మానం
- భారత్ నుండి హాజరైన ఎంఎ బేబీ, కె బాలచంద్ర

**ఇజ్మీర్ (టర్కీ) :** ఇజ్రాయిల్ దాడులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాలస్తీనా ప్రజలకు ప్రపంచంలో వివిధ దేశాలకు చెందిన కమ్యూనిస్ట్, వర్కర్స్ పార్టీలు తమ పూర్తి సంఘీభావాన్ని తెలియజేశాయి. టర్కీలోని ఇజ్మీర్‌లో శుక్రవారం ప్రారంభమైన అంతర్జాతీయ కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల (ఐఎంసిడబ్ల్యుపి) 23వ అంతర్జాతీయ సమావేశం ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. గాజా, వెస్ట్‌బ్యాంక్‌లో రక్తపాతం, ఊచకోతలను తక్షణమే ఆపాలని, ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రకారం 1967కి ముందున్న సరిహద్దులతో సార్వభౌమత్వం కలిగిన పాలస్తీనా దేశం ఏర్పాటుకు చర్చలు ప్రారంభించాలని ఐఎంసిడబ్ల్యుపి ఆ తీర్మానంలో డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి ఆతిధ్యం ఇస్తున్న టర్కిష్ కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి కెమల్ ఓకుయాన్ ప్రారంభోపన్యాసం చేశారు. గత అక్టోబర్‌లో జరిగిన ఐఎంసిడబ్ల్యుపికి ఆతిధ్యం ఇచ్చిన క్యూబా కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు ఎమిలియో లోజాడా గార్సియా ఆ తరువాత ప్రసంగించారు. భారత్ నుంచి సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, పార్టీ అంతర్జాతీయ విభాగం అధ్యక్షులు ఎంఎ బేబీ, సిపిఐ నాయకులు కంగో బాలచంద్ర ఈ ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతూ, పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి మొత్తం 68 పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

# పరిహారం.. పరిహాసం!



ఫొటో : టివి రమణ

- ఇంకా అమల్లోకిరాని బీమా
- వచ్చినా ప్రైవేటు కంపెనీల దయాదాక్షిణ్యం
- ఎనిమిదేళ్లనాటి లెక్కబట్టి పెట్టుబడి రాయితీ
- ప్రత్యేకంగా సాయం నిర్ణయిస్తేనే రైతుకు ఉపశమనం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కరువు దెబ్బతో లక్షలాది ఎకరాల్లో ఖరీఫ్ పంటలు నష్టపోయిన అన్నదాతలు తమను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశతో ఎదురు చూస్తుండగా, రైతులకు చెల్లించే పరిహారం విషయంలో సర్కారు పరిహాసం ఆడుతోంది. పైర్లు కోల్పోయిన రైతన్నలకు రెండు మార్గాల్లో ఆర్థిక సహాయం అందుతుంది. ఒకటి పంటల బీమా కాగా రెండవది పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ). ఇప్పటి వరకు బీమా పథకాలేవీ పూర్తి స్థాయిలో అధికారికంగా అమల్లోకి రాలేదు. దిగుబడి ఆధారిత బీమా (ఫసల్ బీమా) విషయానికొస్తే మూడు జిల్లాల్లోని ఐదు మండలాల్లో 16 మంది రైతుల దరఖాస్తులే కేంద్రం వద్ద ఇప్పటి వరకు ఆమోదం పొందాయి. వాతావరణ ఆధారిత బీమాలో ఒక్క రైతు పేరు కూడా ఇంకా ఎక్కలేదు. ఇ-క్రాప్‌లో నమోదైన రైతులందరూ బీమా పరిధిలోకొచ్చేస్తారని ప్రభుత్వం పేర్కొనగా, ఇ-క్రాప్ ప్రక్రియ తుది దశలో ఉంది. కేంద్రం పథకాల్లో చేరినందున దేశ వ్యాప్తంగా నిర్ణయించిన కట్ ఆఫ్ డేట్ ప్రామాణికంగా ఉంది. దాటిన పక్షంలో మన రాష్ట్ర రైతుల బీమా పరిస్థితేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదే జరిగితే కరువు వలన పంట నష్టపోయిన రైతుల్లో పెద్ద ఎత్తున పరిహారం కోల్పోవాల్సి వస్తుంది. ఇదిలా ఉండగా, విపత్తుల వలన పంటలు నష్టపోయిన రైతులకు చాలా తక్కువ మొత్తంలో సర్కారు పరిహారం ఇస్తోంది. ఎప్పుడో 2015లో నిర్ణయించిన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డిఆర్‌ఎఫ్) స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌నే అమలు చేస్తోంది. నిబంధనలను దాటుకొని రైతులు ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హత సాధించడమే గగనమవుతుండగా, ఇచ్చేది నామమాత్రం కావడంతో ఏమూలకూ చాలట్లేదు. ఎనిమిదేళ్ల క్రితం నిర్ణయించిన సహాయమే ఇప్పటికీ కొనసాగుతుండగా, ఈ కాలంలో పంటల సాగుకు రైతులకయ్యే పెట్టుబడులు భారీగా పెరిగాయి.

### ఇన్సూరెన్స్

వైసిపి సర్కారు వచ్చాక ముందటేడు వరకు ఇన్సూరెన్స్ కంపెనీలతో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వమే బీమా నిర్వహించింది. గతేడాది ఫసల్ బీమాలో చేరింది. వాతావరణ బీమా మాత్రం తానే నిర్వహించింది. కాగా కంపెనీలు నిర్వహించిన ఫసల్ బీమాలో రైతులకు సరిగ్గా చెల్లింపులు జరగలేదు. ఈ పరిస్థితి ఉండగానే ఈ సంవత్సరం వాతావరణ బీమాను కూడా కేంద్రం కిందికే చేర్చింది. నిర్వహణ మొత్తాన్నీ ప్రైవేటు కంపెనీలకే ఇచ్చేసింది. కాగా పంట నష్టం జరిగిన వేరుశనగ, మరికొన్ని పంటలు వాతావరణ బీమా కిందనే నోటిఫై చేశారు. ఇప్పటి వరకు సదరు బీమా అధికారికంగా అమల్లోకి రాలేదు. రైతుల పరిస్థితి అగమ్యగోచరంలో పడింది.

### 2015 నాటి స్కేలు

విపత్తులతో పంటలు నష్టపోయిన రైతులకు ఏ సీజన్‌లో నష్టానికి ఆ సీజన్‌లోనే పరిహారం అంటున్న ప్రభుత్వం కొంత మందికి కొద్ది పాటి మొత్తంలో పెట్టుబడి రాయితీ ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. ఇచ్చే పరిహారం చాలా తక్కువ. ఎప్పుడో 2015 నాటి నిబంధనల మేరకు చెల్లిస్తోంది. వరి, వేరుశనగ, పత్తి ఎకరాకు గరిష్ఠంగా రూ.ఆరువేలిస్తోంది. రైతుకు పెట్టుబడి అంతకంటే కొన్ని రెట్లు ఖర్చవుతోంది. మొక్కజొన్నకు ఐదు వేలు, పప్పుధాన్యాలకు 4 వేలు, ఆముదాలకు 2,700 ఇస్తోంది. ఇవే పంటలకు కేంద్రం ఎన్‌డిఆర్‌ఎఫ్ నిబంధనల మేరకు వర్షాధారమైతే 2,720, ఇరిగేటెడ్ అయితే 5,400 ఇస్తోంది. విపత్తు మండలాలను ప్రకటించి కేంద్రాన్ని సాయం అడిగితే, కేంద్ర బృందాలు పర్యటించి సిఫారసు చేస్తేనే ఆ మొత్తమైనా వస్తుంది. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం భరించాలి.

### భారీ నష్టం

ప్రాథమిక అంచనాల మేరకు అన్ని పంటలూ కలుపుకొని పది లక్షల ఎకరాలకుపైనే నష్టం జరిగింది. అక్టోబర్‌లో వర్షాభావం తీవ్రమైంది. చాలా చోట్ల వర్షం లేదు. 18 జిల్లాలు, 400 పైగా మండలాల్లో తక్కువ వర్షం ఉంది. 15-20 రోజులుగా చినుకు పడని మండలాలు అత్యధికంగా ఉన్నాయి. కాల్వలకు నీరందక, కరెంట్ కోతల వలన పంటలు ఎండుతున్నాయి. వేరుశనగ ఆరున్నర లక్షల ఎకరాల్లో సాగుకాగా అంతా పోయిందంటున్నారు. మొక్కజొన్న, పత్తి, ఆముదాలు, పప్పుధాన్యాలు, వరి, ఇతర పంటలకూ నష్టం వాటిల్లింది. రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్‌లో 62 లక్షల ఎకరాల్లో సాగైతే పది లక్షల ఎకరాల్లో పంటలు ఇప్పటికే తుడిచిపెట్టుకుపోయాయని, మరో 5-10 లక్షల ఎకరాల్లో దిగుబడి సగానికి సగం దిగుబడి తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. పరిస్థితి ఇంత దయనీయంగా ఉండగా బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు ఏ మాత్రం ఉపశమనం కల్పించేవిగా లేవు. ప్రత్యేకంగా ప్రభుత్వం పరిహారం నిర్ణయించి ఇస్తేనే కొంచెమైనా ఆసరా కల్పించినట్లవుతుందన్న డిమాండ్ రైతుల్లో వ్యక్తమవుతోంది.

# ఉపాధ్యాయుల దీక్షలు భగ్నం

- క్షీణించిన పలువురి ఆరోగ్యం
- దీక్షలు తాత్కాలికంగా వాయిదా : యుటిఎఫ్

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రభుత్వం సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న నిరవధిక దీక్షలను పలు జిల్లాల్లో పోలీసులు భగ్నం చేశారు. దీక్షలు చేస్తున్న వారిని బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. పలు జిల్లాల్లో దీక్షలు కొనసాగాయి. శుక్రవారం మరికొన్ని జిల్లాల్లో దీక్షలు ప్రారంభమయ్యాయి. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో దీక్షలు చేస్తున్న వారిలో పలువురి ఆరోగ్యం క్షీణించింది. దీంతో, వైద్యుల సూచన మేరకు దీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్-ఎస్.ప్రసాద్ ప్రకటించారు. విజయనగరం, గుంటూరు, శ్రీకాకుళం, చిత్తూరు, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిరవధిక దీక్ష శిబిరాల వద్దకు పోలీసులు వచ్చారు. దీక్షలను అనుమతి లేదని, వెంటనే విరమించాలని అన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ దీక్ష కొనసాగిస్తామని యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు తేల్చి చెప్పారు. దీంతో, పోలీసులు అరెస్టులకు పూనుకున్నారు. ఈ సందర్భంగా వారికి, యుటిఎఫ్ నాయకులకు మధ్య పెనుగులాట చోటుచేసుకుంది. రెండు రోజులుగా ఎటువంటి ఆహారమూ తీసుకోకుండా దీక్షలు చేస్తుండడంతో కొందరికి ఆరోగ్యం క్షీణించిందని, బిపి, షుగర్ లెవెల్స్ తగ్గిపోయాయని వైద్యులు తెలిపారు. మిగిలిన జిల్లాల్లో దీక్షలు కొనసాగాయి. అల్లూరి జిల్లా పాడేరు, అరకులోయ, చింతూరుల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అరకులోయలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తలపెట్టిన దీక్షలను గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, నరసాపురంల్లో దీక్షా శిబిరాలను ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఏలూరులో యుటిఎఫ్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలకు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, ఎపి గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు సంఘీభావం తెలియజేశారు.



యుటిఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి కళాధర్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

**ఒపిఎస్‌పై క్షేత్ర స్థాయిలో తేల్చుకుంటాం : యుటిఎఫ్**

ఒపిఎస్‌పై ప్రభుత్వ వైఖరిపై ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిగతా 7లో

## కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ 'గెజిట్'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించిన గెజిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. కాంట్రాక్టు ఎంప్లాయిస్ రెగ్యులరైజేషన్ చట్టం 30కు ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన సంగతి తెలిసింది. దీనికి గవర్నరు ఆమోద ముద్ర వేశారు. దీంతో శుక్రవారం గెజిట్ విడుదల చేశారు.



## అధిక వడ్డీ రేట్లు కొనసాగుతాయ్..

- ఎంతకాలమో చెప్పలేము
- ఆహార ద్రవ్యోల్బణంలో అనిశ్చితి
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్

● లోపలి పేజీలో.. ●

## సరస్వతీదేవి అలకారంలో 'దుర్గమ్మ'

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం జగన్

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్, వన్‌టౌన్

దసరా శరన్నవరాత్రుల్లో ప్రధానమైన మూలా నక్షత్రం రోజైన శుక్రవారం సరస్వతిదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. తాడేపల్లిలోని తన నివాసం నుండి మధ్యాహ్నం 3.40 గంటలకు ఇంద్రకీలాద్రిపైకి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి సంప్రదాయ వస్త్రధారణతో పట్టువస్త్రాలను, పసుపు కుంకుమలను తలపై పెట్టుకుని అంతరాలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు. సిఎం వెంట మంత్రుల కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత, జోగి రమేష్, ఆర్.కె.రోజా, ఎండోమెంట్ స్పెషల్ సిఎస్ ఆర్.కరికల్ వలవెన్, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, నగర సిపి కాంతి రాణా టాటా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇఒ కెఎస్ రామారావు, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

**అడ్డదారి దర్శనాలకు అడ్డుకట్ట**

అడ్డదారిలో కనకదుర్గమ్మ దర్శనం చేసుకునే అవకాశాలు ఉన్న మార్గాలకూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు తాళాలు వేయించారు. విఐపి క్యూలైన్ ద్వారా ప్రొటోకాల్ ఉన్న వివిఐపిలకు మాత్రమే దర్శనం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. దర్శనాల విషయంలో స్వార్థంతో ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవాలయం లోపల భాగంలో కూడా అన్ని ద్వారాలూ దగ్గరుండి మూసేయించారు. శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటలకు దర్శనాలు ప్రారంభం కాగానే ఆయన క్యూలైన్లను పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. భక్తుల రద్దీని క్రమపద్ధతిలో నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

## ఫైబర్‌నెట్ కేసు విచారణ 9కి వాయిదా

- అప్పటి వరకూ చంద్రబాబును అరెస్టు చేయొద్దు : సుప్రీంకోర్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫైబర్‌నెట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను నవంబరు 8వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అయితే వ్యక్తిగత అవసరాల రీత్యా 9వ తేదీన విచారణ చేపట్టాలని చంద్రబాబు తరుపున న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరిన నేపథ్యంలో రెండు రోజుల్లో ఏదో ఒకరోజు విచారణ చేపడతామని కోర్టు తెలిపింది. మేరకు చంద్రబాబు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. చంద్రబాబు తరపున లూథ్రా, రాష్ట్ర ప్రభుత్వం తరపున రంజిత్‌కుమార్ వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై మూడు ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, ఒకదానికి సంబంధించి తీర్పు రిజర్వు అయిందని, ఫైబర్‌నెట్ కేసులో అరెస్టు చేయొద్దని ఇప్పటికే చెప్పారని లూథ్రా తెలిపారు. దీనిపై ప్రభుత్వం తరపున న్యాయవాది రంజిత్‌కుమార్ వాదిస్తూ.. కస్టడీలో ఉండగా మరలా అరెస్టు అనే ప్రశ్న ఉత్పన్నం కాదని అన్నారు. ఇరువురి వాదనలు విన్న కోర్టు నవంబరు 8వ తేదీకి కేసును వాయిదా వేసింది. అయితే తన వ్యక్తిగత ఇబ్బంది రీత్యా 9వ తేదీన విచారణ చేపట్టాలని లూథ్రా కోరారు. అలాగే ముందుగా స్కిల్ డెవలప్‌మెంటు కేసులో తీర్పు వెలువరిస్తామని, తర్వాత ఫైబర్‌నెట్ కేసు అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని న్యాయస్థానం పేర్కొంది. అప్పటి వరకూ ఫైబర్‌నెట్ కేసులో ఎటువంటి అరెస్టులు చేయొద్దని ఆదేశించింది. ఇదే కేసులో తన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో చంద్రబాబు సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

**ములాఖత్ పెంపు పిటిషన్ తిరస్కరణ**

చంద్రబాబును కలిసేందుకు రోజుకు మూడు ములాఖత్‌లు, అదీ 45 నిమిషాల నుంచి 50 నిమిషాల వరకూ ఇప్పించాలని ఎసిబి కోర్టులో ఆయన తరపున న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌ను ఎసిబి కోర్టు తిరస్కరించింది. న్యాయవాదులకు రోజుకు రెండుసార్లు ఇచ్చే ములాఖత్‌ను జైలు అధికారులు ఒకటికి కుదించారని పిటిషనర్లు పేర్కొన్నారు. వివిధ కోర్టుల్లో కేసులు విచారణ జరుగుతున్న నేపథ్యంలో రోజుకు మూడు ములాఖత్‌లు ఇప్పించాలని అందులో కోరారు. ఈ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది.

**26కు కాల్ డేటా కేసు వాయిదా**

విచారణ అధికారుల కాల్ డేటా, రికార్డులు ఇవ్వాలని చంద్రబాబు తరపున దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఎసిబి కోర్టు ఈ నెల 26కు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని గతంలోనే సిఐడిని కోర్టు ఆదేశించింది. వారు సమయం కావాలని కోరడంతో ఈ నెల 26కు వాయిదా వేసింది.

# సిఐడి సహకారంతో దర్యాప్తు

- ఒంగోలు భూ కుంభకోణాలపై సిఎంఓ ఆదేశం
- ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

ప్రకాశం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఒంగోలు భూ కంభకోణాల దర్యాప్తు ప్రక్రియలో సిఐడి సహకారం కూడా తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఓ) ఆదేశించింది. ఈ విషయంలో జాప్యం జరిగిందని ఇప్పటికైనా విచారణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేసింది. కొంత కాలంగా జిల్లాలో వెలుగుచూస్తున్న భూ కుంభకోణాలు అధికారయంత్రాంగానికి తలనొప్పిగా మారిన విషయం తెలిసిందే. అధికారపార్టీ నేతలపై ఆరోపణలు వస్తుండటం, వీటి కేంద్రంగా గ్రూపుల పోరు తీవ్రమవుతుండటం కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిని అవకాశంగా తీసుకున్న తెలుగుదేశం పార్టీ పెద్ద ఎత్తున విమర్శలకు దిగుతోంది. వెలుగులోకి వస్తున్న అక్రమాలపై అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ, కొత్త అక్రమాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఎనిమిది కేసులు నమోదయ్యాయి. మరోవైపు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి దర్యాప్తు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పై స్థాయి నుండి వచ్చిన ఆదేశాలతో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్‌పి మల్లికా గార్గే సిఎంఓ ముఖ్యకార్యదర్శి ధనుంజయ్ రెడ్డిని శుక్రవారం కలిశారు. జిల్లాలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ధనుంజయ్‌రెడ్డి ఆరా తీసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనల తీరునూ, తీసుకున్న చర్యలను కలెక్టర్, ఎస్‌పి వివరించారు. ఇప్పటికే సిట్‌ను ఏర్పాటు చేయడం, ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, పెద్ద ఎత్తున నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్న విషయాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. అయితే, అసలు నేరస్తులను పట్టుకోవాల్సిఉందని వారు చెప్పడంతో విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని, సిఐడి సహకారం కూడా తీసుకోవాలని దినేష్‌రెడ్డి ఆదేశించారు. దీంతో ఈ దిశలో శనివారం నుండే చర్యలు తీసుకోవడానికి అధికారయంత్రాంగం కసరత్తు చేస్తోంది.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ స్టాంపులు, పత్రాలను పరిశీలిస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

**ఏం జరుగుతోంది.**

నకిలీ స్టాంపులతో ప్లాట్లు, ఇళ్లకు కొందరు ఎసరు పెట్టారు. మార్కాపురం, కనిగిరి వంటి ప్రాంతాల్లోనూ ఇలాంటివి జరుగుతున్నాయి. బాధితుల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన పోలీసులు ఇప్పటికే ఎనిమిది కేసులు నమోదు చేశారు. ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ స్టాంపు పత్రాలు, నకిలీ రబ్బరు స్టాంపులు, నకిలీ డెత్ సర్టిఫికెట్లు, తహశీల్దారు కార్యాలయం నుంచి ఇచ్చే ఖాళీ పొజిషన్ సర్టిఫికెట్లు, పట్టాలు, పలు రకాల నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆక్రమణల వ్యవహారంలో పాలకపక్ష నేతలూ పాత్రధారులుగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పోలీసులు కొన్ని రబ్బరు స్టాంపులను పరిశీలించగా, ఒరిజినల్స్ తయారైన తేదీల్లోనే నకిలీవి కూడా తయారు చేసినట్లు గుర్తించారు.. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు అరెస్టు చేసిన ఓ నిందితుడిని డాక్యుమెంటు రైటర్‌గా గుర్తించారు. ఆయన వద్ద 130 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఎన్ని ఫేక్ ఉన్నాయి? ఎన్ని నిజమైనవి? అనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ డాక్యుమెంట్ల వ్యవహారం వెలుగులోకి రావడంతో పాలకపక్ష నేతలు కొందరు నగరం వదిలి పారిపోయారనే ప్రచారం సాగుతోంది.

## అమెరికా విదేశాంగ శాఖ ఉన్నతాధికారి రాజీనామా

- ఇజ్రాయిల్‌కు ఆయుధాలు పంపాలన్న బైడెన్ చర్యకు నిరసన

**వాషింగ్టన్ :** ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, మందుగుండు సామగ్రి సరఫరాను కొనసాగించాలన్న బైడెన్ ప్రభుత్వ చర్యకు నిరసనగా విదేశాంగ శాఖ ఉన్నతాధికారి ఒకరు శుక్రవారం రాజీనామా చేశారు. గాజాను దిగ్బంధించి అక్కడ సామూహిక మారణకాండను, మానవతా సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్న ఇజ్రాయిల్‌కు ఆయుధాలను, మందుగుండు సరఫరాను కొనసాగించడాన్ని విదేశాంగ శాఖలో రాజకీయ - సైనిక వ్యవహారాల బ్యూరో, ప్రజా వ్యవహారాల విభాగ డైరెక్టర్‌గా 11ఏళ్ల నుంచి పనిచేస్తున్న జోష్ పాల్ గట్టిగా వ్యతిరేకించారు. బైడెన్ ప్రభుత్వం ఒక వైపు కొమ్ముకాస్తూ, ఇజ్రాయిల్ నేరాలను గుడ్డిగా సమర్ధించడానికి నిరసనగా తాను రాజీనామా చేస్తున్నానని పాల్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ వైఖరి మనం బయట ప్రజలకు చెప్పే నీతులకు పూర్తి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. గత అనేక దశాబ్దాలుగా మనం చేసిన తప్పులే ఇప్పుడు పునరావృతమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు బైడెన్ ప్రభుత్వం అదే తప్పు చేస్తున్నదని, ఇందులో భాగస్వామి కావడం ఇష్టం లేకనే రాజీనామా చేశానని ఒక ఇంటర్వ్యూలో పాల్ పేర్కొన్నారు.

## ఆదర్శంగా గ్రామ పంచాయతీలు

- సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సన్సద్ ఆదర్శ గ్రామ యోజన కింద ఎంపిక చేసిన గ్రామాల్లో పెద్దయెత్తున మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పథకం ముఖ్య ఉద్దేశాలను వివరించారు. రాష్ట్రంలోని ఎంపిలు ఒక్కొక్కరు ఒక్కో గ్రామ పంచాయతీని దత్తత తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో మౌలిక వసతులతోపాటు రహదారి కనెక్టవిటీ, తాగునీటి సరఫరాలో స్వయం సమృద్ధి, ఆర్గానిక్ ఫార్మింగ్, ఘణ, ద్రవ వ్యర్థాల నిర్వహణ, రెన్యువల్ ఎనర్జీ పాఠశాలల్లో నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్, ఆరోగ్యం, ఆ గ్రామ పంచాయతీ పూర్తిగా డిజిటలైజేషన్, సామాజిక భద్రత, పథకంలో నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్, అడవుల పెంపకం కార్యక్రమం వంటివి చేపట్టాలనేది ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో సన్సద్ ఆదర్శగ్రామ యోజన కింద ఇప్పటి వరకు 129 గ్రామ పంచాయతీలను దత్తత తీసుకున్నారని రాజశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పిఆర్అండ్ ఆర్‌డి ఇఎన్‌సి పాల్గొన్నారు. రాష్ట్ర ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (ఎస్ఐపిసి) సమావేశం సచివాలయంలో సిఎస్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన కంపెనీలు, సంస్థలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీలు, భూమి కేటాయింపు అంశాలకు సంబంధించి సమావేశంలో చర్చించి కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ఇంధన, ఆర్థికశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె విజయానంద్, ఎస్ఎస్ రావత్, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి పాల్గొన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## ముందు తరాలకు మార్గదర్శిగా భూముల రీసర్వే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అత్యాధునిక సాంకేతిక సహకారంతో ముందు తరాలకు సైతం మార్గదర్శిగా రాష్ట్రంలో రీ సర్వే ప్రాజెక్టు చేపట్టడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అస్సాం ల్యాండ్ రికార్డ్సు, సర్వే డైరెక్టరు, పరిపాలనా సంస్కరణలు, శిక్షణశాఖ కార్యదర్శి శంతను పి గోట్మారే పేర్కొన్నారు. రెండు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించిన బృందం శుక్రవారం విజయవాడలోని రీ సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపడుతున్న భూముల రీ సర్వే గురించి సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల కమిషనరు సిద్ధార్థజైన్, అదనపు సంచాలకులు గోపాలకృష్ణ రోణంకి వివరించారు.

## తిరుపతి అభివృద్ధికి టిటిడి నిధులు రద్దు

- దేవాదాయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు

ప్రజాశక్తి -తిరుమల

తిరుపతి అభివృద్ధికి టిటిడి బోర్డు తీర్మానించి కేటాయించిన ఒక శాతం నిధులు విడుదల నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాళ్ళ వల్లవన్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బోర్డు తీర్మానం రోజు కరికాళ్ళ వల్లవన్ సమావేశంలో ఉన్నా, ఆ రోజు ఆమోదం తెలిపి తిరిగి రద్దు చేయడం వెనుక అంతర్యం ఏమిటనే సందేహం ప్రజల్లో కలుగుతోంది. అక్టోబర్ తొమ్మిదిన నిర్వహించిన పాలకమండలి సమావేశంలో రూ. 4,460 కోట్ల బడ్జెట్‌ను టిటిడి ప్రవేశపెట్టింది. ఇందులో ఒక శాతం నిధులు రూ.44.6 కోట్లను తిరుపతి అభివృద్ధికి కేటాయించింది.

**సిపిఎం ఖండన**

బిజెపి, విశ్వహిందూ పరిషత్ లాంటి అభివృద్ధి నిరోధక సంస్థల ఒత్తిడికి లొంగి రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి మున్సిపాలిటీకి టిటిడి చెల్లించాలనుకున్న ఒక్క శాతం నిధులను తిరస్కరించడంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తీవ్రంగా మండిపడ్డారు. మొదటినుంచి తిరుపతి అభివృద్ధి పట్ల వ్యతిరేకంగాను, అభివృద్ధి నిరోధకంగాను వ్యవహరిస్తున్న విశ్వహిందూ పరిషత్, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లాంటి శక్తుల ఒత్తిడికి లొంగిపోయి రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడడం తిరుపతి ప్రజల మనోభావాలను వ్యతిరేకించడమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

### కార్మిక పోరాటాలు, రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతోనే

# నాగర్‌నార్ స్టీల్ ప్రయివేట్ వెనక్కి!

### వైజాగ్ స్టీల్‌పై బిజెపి నాటకాలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లా నాగర్‌నార్‌లోని స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలనుకున్న బిజెపి సర్కారు విధానాన్ని ఆ రాష్ట్ర ప్రజలు, కార్మికులు నిరంతర పోరాటాలతో వెనక్కి కొట్టగలిగారు. అక్కడ రాష్ట్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న కాంగ్రెస్, జెఎంఎం కూడా స్టీల్ పోరాటానికి మద్దతుగా నిలవడంతో కేంద్రంలోని మోడీ సర్కారు వెనక్కి తగ్గక తప్పలేదు. మన రాష్ట్రంలోని విశాఖ ఉక్కు కర్మాగారం విషయానికొస్తే... కేంద్రంలోని మోడీ సర్కారు ఈ ప్లాంట్‌ను వంద శాతం ప్రయివేటీకరిస్తామని 2021 జనవరి 27న ప్రకటించింది. దీనిని వ్యతిరేకిస్తూ అప్పటి నుంచి 981 రోజులుగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, ఉత్తరాంధ్ర ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాడుతోంది. ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మన రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకుంది. కేవలం రెండు వేల మంది కార్మికులతో ఏటా మూడు లక్షల మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తితో నాగర్‌నార్ ప్లాంట్ నడుస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వేల మంది కార్మికులతో ఏటా 75 లక్షల మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేసే పరిశ్రమగా ఉక్కు రంగంలో అగ్రగామి సంస్థగా ఉంది. గడిచిన రెండేళ్లుగా రైలు ర్యాకులు ఇవ్వకుండా, బ్లాస్ట్ ఫర్నేస్-3ని మూసేసి కేంద్రంలోని మోడీ సర్కారు ఈ కర్మాగారాన్ని నిర్వీర్యం చేస్తోంది.

**నాగర్‌నార్ స్టీల్ ప్రయివేటీకరణపై వెనక్కి తగ్గడానికి కారణమేంటంటే..**

కేంద్ర ప్రభుత్వ రంగంలోని గనుల సంస్థ ఎన్‌ఎండిసి ఆధ్వర్యాన నాణ్యమైన ఇనుప గనులు, ఖనిజం బైలదిల్లాలో వెలికితీయబడుతున్నాయి. ప్రపంచంలోనే నాణ్యమైన గనులకు బైలదిల్లా ప్రసిద్ధి. గనులు, నిధులు ఉండడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లా నాగర్‌నార్‌లో స్టీల్‌ప్లాంట్‌ను ఎన్‌ఎండిసి ఏర్పాటు చేసింది. గతంలో దీన్ని నరేంద్ర మోడీ జాతికి అంకితం చేశారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్, జెఎంఎం ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ ప్లాంట్ సమర్థవంతంగా నడవడం లేదంటూ మోడీ సర్కారు ప్రయివేట్ వాళ్లకు అప్పగించే క్రమానికి బాటలు వేసింది. వేల్యూయేషన్ చేయించింది. ఇఒఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్) కోరింది. బిడ్డింగ్‌లో జిందాల్ నెంబర్ వన్‌గా నిలిచింది. ఆ సంస్థకు నాగర్‌నార్ ప్లాంట్‌ను అమ్మేయడానికి కేంద్రం రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజా, కార్మిక పోరాటాలు బస్తర్ జిల్లా అంతటా సాగాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ ఛత్తీస్‌గఢ్ వచ్చినప్పుడు ప్రజలు, కార్మికులు నిరసన తెలపడంతో ప్రయివేటీకరణ చేయడం లేదని ప్రకటించారు. అయినా, కార్మికులు, ప్రజలకు నమ్మకం కుదరలేదు. రాజకీయ పార్టీల మద్దతుతో పోరాటం ఊపందుకుంటున్న ప్రస్తుత స్థితిలో తాజాగా ఈ నెల 19న అమిత్ షా బస్తర్ జిల్లా వచ్చి 'ఈ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయబోం, ప్రపంచ గనుల మ్యాప్‌లో బస్తర్ జిల్లా పేరుండాలి' అని ప్రకటించారు. నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికలు జరగనుండడంతో బిజెపి అగ్రనేతలిద్దరూ ఈ ప్రకటన చేశారనే చర్చ ఆ రాష్ట్రంలో సాగుతోంది.

**పోరాటాల వల్లే అక్కడ ఆగింది.. విశాఖలోనూ తొలి నుంచీ అడ్డుకుంటున్నాం**

ఛత్తీష్‌గఢ్‌లోని నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి బిడ్డింగ్ అయిపోయాక 'సీను రివర్స్' అయింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో తొలి నుంచీ కార్మికులు, ప్రజానీకం కేంద్ర ప్రయివేటీకరణ చర్యలను అడ్డుకుంటూనే ఉన్నారు. ఆ రాష్ట్రంలో ఎన్నికలు, అక్కడ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక పోరాటానికి మద్దతివ్వడంతో ప్రయివేటీకరణకు అడ్డుకట్టపడింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం నాటకాలు ఆడుతోంది. పోరాట కమిటీ గట్టిగానే ప్రయివేటీకరణను అడ్డుకుంటోంది. నాగర్‌నార్ ప్రయివేటీకరణ పోరాటాలతోనే ఆగింది. ప్రభుత్వమే బంద్‌కు పిలుపు ఇవ్వడం వంటి చర్యలు కలిసొచ్చిన అంశాలు.

**-సిహెచ్.నర్సింగరావు,**
**విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్**



## 31 వరకు అమర వీరుల వారోత్సవాలు

- నేడు పోలీస్ పరేడ్.. హాజరుకానున్న సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో శాంతిభద్రతల పరిరక్షణలో అనునిత్యం అసాంఘిక శక్తులతో పోరాడుతూ తమ ప్రాణాలను కోల్పోయిన పోలీసు సిబ్బందికి నివాళులు అర్పించేందుకు ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరపనున్నట్లు డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఈ ఏడాది ప్రకాశం జిల్లాకు చెందిన కానిస్టేబుల్ పవన్‌కుమార్ అమరావతిలో బందోబస్తుకు వచ్చి పాముకాటుకు గురై మృతిచెందారని తెలిపారు. మొదటి రోజైన 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా మొదలుపెట్టి 31న జాతీయ సమైక్యతా దినంగా ఈ వారోత్సవాలు జరుగుతాయన్నారు. 21న విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో స్మృతి పరేడ్ నిర్వహించబడుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను తెలిపేందుకు 22 నుంచి 31 వరకు విజయవాడలో ఓపెన్ హౌస్ పేరుతో ఎగ్జిబిషన్ కార్యక్రమాలను, అలాగే 26, 27 తేదీల్లో ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24 నుంచి 27 వరకు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు, పోలీసు సిబ్బందికి, వారి పిల్లలకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది కాలంలో 11,486 మంది పోలీసులకు రూ.42.4 కోట్ల నగదు రహిత వైద్యాన్ని అందించామన్నారు. 316 మందికి రూ.98.85 కోట్లు హౌసింగ్ రుణాలను, ఉన్నత చదువులకు సంబంధించి 57 మందికి రూ.11.66 కోట్లు, 80 మందికి రూ3.95 కోట్లు పెళ్లి రుణాలను, 2,391 మందికి రూ.99.20 కోట్లు వ్యక్తిగత రుణాలను అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మొత్తం మృతిచెందిన 244 పోలీస్ కుటుంబాల్లో 186 మంది దరఖాస్తు చేసుకోగా, 46 మందికి కారుణ్య నియామకం కింద పోస్టింగులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో మృతిచెందిన 22 మందికి రూ.4.56 కోట్లు ప్రమాద బీమాను అందించామన్నారు. ఈ పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను రాష్ట్రంలోని అన్ని జిల్లా పోలీసు కేంద్రాలు, పోలీసు బెటాలియన్‌లు, కమిషనరేట్‌లలో ఘనంగా నిర్వహించాలని కోరారు.

## నీటి గుంతలో పడి అన్నదమ్ముల మృతి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నీటి గుంతలో పడి అన్నదమ్ములు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా నరసరావుపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనెపూడి గ్రామానికి చెందిన చెంచయ్య, కోటేశ్వరమ్మ దంపతులకు మణికంఠ (11), నవీన్ కుమార్ (9) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 4 తరగతులు చదువుతున్నారు. పాఠశాలలకు దసరా సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి ఇంటికి సమీపంలోని మైదానంలోకి వెళ్లారు. గ్రామానికి దగ్గరలో ఉన్న వాగులోకి క్రేన్ వచ్చిందని, పొలాలకు అవసరమైన నీటిని నిల్వ చేసేందుకు గుంత తవ్వుతోందని స్థానికులు తెలపడంతో అటుగా వెళ్లారు. మార్గ మధ్యలో మరో నీటి గుంతను చూస్తుండగా అన్నదమ్ములైన మణికంఠ, నవీన్‌కుమార్ కాలు జారి పడిపోవడంతో మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# ప్రజా రక్షణ భేరి యాత్ర సాగేదిలా...

- నవంబరు 15న విజయవాడలో బహిరంగ సభ
- సీతారాం ఏచూరి, బివి రాఘవులు హాజరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎం ఆధ్వర్యాన అక్టోబరు 30, నవంబరు రెండో తేదీల్లో బయలుదేరే మూడు యాత్రలు నవంబరు 8, 9, 10 తేదీల్లో విజయవాడకు చేరుకుంటాయి. దీనికి సంబంధించిన వివరాలను రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది.

**ఏజెన్సీ జాతా**

పార్వతీపురం జిల్లా సీతంపేట నుంచి 2023 అక్టోబరు 30వ తేదీ ఉదయం 10 గంటలకు యాత్రను బివి రాఘవులు ప్రారంభిస్తారు. అదేరోజు మధ్యాహ్నం కురుపాంలో జరిగే సభలో పాల్గొంటారు. 31న జాతాలో జాతీయ మహిళా నాయకులు ఎస్ పుణ్యవతి పాల్గొంటారు. ఈ జాతాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కిల్లో సురేంద్ర, ఎ అశోక్, యం సూర్యనారాయణ, ప్రభావతి, దడాల సుబ్బారావు, ఎస్ అనిల్‌కుమార్ పాల్గొంటారు. ఈ జాతా ఎనిమిదోతేదీ సాయంత్రం విజయవాడ చేరుకుంటుంది. జాతాను వి వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తారు. అన్ని జాతాల వెంట కళాకారుల దళం ఉంటుంది.

**మందస జాతా**

శ్రీకాకుళం జిల్లా మందస నుంచి 2023 నవంబరు 2వ తేదీ ఉదయం 10 గంటలకు మందసలో ప్రారంభమయ్యే జాతాను జాతీయ నాయకులు విజ్జుకృష్ణన్ ప్రారంభించి అదేరోజు శ్రీకాకుళంలో జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. 2023 నవంబరు 10వ తేదీ సాయంత్రం ఆరుగంటలకు ఈ జాతా విజయవాడ చేరుకుంటుంది. ఈ జాతాలో కె లోకనాథం, ఎవి నాగేశ్వరరావు, యం హరిబాబు, కె ధనలక్ష్మి, కొల్లాటి శ్రీనివాస్ పాల్గొంటారు. ఈ యాత్రను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం సీతారాం పర్యవేక్షిస్తారు.

**ఆదోని జాతా**

కర్నూలు జిల్లా ఆదోని నుండి 2023 అక్టోబరు 30వ తేదీ ఉదయం 10 గంటలకు ఆదోనిలో ప్రారంభమయ్యే జాతాను జాతీయ నాయకులు అశోక్ ధావలే ప్రారంభించి కర్నూలులో జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. 2023 నవంబరు 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు తాడేపల్లిలో ముగుస్తుంది. ఈ జాతాలో ఎంఎ గఫూర్, వి కృష్ణయ్య, కె ఉమామహేశ్వరరావు, దయా రమాదేవి, వి శివనాగరాణి, ఓ నల్లప్ప, ఎం భాస్కరయ్య పాల్గొంటారు. కె ప్రభాకరరెడ్డి పర్యవేక్షిస్తారు.

| ఏజెన్సీ జాతా | మందస జాతా | | ఆదోని జాతా | | |
|---|---|---|---|---|---|
| కురుపాం | పలాస | కాకినాడ | కర్నూలు | తిరుపతి | సత్తెనపల్లి |
| పార్వతీపురం | విజయనగరం | రాజమండ్రి | నంద్యాల | గూడూరు | చిలకలూరిపేట |
| సాలూరు | పెందుర్తి | అమలాపురం | బద్వేలు | నెల్లూరు | చీరాల |
| అరకువేలి | గాజువాక | నర్సాపురం | అనంతపురం | కందుకూరు | బాపట్ల |
| పాడేరు | స్టీల్ | భీమవరం | పుట్టపర్తి | సంతనూతలపాడు | తెనాలి |
| రంపచోడవరం | అనకాపల్లి | మచిలీపట్నం | చిత్తూరు | ఒంగోలు | గుంటూరు |
| పోలవరం | | విజయవాడ | | అద్దంకి | మంగళగిరి |
| ఏలూరు | | | | నర్సరావుపేట | తాడేపల్లి |
| గన్నవరం | | | | | |
| విజయవాడ | | | | | |

## 23న టిడిపి-జనసేన జెఎసి తొలిసారి భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి-జనసేన ఉమ్మడి సమావేశం ఈ నెల 23న రాజమండ్రిలో జరగనుంది. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్, టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉమ్మడి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే ఇరు పార్టీలు జెఎసి సభ్యులను ప్రకటించాయి. రాజకీయ కార్యక్రమాలను ఉమ్మడిగా నిర్వహించేలా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అలాగే పొత్తుల అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటం, ఉద్యమ కార్యాచరణ, తాజా రాజకీయ పరిణామాలు, ఇరు పార్టీల సమన్వయంపై కమిటీ చర్చిస్తుందని నేతలు చెబుతున్నారు.

**నేడు టిడిపి విస్తృతస్థాయి సమావేశం**

భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను టిడిపి శనివారం ప్రకటించనుంది. ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం టిడిపి కార్యాలయంలో జరగనుంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు లేకుండా, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో తొలిసారి ఈ సమావేశం జరగనుంది. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' 'ఇంటింటికి టిడిపి' వంటి కార్యక్రమాల నిర్వహణపై పార్టీ నేతలకు లోకేష్ దిశానిర్దేశం చేయనున్నారు.

చంద్రబాబు అరెస్టుతో నిలిచిన 'భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని లోకేష్‌తో కొనసాగించాలని పార్టీ ముఖ్య నేతలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. 'నిజం గెలవాలి' పేరుతో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రజల్లో తిరగాలని భావిస్తున్నట్లు తెలిసింది. చంద్రబాబు అరెస్టుతో మృతిచెందిన వారిని భువనేశ్వరి పరామర్శించనున్నారు. ఈ అంశాలను ప్రకటించే అవకాశం ఉంది.

## విద్యా వ్యవస్థలో స్కామ్‌లపై విచారణ

- పాత్రదారులందరూ జైలుకే
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, 2024లో అధికారంలోకి రాగానే విద్యాశాఖలో జరిగిన స్కామ్‌లలో పాత్రదారులపై విచారణ చేయిస్తామని, బాధ్యులైన వారందరూ జైలుకు వెళ్లాల్సిందేనని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ హెచ్చరించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడో తరగతి విద్యార్థులకు టోఫెల్ శిక్షణ ఎందుకో అర్థం కావడం లేదని, యాక్సెంటో కోసం ఇంత పెద్దయెత్తున ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందా? అని పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. పిల్లల సృజనాత్మకత పెంచేలా చర్యలు తీసుకోవాలే కానీ యాక్సెంటో గొడవేంటని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి బొత్స వ్యంగం, వెటకారమాడినా తాము పట్టించుకోబోమన్నారు. ప్రభుత్వం చేసుకున్న ఇటిఎస్, ఐబి ఒప్పందాల మీదున్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

జనసేన పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. 'అమ్మఒడి'లో స్కామ్ జరిగిందన్నారు. టీచర్లకు సకాలంలో వేతనాలివ్వడంలో విఫలమైన ప్రభుత్వం ఇతర దేశాలకు చెందిన సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోందన్నారు. టీచర్ల శిక్షణ కోసం రూ.1200 నుంచి రూ.1500కోట్లు ఖర్చు పెట్టేలా ఒప్పందం ఉందని, న్యాయశాఖ తిరస్కరించిన అంశాలు, క్లాజులను ఒప్పందంలో పెట్టి మరీ కేబినెట్ ఆమోదించాల్సిన అవసరమేమిటని మనోహర్ ప్రశ్నించారు. 5.71 లక్షల మంది విద్యార్థుల పేరుతో అమ్మఒడి, విద్యాకానుక నిధులు సుమారు రూ.743 కోట్లు పక్కదారి పట్టాయని ఆరోపించారు.

**జనసేన రాష్ట్ర కార్యవర్గంలోకి మరికొందరు**

జనసేన పార్టీ ముఖ్య నేతల సమావేశం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ అధ్యక్షతన జరిగింది. సమావేశం అనంతరం రాష్ట్ర కార్యవర్గంలో నియమించిన నేతల పేర్లను పవన్‌కల్యాణ్ వెల్లడించారు. క్రియాశీలక సభ్యుల శిక్షణ విభాగం ఛైర్మన్‌గా ఈదర హరిబాబు, ప్రొటోకాల్ విభాగం ఛైర్మన్‌గా మల్లినీడు తిరుమలరావు, రాష్ట్ర కార్యదర్శులుగా ఆమంచి శ్రీనివాసులు, పిసిని చంద్రమోహన్, రత్నం అయ్యప్ప, గెడ్డం మహాలక్ష్మి, చాగంటి మురళీకృష్ణ, మండలి రాజేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా చిత్తలూరు సుందర రామిరెడ్డి, పాతూరు నారాయణ స్వామి, మేడి శెట్టి సూర్యకిరణ్‌ను నియమించారు. వీరితోపాటు పిఎసి సభ్యులుగా పడాల అరుణ, విశాఖ రూరల్ అధ్యక్షులుగా పంచకర్ల రమేష్‌బాబు, ఉంగుటూరు ఇన్‌ఛార్జిగా పత్సమట్ల ధర్మరాజు, ఉండి ఇన్‌ఛార్జిగా జుత్తిగ నాగరాజును ప్రకటించారు.

## పోలీసు శాఖలో అవినీతిపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీసు శాఖలో రూ.36.53 కోట్ల అవినీతి, అధికారులకు, రాజకీయ నాయకులకు మధ్య అక్రమ అనుబంధాన్ని తెలియజేస్తోందని, వెంటనే దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ చలానాల పేరుతో ఆటో డ్రైవర్లు, వాహన వినియోగదార్ల ముక్కుపిండి, వేధింపులకు గురిచేసి వసూలు చేసిన మొత్తం అవినీతిపాలు కావడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చలానా వేధింపులు ఆపాలని, గత ప్రభుత్వ హయాంలోనే గరిష్టంగా రెండుకోట్ల విలువైన టెండరును ఒక్క రూపాయికే అప్పగించడం, దానిని పోలీసుశాఖ నమ్మడం, వైసిపి ప్రభుత్వం ఆ కాంట్రాక్టును కొనసాగించడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు చలానాల ద్వారా వసూలైన సొమ్ము వేరేఖాతాల్లోకి మళ్లినా గుర్తించలేకపోవడం, ఆడిట్ నిర్వహణలోపం ఉందని పోలీసుశాఖ ప్రకటించడం, అవినీతి దృష్టికి వచ్చినా వెంటనే స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దోషులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆటో డ్రైవర్లు, వాహన వినియోగదారులపై చాలానా వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.



ఆసియాక్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో ముఖ్యమంత్రి జగన్, మంత్రి రోజ

## క్రీడాకారులకు సిఎం అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన రాష్ట్రానికి చెందిన పలువురు క్రీడాకారులు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని సిఎం అభినందించారు. అంతర్జాతీయ వేదికలపై తెలుగువారి ఖ్యాతిని నిలబెడుతున్నారని సిఎం అన్నారు. ఇటీవల చైనాలోని హాంగ్జౌ నగరంలో జరిగిన 19వ ఆసియా క్రీడల్లో రాష్ట్రానికి చెందిన పలువురు క్రీడాకారులు 11 పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వం నిబంధనల ప్రకారం వారికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను విడుదల చేసింది. వీరిలో వెన్నం జ్యోతి సురేఖకు రూ.90 లక్షలు, ఆర్ సాత్విక్‌సాయిరాజ్‌కు రూ.50 లక్షలు, బి అనూషకు రూ.30 లక్షలు, మైనేని సాకేత్‌సాయి, కిడాంబి శ్రీకాంత్, యర్రాజీ జ్యోతి, బొమ్మదేవర ధీరజ్, కోనేరు హంపికి రూ.20 లక్షలు చొప్పున విడుదల చేశారు. నగదు పురస్కారంతోపాటు పతకాలు సాధించినందుకు ఇచ్చే ప్రోత్సాహక బకాయిలను కలిపి మొత్తం రూ.4.29 కోట్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా, శాప్ ఎమ్‌డి ఎం ధ్యానచంద్ర, అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

## ఐబి సిలబస్‌పై అసత్య ప్రచారం

- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్న ఇంటర్నేషనల్ బాక్యులరేట్ (ఐబి) సిలబస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రతి విద్యార్థి అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవాలనే ఉద్దేశంతో ఐబిను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐబితో కలిసి ముందుకు సాగటానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.149 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. అంతేగానీ రూ.4,500 కోట్లు ఖర్చు చేయడం లేదని తెలిపారు. 3వ తరగతి నుంచి టోఫెల్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. బైజూస్ కంటెంట్‌తో కూడిన ఉచిత ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనరు ఎస్ సురేష్ కుమార్, సమగ్ర శిక్ష డైరెక్టరు బి శ్రీనివాసరావు, ఎఎస్‌పిడి కెవి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## 'ఎపి హేట్స్ జగన్'

- టిడిపి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ఎపి హేట్స్ జగన్' పేరుతో టిడిపి పుస్తకాన్ని ఆవిష్కరించింది. పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడుతోపాటు మరికొందరు నేతలు శుక్రవారం ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్ల వైఎస్ జగన్ దుర్మార్గపు పాలనకు, ప్రజల అంతరంగానికి అక్షర రూపం ఈ పుస్తకం అని అన్నారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, జాబ్ కేలండరు, మద్యపాన నిషేధం, సిపిఎస్ రద్దు, ప్రత్యేక హోదా, 25 లక్షల ఇళ్ల నిర్మాణం, పోలవరం నిర్మాణం, అమరావతి ఆకాంక్షలు ఏమయ్యాయో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజధాని అమరావతిని సర్వనాశనం చేసిన జగన్ ఉత్తరాంధ్రను దోచుకోవడానికే మకాం విశాఖపట్నానికి మారుస్తున్నారని విమర్శించారు. రుషికొండపై ప్రజల సొమ్ముతో విలాసవంతమైన రాజ ప్రసాదాన్ని నిర్మించుకుంటున్నారని పేర్కొన్నారు. గతంలో రాజధాని నిర్మాణంపై పిచ్చికూతలు కూసిన మంత్రి బొత్స రుషికొండ నిర్మాణాలపై ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కిమిడి కళా వెంకట్రావు, నక్కా ఆనంద్‌బాబు, కెఎస్ జవహర్, పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య, ఎమ్మెల్సీ అనురాధ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**జగన్ ఇంటి నిర్మాణానికి రూ.400 కోట్లు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నంలో తన ఇంటి కోసం రూ.400 కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నారని టిడిపి మహిళా అధ్యక్షులు వంగలపూడి అనిత, పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో ఇరువురూ విలేకరులతో మాట్లాడారు. జగన్‌ను విశాఖకు రమ్మని ఎవరు అడిగారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లను తన తమ్ముడికి, బినామీలకు కట్టబెట్టడం కోసం జగన్ టెండర్ నిబంధనలు మార్చేశారని ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు.

## గోప్యంగా 'స్కిల్' కేసు వివరాలు

- హైకోర్టులో పిల్ దాఖలు

ప్రజాశక్తి-అమరావతి

స్కిల్ డెవలప్‌మెంటు కేసు వివరాలు బహిర్గతం చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఆ కేసులో సిఐడి తరపున వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సిఐడి చీఫ్ సంజయ్‌ను ప్రతివాదులుగా పేర్కొంటూ ఎపి యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టిఐ క్యాంపెయిన్ ఛైర్మన్ ఎన్ సత్యనారాయణ పిల్ దాఖలు చేశారు. స్కిల్ కేసు ఇతర కేసుల వివరాలను వెల్లడించకుండా, విలేకరుల సమావేశాలు నిర్వహించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

వారిద్దరూ నిర్వహించిన విలేకరుల సమావేశాలపై విచారణకు ఆదేశించాలన్నారు. విలేకరుల సమావేశాలకు అయిన ఖర్చులను వారి నుంచి వసూలుకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. వారి చర్యలు నైతిక విలువలకు తిలోదకాలు ఇవ్వడమేనని అన్నారు. చంద్రబాబుతోపాటు ఇతర నిందితుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని, అధికార పార్టీకి అనుకూలంగా మాట్లాడుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సెంట్రల్ సివిల్ సర్వెంట్ రూల్స్‌కు విరుద్ధంగా వారి చర్యలు ఉన్నాయన్నారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. వ్యక్తిగత హోదాలో పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సంజయ్‌ను కూడా చేర్చారు.

## నేడు గగన్‌యాన్ టెస్ట్ వెహికల్ ప్రయోగం

**ప్రజాశక్తి-సూళ్లూరుపేట (తిరుపతి)**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (షార్) చంద్రయాన్-3, ఆదిత్య -1 ప్రయోగ విజయాలతో రెట్టింపు ఉత్సాహంతో సరికొత్త ప్రయోగానికి నాంది పలుకుతుంది. భవిష్యత్‌లో జరిగే మానవ సహిత రాకెట్ ప్రయోగాల కోసం జరిపే పరిశోధనల్లో భాగంగా మానవరహిత కృమాడ్యులును ప్రయోగించనుంది. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదికపై నుంచి టెస్ట్ వెహికల్ - డి1 రాకెట్ ద్వారా కృమాడ్యూల్‌ను ప్రయోగించనున్నారు. 17 కిలోమీటర్లు ఎత్తు వరకు వెళ్లి అక్కడ నుంచి ప్యారాచూట్ల సహాయంతో శ్రీహరికోటకు సరిగ్గా పది కిలోమీటర్ల దూరంలో 4520 కిలోల బరువు కలిగిన కృమాడ్యూల్ బంగాళాఖాతంలో పడనుంది. నేవీ వారి సహాయంతో తిరిగి మాడ్యూల్‌ను వెనక్కు తీసుకురానున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మాడ్యూళ్లలో మనుషులను పైకి పంపడం జరుగుతుంది. అవి తిరిగి సురక్షితంగా భూమి మీదకు చేరుకునేలా పరీక్షల నిమిత్తం ఈ ప్రయోగాన్ని ఇస్రో నిర్వహించనుంది. ఇలాంటి ప్రయోగాలు విజయవంతమైతే అంతరిక్ష పర్యటనలు సులభతరం కానున్నాయి.

## పండ్ల తోటల రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్షులుగా రామకృష్ణుడు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**



ఆంధ్రప్రదేశ్ పండ్ల తోటల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా రామకృష్ణుడు, ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, కార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. తాడిపత్రిలో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా త్రిలోక్, జి.రాజారామిరెడ్డి, వెంకటచౌదరి, గార్లదిన్నె చెన్నారెడ్డి, వరదాయపల్లి లక్ష్మీనారాయణరెడ్డితో కూడిన 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. పండ్ల తోటల రైతుల డిమాండ్ల సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతాంగాన్ని సమీకరించి సమస్యల పరిష్కానికి నూతన కమిటీ పోరాటాలు నిర్వహించనుందని చెప్పారు.

# కొమ్మమూరు కాలువకు అత్యవసరంగా నీళ్లు విడుదల చేయాలి

**వారబందీ జరిపయినా వరి పంటను కాపాడాలి : వి శ్రీనివాసరావు**

**ప్రజాశక్తి- కారంచేడు (బాపట్ల జిల్లా)**

రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా కొమ్మమూరు కాలువకు సాగు నీటిని విడుదల చేయాలని, వారబందీ జరిపయినా వరి పంటను కాపాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామం పరిధిలో సాగునీరు అందక ఎండిపోయి బీటలు వారిన పొలాలను స్వర్ణ గ్రామ రైతులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. నీరు రాక పంటలు చేతికందకపోతే తమకు చావే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టిసీమ, పులిచింతల ద్వారా కొమ్మమూరు కాలువకు ప్రభుత్వం సాగు నీరందించలేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద ఉన్న వేలాదిమంది రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారని, కృష్ణా నది పక్కనే ఉన్న అవనిగడ్డ, కంకిపాడు ప్రాంత పొలాలకు నీరు అందక అన్నదాతలు ఆందోళనతో ఉన్నారని అన్నారు. సాగునీటి సమస్య పరిష్కరించకపోతే ప్రభుత్వంపై రైతుల యుద్ధం తప్పదని హెచ్చరించారు. పట్టిసీమ పంపులను అన్నింటినీ పూర్తి స్థాయిలో పనిచేయించాలని, పులిచింతల నుండి కూడా యుద్ధ ప్రాతిపదిక నీరు తీసుకురావాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం అత్యవసరంగా తీసుకోవాలని కోరారు. కాలువ చివరి భూముల వరకూ సాగునీరందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.



కారంచేడు మండలం స్వర్ణ గ్రామం వద్ద సాగు నీరులేక ఎండిపోయిన వరి పైరును పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఎం నేతలు



ఫిర్యాదు చేస్తున్న రాజధాని రైతులు..

## ప్రభుత్వంపై రాజధాని రైతుల ఫిర్యాదు

- కౌలు చెల్లించనందుకు తుళ్లూరులో నిరసన

**ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)**

రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన తమకు ఈ ఏడాది ఇప్పటి వరకు వార్షిక కౌలు చెల్లించకపోవడంతో మున్సిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మిపై శుక్రవారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. వార్షిక కౌలు చెల్లింపులో అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ రైతులు, మహిళలు మండిపడ్డారు. తుళ్లూరు రైతు దీక్షా శిబిరం వద్ద నుంచి పోలీస్ స్టేషన్‌కు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుల కౌలు సొమ్మును సిఎఫ్ఎంఎస్‌లో అప్లోడ్ అయినట్లు చూపినా ఆరు నెలలుగా రైతుల ఖాతాల్లో జమకావడం లేదని తెలిపారు. కౌలు సొమ్ము జమ చేయడంలో అలసత్వం వహించే అధికారులపై పోరాడతామని రైతులు హెచ్చరించారు. తక్షణమే కౌలు చెల్లించాలని స్టేషన్ వద్ద నినాదాలు చేశారు. రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లో 22,736 మంది రైతులకు కౌలు పరిహారం చెల్లించాల్సి ఉండగా, మూడు నెలల క్రితం కోర్టును ఆశ్రయించిన 2400 మందికి మాత్రమే కౌలు సొమ్ము చెల్లించారు. మిగతా వారికి చెల్లించకపోవడంతో ఇటీవల హైకోర్టులో రైతులు పిటిషన్ దాఖలు చేశారు. దసరా సెలవుల అనంతరం విచారిస్తామని కోర్టు రైతులకు తెలిపింది. ఈ నేపథ్యంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

## వీణా అవార్డ్స్ నాటిక పోటీలు ప్రారంభం

- తారక రామారావుకు ఎఆర్ కృష్ణ జాతీయ పురస్కారం ప్రదానం

**ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)**



ఎఆర్ కృష్ణ పురస్కారం అందుకుంటున్న తారక రామారావు

కళల కాణాచి, వేదగంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో తృతీయ జాతీయ స్థాయి వీణా అవార్డ్స్-2023 పద్య, సాంఘిక నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 24వ తేదీ వరకు పోటీలను తొలిరోజు పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కోశాధికారిణి బుర్రా జయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభలో తొలుత నగరానికి చెందిన నాట్యాచారిణి వెంకటలక్ష్మి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. వీణా అవార్డ్స్ నిర్వహణపై కళల కాణాచి సంస్థ అధ్యక్షులు బుర్రా సాయిమాధవ్ వివరించారు.

**ఆకట్టుకున్న పద్య నాటికలు**

తొలి రోజున ప్రదర్శించిన పద్య నాటికలు ఆహుతులను అలరించాయి. పోటీల్లో తొలి ప్రదర్శనగా హైదరాబాద్‌కు చెందిన శ్రీ కళానికేతన్ వారి వసంత రాజీయం, చెరుకుపల్లికి చెందిన ఉషోదయ నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన మోహిని భస్మాసుర పద్యనాటకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంఘిక నాటిక ప్రదర్శనల్లో ప్రత్యేక ప్రదర్శనగా హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి ఇంపోస్టర్స్ నాటకాన్ని ప్రదర్శించారు.

**ఎఆర్ కృష్ణ జాతీయ పురస్కారం ప్రదానం**

నాటక పోటీల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు నెమలికంటి తారక రామారావును ఎఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారంతో సత్కరించారు. కళల కాణాచి సంస్థ కార్యదర్శి చెరుకుమల్లి సింగరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎఆర్ కృష్ణ తనయులు ఎపి.నీలం పురస్కారాన్ని అందించి, సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు పి.దక్షిణామూర్తి, అయినాల మల్లేశ్వరరావు, జిఎస్ ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

## డిసెంబరులో సిటిఆర్ఐ ప్లాటినం జూబ్లి ఉత్సవాలు

- పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

రాజమహేంద్రవరంలోని కేంద్రీయ పొగాకు పరిశోధన సంస్థ (సిటిఆర్ఐ) ప్లాటినం జూబ్లి ఉత్సవాలు డిసెంబరు 14 నుంచి 16 వరకు జరుగుతాయని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ ఉత్సవాల సన్నాహక సమావేశం శుక్రవారం సాయంత్రం గుంటూరులోని స్థానిక రైతు భవన్‌లో జరిగింది. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పరిశోధన సంస్థ ఇప్పటి వరకు 103 వంగడాలను విడుదల చేసి రైతులకు ఎంతో మేలు చేసిందన్నారు. దేశానికి రూ.9700 కోట్ల వరకు విదేశీ మారక ద్రవ్యాన్ని అందించిందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 4.5 కోట్ల మందికి పొగాకు పరిశ్రమ ఉపాధి చూపిసొందన్నారు. 1947లో ఏర్పాటు చేసిన ఈ పరిశోధన సంస్థ అభివృద్ధికి ఎంతో మంది కృషి చేశారని తెలిపారు. రాజమండ్రి సిటిఆర్ఐకు అనుబంధంగా దేశ వ్యాప్తంగా మరో 17 పరిశోధన సంస్థలు ఉన్నాయని తెలిపారు. ప్లాటినం జూబ్లి ఉత్సవాలకు కేంద్ర వ్యవసాయ, వాణిజ్యశాఖ మంత్రులు, కేంద్ర ఉన్నతాధికారులు హాజరు అవుతారని తెలిపారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ టుబాకో సైన్సెస్ ప్రెసిడెంట్ ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ.. వివిధ శాఖల సమన్వయంతో ప్లాటినం జూబ్లి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు చర్చా గోష్టులు, రైతులకు ఇవ్వాల్సిన సూచనలు, సలహాలపై చర్చిస్తామన్నారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల విసిలను కూడా ఈ ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. సిటిఆర్ఐ డైరక్టర్ ఎల్.కె. ప్రసాద్, ప్రిన్సిపల్ సైంటిస్టు హెచ్.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.


LAURUS Labs
Knowledge . Innovation . Excellence

**లారస్ ల్యాబ్స్ లిమిటెడ్**

కార్పొరేట్ గుర్తింపు సంఖ్య: L24239AP2005PLC047518

**రిజిస్టర్డ్ ఆఫీస్:** లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా - 531 021, ఆంధ్రప్రదేశ్.

**కార్పొరేట్ ఆఫీస్:** 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం. 7, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ.

Phone: +91 40 6659 4333; Fax: +91 40 6659 4320
Email: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com

**రికార్డు తేది ప్రకటన**

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 91 యొక్క నియమాలు మరియు రూల్స్ మరియు ది సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్స్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్స్ 42&43 అనుసరించి, అక్టోబర్ 20, 2023న నిర్వహించబడిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఆర్థిక సం॥ 2023-24 కొరకు ప్రతి వాటా ముఖ విలువ రూ. 2/- తో వాటా ఒక్కంటికి రూ. 0.40 (20%)గా మధ్యంతర డివిడెండ్ చెల్లించుటకై వాటాదారుల అర్హత నిర్ధారించుట కొరకు "రికార్డు తేది"ని నవంబర్ 02, 2023"గా నిర్ణయించబడినది మరియు నవంబర్ 09, 2023 న లేదా తరువాత డివిడెండ్ చెల్లించబడుతుంది.

తదుపరి, ఈ ప్రకటన కంపెనీ యొక్క వెబ్‌సైటు www.lauruslabs.com వద్ద కూడా అందుబాటులో ఉంటుంది.

బోర్డు ఆదేశం మేరకు
**లారస్ ల్యాబ్స్ లిమిటెడ్** తరఫున
సం/- **జి. వెంకటేశ్వర్ రెడ్డి**
కంపెనీ సెక్రటరీ

**ప్రదేశం:** హైదరాబాద్
**తేది:** 20.10.2023


## అధిక వడ్డీ రేట్లు కొనసాగుతాయ్..

- ఎంతకాలమో చెప్పలేము
- ఆహార ద్రవ్యోల్బణంలో అనిశ్చిత్తి
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్

**న్యూఢిల్లీ / వాషింగ్టన్ :** రుణ గ్రహీతలు హెచ్చు వడ్డీ రేట్లను మరికొంతకాలం భరించాల్సిందే. అధిక వడ్డీ రేట్లు ఎంత కాలం కొనసాగుతాయో చెప్పలేమని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో దాస్ మాట్లాడుతూ.. కొంతకాలం వడ్డీ రేట్లు ఇదే స్థాయిలో కొనసాగుతాయన్నారు. ప్రస్తుత ఆర్థిక విధాన రూపకల్పన సంక్లిష్టంగా మారిందన్నారు. 2023లో ఇప్పటివరకు పాలసీ రేట్లపై ఆర్‌బిఐ విరామం కొనసాగించిందన్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల వల్ల ద్రవ్యోల్బణం కట్టడికి కేంద్ర బ్యాంకులన్నీ వడ్డీ రేట్లు పెంచాయన్నారు. ఈ క్రమంలో ఆర్‌బిఐ సైతం 2022 మే నెల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వరుసగా వడ్డీ రేట్లను పెంచుతూ రెపోరేటును దాదాపు 250 బేసిస్ పాయింట్ల (2.5 శాతం) మేర హెచ్చించింది. ఇప్పటికే రెపో రేటు 6.50 శాతానికి చేరింది. ఈ రుణ రేట్లు ఎంతకాలం స్థిరంగా ఉంటాయో అప్పుడే చెప్పలేమని, కాలమే దానికి సమాధానం చెప్పొచ్చని శక్తికాంత అన్నారు. ప్రపంచ వద్ధిలో మందగమనం, ద్రవ్యోల్బణం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉందన్నారు. ఆహార ద్రవ్యోల్బణంలో అనిశ్చితి నెలకొందన్నారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్‌బిఐతో సహా సెంట్రల్ బ్యాంకులు ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడంలో బాధ్యత వహించాలన్నారు. ముడి చమురు ధర పెరుగుదల, బాండ్ల రాబడి పెరగడం వంటి తాజా సవాళ్లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవరపెడుతున్నాయని దాస్ అన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో అయినా బ్యాంకులు కనీస మూలధన అవసరాలను తీర్చగల సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని అంచనా వేశారు. రూ.10వేల కోట్ల విలువైన రూ.2వేల నోట్లు వెనక్కి రావాల్సి ఉందని అన్నారు. ప్రస్తుతం 19 ఆర్‌బిఐ ప్రాంతీయ కార్యాలయాల్లో రూ.2వేల నోట్లను స్వీకరిస్తున్నారు.

**రేట్ల పెంపు తప్పదు : యుఎస్ ఫెడ్ ఛైర్మన్**

ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో వడ్డీ రేట్లను మరింత పెంచాల్సి ఉంటుందని అమెరికా ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ అన్నారు. బలమైన ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు రేట్ల పెంపు ఉంటుందన్నారు. ముఖ్యంగా ద్రవ్యోల్బణ కట్టడికి ఈ చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కావాల్సి ఉందన్నారు. ఇందుకోసం భవిష్యత్తులో వడ్డీరేట్లు పెంచక తప్పదన్నారు. ద్రవ్యోల్బణం తగ్గు ముఖం పట్టినా ఇంకా ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతుందన్నారు. ద్రవ్యోల్బణం రెండు శాతానికి పడిపోయేంత వరకు వడ్డీరేట్లు పెంచే అవకాశం ఉందన్నారు.

## రూ.30వేల కోట్ల అదాని సిమెంట్ రుణాల రీఫైనాన్స్

**న్యూఢిల్లీ :** అదాని సిమెంట్ కంపెనీల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి అంతర్జాతీయ బ్యాంక్‌లు అంగీకరించాయని అదాని గ్రూపు వెల్లడించింది. దాదాపు రూ.30వేల కోట్లు (3.5 బిలియన్ డాలర్లు) దీంతో మరిన్ని అనుకూలమైన షరతులతో పాత రుణ స్థానంలో కొత్త రుణాన్ని ఇవ్వనున్నాయి. ఎసిసి, అంబుజా సిమెంట్ కంపెనీలను కొనుగోలు చేయడం కోసం అదాని గ్రూపు వివిధ సంస్థల నుంచి అప్పులను తీసుకుంది. 3.5 బిలియన్ డాలర్ల ఆ రుణాన్ని రీఫైనాన్స్ చేయడానికి 10 అంతర్జాతీయ బ్యాంకులు సానుకూలత వ్యక్తం చేశాయని అదాని గ్రూపు వెల్లడించింది.

## ఐడిబిఐ బ్యాంక్‌కు అసోచామ్ అవార్డులు

**న్యూఢిల్లీ :** ప్రముఖ పారిశ్రామికవేత్తల సంఘం అసోచామ్ తన 18వ వార్షిక బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సెక్టార్ లెండింగ్ సదస్సు అండ్ అవార్డుల కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్‌కు మూడు అవార్డులు దక్కాయి. బ్యాంక్ మిడ్ సైజ్ బ్యాంక్ విభాగంలో "బెస్ట్ డిజిటల్ ఇనిషియేటివ్స్"లో విజేతగా మరియు "బెస్ట్ రిస్క్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఇనిషియేటివ్స్", "బెస్ట్ ప్రొడక్ట్/సర్వీస్ ఇన్నోవేషన్"లో అవార్డులు అందుకున్నట్లు ఐడిబిఐ బ్యాంక్ వెల్లడించింది. ఈ అవార్డులను రిజర్వు బ్యాంకు మాజీ డిప్యూటీ గవర్నర్ ఎన్ఎస్ విశ్వనాథన్, అసోచామ్ అధ్యక్షుడు జి రాజ్‌కిరణ్ రాయ్ సమక్షంలో ఆర్‌బిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ కుమార్ చౌదరి నుంచి ఐడిబిఐ బ్యాంక్ డిఎండి సురేష్ ఖతన్‌హర్‌కు అందజేశారని తెలిపింది.

# నిండా ముంచిన 'రేవతి'

- 25 శాతం వరకూ పంట దిగుబడిపై ప్రభావం

**ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి**



గొల్లప్రోలు మండలం ఎకె.మల్లవరంలో కేళీలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామానికి చెందిన బత్తిన వీరబాబు 50 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. గొల్లప్రోలులో శ్రీ శివసాయి ఏజెన్సీస్ వద్ద 'రేవతి' కంపెనీకి చెందిన విత్తనాలను కొనుగోలు చేసి పంట వేశారు. ప్రస్తుతం పంట ఈనిక దశలో ఉండగా పెద్ద ఎత్తున కేళీలు బయట పడుతున్నాయి. 25 శాతం వరకూ కేళీలు రావడంతో భారీగా నష్టం వచ్చే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో రేవతి రకం సాగు చేసిన పంటల్లో కేళీలు వస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ప్రస్తుతం పంట పొట్ట దశ పూర్తి చేసుకుని ఈనిక దశలో ఉంది. కొన్ని చోట్ల పది పదిహేను రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది పలుచోట్ల కేళీలు బయటపడుతుండడంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడి పెట్టిన రైతులు.. ఇప్పుడు కేళీలను చూసి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రైతులే విత్తనాలను తయారు చేసుకుని పంట సాగు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. విత్తనాల కోసం ప్రయివేటు కంపెనీలను రైతులు ఆశ్రయిస్తున్నారు. వీటిలో నాణ్యత కరువై కేళీలు వస్తున్నాయి. పిఠాపురం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 600 ఎకరాల్లో 25 నుంచి 30 శాతం కేళీలు బయటపడడం తో పలువురు రైతులు గగ్గోలు పెడుతు న్నారు. ఇటీవల నిర్వహించిన స్పందనలో పిఠాపురం మండలం మల్లాం, కందరాడ, ఎఫ్‌కె.పాలెం గ్రామాలకు చెందిన దంగేటి సింహాచలం, ముమ్మిడి చక్రరావు, సాయిబాబు తదితరులు కలెక్టర్ కృతికాశుక్లాకు, గొల్లప్రోలు మండలం ఎకె.మల్లవరానికి చెందిన పి.వెంకట్రావు, టి.గోవిందరాజులు తదితర రైతులు కేళీలపై వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ రెండు ప్రాంతాల్లో రేవతి రకం సాగుచేసిన పంట పొలాలను మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ జెడి, రేవతి కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. ఎకరాకు 25 శాతం వరకూ కేళీలు ఉన్నట్టు గుర్తించారు.

జిల్లాలో జగ్గంపేట, గండేపల్లి, ప్రత్తిపాడు, యూ.కొత్తపల్లి తదితర మండలాల్లో కూడా పెద్ద ఎత్తున కేళీలు బయటపడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. నష్టపోయిన పంటకు పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సమావేశంలో గొల్లప్రోలు జడ్‌పిటిసి సభ్యులు లోవరాజు ఇదే విషయాన్ని లేవనెత్తారు. రేవతి కంపెనీకి సంబంధించిన విత్తనాలను సాగుచేసిన రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని వారికి పరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఎకరాకు రూ.15 వేలకు పైగా నష్టం



పెద్ద ఎత్తున కేళీలు బయటపడడంతో ఎకరాకు రూ.15 వేలకు పైనే నష్టం వచ్చే అవకాశం ఉంది. దీనిపై కంపెనీ వారికి తెలియజేసినా పట్టించుకోలేదు. వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. చివరకు స్పందనలో ఫిర్యాదు చేశాం. శాస్త్రవేత్తలు వచ్చి వెళ్లారు తప్ప నష్టపరిహారంపై స్పష్టత ఇవ్వలేదు.

**- బత్తిన వీరబాబు, కౌలు రైతు, మల్లం**

### పంటలను పరిశీలించాం

కేళీలపై ఫిర్యాదుల నేపథ్యంలో పంటలను పరిశీలించాం. కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించారు. ఎకరాకు 25 శాతం కేళీలు ఉన్నట్లు గుర్తించారు. నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దమ్ములు సక్రమంగా చేయకపోవడం వల్ల వెదజల్లే పద్ధతుల్లో సరైన విధానాలను పాటించకపోవడం వల్ల కూడా కేళీలు వస్తుంటాయి.

**- స్వాతి, ఎడిఎ, పిఠాపురం**

## ఉపాధి లేదు...

- ధరలు భరించలేం
- ఆర్‌బిఐ సర్వేలో ప్రజల గగ్గోలు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

దేశంలో ఉపాధి అవకాశాలు కుదించుకుపోతుండటం, అదే సమయంలో ధరలు రోజురోజుకి పెరుగుతుండటం పట్ల ప్రజానీకం తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తోంది. రిజర్వు బ్యాంకు ఇటీవల నిర్వహించిన కన్స్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సెప్టెంబర్ నెలాఖరు వరకు సర్వే చేసిన వారిలో 44.2 శాతం మంది ఉపాధి అవకాశాలు తగ్గిపోయినట్లు చెప్పారు. 34 శాతం మంది గతంతో పోలిస్తే కొంచెం మెరుగైనట్లు తెలిపారు. 21.8 శాతం మంది మాత్రం గతంలో ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రానున్న ఏడాదిలో కూడా పరిస్థితుల్లో మెరుగుదల ఉండదన్న అభిప్రాయాన్ని . 26.2 శాతం మంది వ్యక్తం చేశారు. 29.6 శాతం మంది ఎటువంటి అభిప్రాయం వెల్లడించలేదు.

**ధరా భారం భరించలేం..!**

అధిక ధరలతో ప్రజానీకం బెంబేలెత్తుతోంది. ఆర్‌బిఐ సర్వేలో ఏకంగా 91.8 శాతం మంది ధరల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులు కొనుగోలు కూడా కష్టంగా ఉందన్న అభిప్రాయాన్ని వీరు వ్యక్తం చేశారు. రానున్న సంవత్సరంలో కూడా ప్రభుత్వాలు ధరలను అదుపుచేయలేవన్న అభిప్రాయాన్ని 78.4శాతం మంది వ్యక్తం చేశారు.

## హాలోనిక్స్ నుంచి అప్‌డౌన్ గ్లో ఎల్ఇడి బల్బ్‌లు




**న్యూఢిల్లీ :** విద్యుత్ ఉపకరణాల కంపెనీ హాలోనిక్స్ టెక్నాలజీస్ దేశంలోనే తొలిసారి 'అప్ డౌన్ గ్లో' ఎల్ఇడి బల్బ్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపింది. దీని మీద భాగం (డోమ్), క్రింది భాగం (స్టెమ్) విభిన్న రంగుల్లో వెలుగుతూ.. 3 వేర్వేరు స్విచ్‌ల పద్ధతిలో గదుల్లో లైట్లతో మ్యాజిక్ సృష్టించుకునే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొంది. ఇవి 360 డిగ్రీల్లో కాంతిని వెదజల్లుతాయని తెలిపింది. దీని ధరను రూ.299గా నిర్ణయించింది.

## ఫిజిక్స్ వాలా విస్తరణ

**హైదరాబాద్ :** ఎడ్‌టెక్ వేదిక ఫిజిక్స్ వాలా (పిడబ్ల్యు) కొత్తగా ఫిజిక్స వాలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. దీంతో తాను అందించే కోర్సులను, బోధన విస్తరణతో విద్యకు సరికొత్త నిర్వచనం ఇవ్వాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో అద్భుతమైన విజయాన్ని దక్కించుకోవడంతో తాజాగా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఇది మూడేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్ కాగా, ఇది భవిష్యత్తులో నిర్వహణ, సాంకేతికత క్షేత్రాలతో బిజినెస్, ఎంటర్‌ప్యూనర్‌షిప్‌లో భవిష్యత్తు నాయకులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిందని ఆ సంస్థ సిఒఒ ఆదిత్య అగర్వాల్ పేర్కొన్నారు.


**SIGACHI INDUSTRIES LIMITED**
229/1&9, కళ్యాన్'స్ తుల్సిరామ్ చాంబర్స్, మదీనాగూడ, హైదరాబాద్-500049, తెలంగాణ.
CIN: L24110TG1989PLC009497

**అసాధారణ సర్వసభ్య సమావేశం, రిమోట్ ఇ-ఓటింగ్ సమాచారపు ప్రకటన**

1. ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, ఇజియం నోటీసులో ఇచ్చినట్లుగా వ్యాపార సమీక్షకుగాను కంపెనీ యొక్క ఆర్థిక సం॥ 2023।24 కొరకు, 2వ అసాధారణ సర్వసభ్య సమావేశం (ఇజిఎం), శనివారం, 11 నవంబర్ 2023న ఉ॥ 11.00గం.లకు విడియో కాన్ఫరెన్సింగ్& ఇతర ఆడియో-విజువల్ మాధ్యమాలు (విసి) ద్వారా నిర్వహించబడుతుంది.
2. సెబీ సర్క్యులర్ నం.సెబి/హెచ్ఓ/సిఎఫ్‌డి/సిఎండి2/సిఐఆర్/పి/2021/11 తేది: జనవరి 15, 2021 మరియు సెబి/హెచ్ఓ/సిఎఫ్‌డి/సిఎండి1/సిఐఆర్/పి/2020/79 తేది మే 12, 2020 మరియు సర్క్యులర్ నం.14/2020 తేది: ఏప్రిల్ 08, 2020 మరియు సర్క్యులర్ నం.17/2020 తేది ఏప్రిల్ 13, 2020, 22/2020 తేది జూన్ 15, 2020, 33/2020 తేది సెప్టెంబర్ 28, 2020, 39/2020 తేది: డిసెంబర్ 31, 2020, 10/2021 తేది: జూన్ 23, 2021 మరియు 20/2021 తేది డిసెంబర్ 08, 2021 (సేకరణలో "ఎంసిఏ సర్క్యులర్స్") తో అనుసరించి సర్క్యులర్ నం.11/2022 తేది: డిసెంబర్ 28, 2022, 20/2020 తేది మే 05, 2020తో చదువబడే ఎంసిఏ జెనరల్ సర్క్యులర్ నం.02/2021 తేది: జనవరి 13, 2021తో చదువబడే కంపెనీల చట్టం 2013 యొక్క వర్తించు నియమాలతో అనుసరించి, విసి/ఓఎవిఎం ద్వారా ఇజియం సమాచారం ఇవ్వబడుచున్నది. ఇజియం కొరకు సభ్యుల భౌతిక హాజరు అవసరంలేదు. ఇజియం నోటీసులో సిఫారసుచేసిన విధానం పాటించుట ద్వారా ఇజియంకు విసి/ఓఎవిఎం ద్వారా ఇజియంకు సభ్యులు హాజరవవచ్చును.
3. పై చెప్పిన సర్క్యులర్స్ యొక్క నియమాలలో, ఎవరైతే కంపెనీతో, రిజిస్ట్రార్ & వాటా బదిలీ ఏజెంట్/డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో ఇ-మెయిల్ ఐడిలు రిజిస్టర్‌చేసుకొన్నారో అట్టి వాటాదారులకు ఇజియం యొక్క నోటీసు యొక్క ఎలక్ట్రానిక్ కాపీలు వాటాదారులందరకి పంపు ప్రక్రియను 20 అక్టోబర్ 2023న పూర్తిచేయుట జరిగింది. అందుకుగాను, ఇజియం యొక్క భౌతిక కాపీలు డిస్పాచ్‌చేయబడినవి. ఈ పత్రాలు కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.sigachi.comమరియు స్టాక్ ఎక్స్ఛేంజి వెబ్‌సైట్ అనగా., బిఎస్ఇ లిమిటెడ్www.bseindia.comవద్ద మరియు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి ఆఫ్ ఇండియా లిమిటెడ్www. nseindia.com నుండి అక్సెస్‌చేయవచ్చును.
4. వాటాదారులు ఇజియంకు హాజరగు సదుపాయం సిడిఎస్ఎల్ ఇ-ఓటింగ్ సిస్టమ్స్ ద్వారా విసి/ఓఎవిఎం ద్వారా ఇజియంకు హాజరగుటకు సదుపాయం కల్పించబడుతుంది. దానిని వాటాదారులు రిమోట్ ఇ-ఓటింగ్ క్రెడిన్షియల్స్ వినియోగించుట ద్వారా వాటాదారులు/సభ్యుల లాగిన్ క్రింద https://www.evotingindia.comవద్ద దానిని అక్సెస్ చేయవచ్చును. విసి/ఓఎవిఎం కొరకు లింకు కంపెనీ యొక్క ఇవిఎస్ఎన్ యొక్క వాటాదారుల సభ్యులులో అందుబాటులో ఉంటుంది.
5. సమయానుసారం సవరించినట్లుగా కంపెనీల (మేనేజిమెంట్ & అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 యొక్క రూల్ 20తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 108 క్రింద కోరినట్లుగా, కంపెనీ యొక్క వాటాదారులకు ఇ-ఓటింగ్ సదుపాయం కల్పించుటకు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ యొక్క సేవలను కంపెనీ వినియోగిస్తుంది. కటాఫ్ తేది అనగా., 4 నవంబర్ 2023 నాటికి డిమెటిరియలైజ్డ్ రూపంలో వాటాలు కలిగియున్న సభ్యులు, సిడిఎస్ఎల్ యొక్క ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం ద్వారా ఇజియం నోటీసులో ఇవ్వబడినట్లుగా వ్యాపారం పై ఎలక్ట్రానిక్‌గా వారి ఓట్లువేయవచ్చును (రిమోట్ ఇ-ఓటింగ్). ఇందుమూలంగా సభ్యులకు తెలియజేయబడుచున్నది:

ఎ) ఇజియం నోటీసులో ఇవ్వబడినట్లు వ్యాపారంను ఇజియం వద్ద రిమోట్ ఇ-ఓటింగ్ విధానాల ద్వారా సమీక్షించవచ్చును.

బి) రిమోట్ ఇ-ఓటింగ్ 08.11.2023 (భా.కా.ప్ర. ఉ॥9.00గం.లు)కు ప్రారంభమై మరియు 10.11.2023 (భా.కా.ప్ర.సా॥5.00గం.లు)కు ముగించబడుతుంది. సభ్యులు తీర్మాణంపై ఒకసారి ఓటువేసిన తరువాత, సభ్యులు దానిని వారికి అనుకూలంగా మార్చుకొనుటకు అనుమతించబడదు.

సి) ఇజియం వద్ద రిమోట్ ఇ-ఓటింగ్ విధానాల ద్వారా ఓటుకు అర్హత నిర్ధారించుట కొరకు కటాఫ్ తేది 4 నవంబర్ 2023.

డి) రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యూలు 10.11.2023న భా.కా.ప్ర. సా॥5.00గం.ల తరువాత డిసబుల్డ్‌చేయబడుతుంది.

ఇ) కంపెనీ యొక్క వాటాలు కలిగియున్న ఎవరైనా వ్యక్తి మరియు నోటీసు పంపబడిన తరువాత కంపెనీ సభ్యుడైన మరియు కటాఫ్ తేది నాటికి వాటాలు కలిగియున్న వారు కంపెనీ ఆర్‌టిఎ అనగా., బిగ్‌షేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కు అభ్యర్ధన పంపుట ద్వారా లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందవచ్చును. అయితే, అతను/ఆమె రిమోట్ ఇ-ఓటింగ్ కొరకు ఇప్పటికే సిడిఎస్ఎల్‌తో రిజిస్టరై ఉంటే, అతను/ఆమె ఇప్పటికే ఉన్న యూజర్ ఐడిలు& పాస్ వర్డ్‌ను ఓటువేయుట కొరకు వినియోగించుకోవచ్చును.

ఎఫ్) ఇ-ఓటింగ్ కొరకు సదుపాయం ఇజియం సమయంలో అందుబాటులో ఉంటుంది మరియు అట్టి సభ్యులు విసి సదుపాయం ద్వారా ఇజియంలో హాజరవవచ్చును మరియు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా తీర్మానం పై వారి ఓటువేయని వారు మరియు లేదా ఇతర విధానాల ద్వారా ఇజియం వద్ద ఇ-ఓటింగ్ విధానాల ద్వారా ఓటుకు అర్హత పొందుట కొరకు చింతించాల్సిన అవరంలేదు. ఇజియంకు ముందు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓట్లు వేసిన సభ్యులు ఇజియంకు హాజరవవచ్చును కాని తిరిగి వారు అచ్చుట ఓట్లను వేయలేరు.

జి) డిమెటరియలైజ్డ్ విధానంలో వాటాలు కలిగియున్న సభ్యులు కొరకు రిమోట్‌గా ఓటింగ్ విధానం మరియు సభ్యులు వారి ఇ-మెయిల్ చిరునామా రిజిస్టర్‌చేసుకొని వారికి ఇజియం నోటీసులో ఇవ్వబడుతుంది.

హెచ్) సదరు డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి ఇ-మెయిల్ అడ్రెస్ రిజిస్టరుచేసుకోని సభ్యులు ఇజియం నోటీసు యొక్క కాపీలు, రిమోట్ ఇ-ఓటింగ్ సూచనలు మరియు ఇజియం పై పాల్గొనుట కొరకు సూచనలు పొందుటకు విసి ద్వారా కంపెనీ యొక్క రిజిస్ట్రార్ & వాటా బదిలీ ఏజెంట్, బిగ్‌షేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ bsshyd@bigshareonline.com/prabhakar@bigshareonline.comవద్దవారి ఇమెయిల్ అడ్రెస్ రిజిస్టరుచేసుకోవలసిందిగా కోరబడుచున్నది.

ఐ) ఇ-ఓటింగ్‌కు సంబంధించిన ఏవేని సందేహాలు లేదా సమస్యల విషయంలో, మీరు తరుచుగా అడుగు ప్రశ్నలు ("ఎఫ్ఎక్యూ"లు)ను మరియుwww.evotingindia.com, వద్ద హెల్ప్ సెక్షన్ క్రింద అందుబాటులోగల ఇ-ఓటింగ్ మాన్యువల్‌ను పరిశీలించవచ్చును లేదా ఇమెయిల్ హెల్ప్‌డెస్క్ helpdesk. evoting@cdslindia.com ను వ్రాయవచ్చును లేదా 1800225533 లేదా సంప్రదించండి శ్రీ ప్రభాకర్, డిజిఎం రిజిస్ట్రార్ & వాటా బదిలీ ఏజెంట్, బిగ్‌షేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోన్:022-62638200 ఇమెయిల్:.email: prabhakar@bigshareonline.com

జె) పారదర్శకంగా మరియు ప్రశాతంగా ఇజియం వద్ద ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్ ప్రక్రియను స్క్రుటినైజ్‌చేయుటకు స్క్రుటినైజర్‌గా మిస్.ఆకాంక్ష, ప్రాక్టిసింగ్ కంపెనీ సెక్రటరీను కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నియమించారు. స్క్రుటినైజర్ రిపోర్టుతోపాటు ఫలితాలు ఇజియం ముగిసిన తరువాత నుండి 48గం.ల్లోగా స్టాక్ ఎక్స్ఛేంజిలకు తెలియజేయబడుతుంది మరియు కంపెనీ యొక్కవెబ్‌సైట్ www.sigachi.comపై కూడా ఉంచబడుతుంది.

**Sigachi Industries Limited**
సం/-
**అమిత్ రాజ్ సిన్హా**
మేనేజింగ్ డైరెక్టర్ & సిఇఓ
(DIN: 01263292)

ప్రదేశం: హైదరాబాద్
తేది: 19.10.2023

సంపాదకీయం

# మోసమే రెట్టింపు

అన్నదాతల ఆదాయాలను రెట్టింపు చేస్తామని నమ్మబలికి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ఆది నుంచి వంచిస్తూనేవుంది. కీర్తిశేషులు ఎంఎస్ స్వామినాథన్ ప్రతిపాదనల ప్రకారం రైతన్నలకు మద్దతు ధర అందిస్తామని ఊదరగొట్టిన మోడీ సర్కార్ ప్రతియేటా నయవంచనలతో ఉసూరుమనిపిస్తోంది. రబీ పంటలకు తాజాగా ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) విషయంలోనూ రైతుల పట్ల తన అమానవీయ వైఖరిని కేంద్ర ప్రభుత్వం మరోమారు చాటుకుంది. 2024-25 రబీ సీజన్‌కు గానూ గోధుమలు క్వింటాలుకు రూ.2275 (రూ.150 పెంపు), మసూర్ రూ.6425 (రూ.425), ఆవాలు రూ.5650 (రూ.200), కుసుమలు రూ.5800 (రూ.150), బార్లీ రూ.1850 (రూ.115), శనగ రూ.5440 (రూ.105) ఆరు పంటలకు కనీస మద్దతు ధర పెంచుతున్నామంటూ కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. కానీ పెంపు అనే మాట పచ్చి బూటకం. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారాల ధరలు ఆకాశానికి ఎగబాకాయి. ఈ ధరాఘాతానికి కూడా మోడీ సర్కార్ అనుసరిస్తున్న విధానాలే కారణం. పెరిగిన సాగు పెట్టుబడులను పరిగణలోకి తీసుకోకుండా గత మద్దతు ధరల కంటే ఎక్కువగా ఇస్తున్నామని ఊదరగొట్టడం వంచన కాదా?

కేంద్ర వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సిఎసిపి) ప్రతిపాదనల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పి ఖరారు చేస్తుంది. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారకాలకు రైతు నేరుగా వెచ్చించే (ఎ2) మొత్తాన్ని, కుటుంబ శ్రమ (ఎఫ్ఎల్)ను మాత్రమే పరిగణనలోకి తీసుకొని (ఎ2 ప్లస్ ఎఫ్ఎల్) సిఎసిపి కనీస మద్దతు ధర నిర్ణయిస్తోంది. కౌలు, రుణాలపై వడ్డీ వంటివాటితో కలిపి సమగ్ర సాగు పెట్టుబడిగా పరిగణించే (సి2) ఆధారంగా చేసుకొని దానికి కుటుంబ శ్రమను కలిపి దానికి అదనంగా 50 శాతం జత చేసి కనీస మద్దతు ధర నిర్ణయించాలని స్వామినాథన్ కమిటీ దశాబ్దాల కిందటే ప్రతిపాదించింది. అందువల్ల మోడీ సర్కార్ ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నట్లు ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ ఆధారంగా ఎంఎస్‌పి నిర్ణయించినా..దానిని కూడా వాస్తవ ధరలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయించడం రైతులకు ద్రోహం చేయడమే.

ముఖ్యంగా ఎన్నికలు జరుగుతున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణ రైతులను తప్పుదారి పట్టించేందుకే మోడీ సర్కార్ అబద్దాలతో కూడిన ఈ మద్దతు ధర పాచికను విసిరినట్లు స్పష్టమవుతోంది. సి2 వ్యయానికి, ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ వ్యయానికి మధ్య తేడా చాలా ఎక్కువ ఉంది. రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలకు, సిఎసిపి ప్రతిపాదనలకు మధ్య తేడా కూడా హస్తిమశకాంతరంగా ఉంటుంది. గోధుమ పంటకు క్వింటాల్‌కు సి2 వ్యయాన్ని రూ.2051గా పంజాబ్ ప్రభుత్వం అంచనా వేసింది. అదే సమయంలో సిఎసిపి చేపట్టిన ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ వ్యయం క్వింటాల్‌కు కేవలం రూ.741గా వుంది. అంటే సి2 వ్యయానికన్నా క్వింటాల్‌కు ఏకంగా రూ.1310 తక్కువగా వుంది. ఆ మేరకు అన్నదాతలను మోడీ సర్కార్ నిలువునా వంచించినట్లే. పంజాబ్‌లో దాదాపు 35 లక్షల హెక్టార్లలో గోధుమ పంట సాగవుతోంది. ఈ రకంగా పంజాబ్ రైతులు ఒక్క గోధుమ పంటకు సంబంధించే ఏకంగా రూ.13,500 కోట్లు నష్టపోతున్నారు. మహారాష్ట్రలో ఏటా గోధుమ రైతుల నష్టం రూ.4640 కోట్లుగా వుంది. తెలంగాణలో అధికారం కోసం పడరాని పాట్లు పడుతున్న బిజెపి ..శనగలకు మద్దతు ధర విషయంలో ఎన్నికల సమయంలోనూ మొండి చేయి చూపింది. తెలంగాణ రాష్ట్ర సి2 అంచనా క్వింటాల్‌కు రూ.6055గా వుండగా, ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ క్వింటాల్‌కు కేవలం రూ.2290గానే వుంది. అంటే రూ.3765 తక్కువగా వుంది. క్వింటాల్ ఎంఎస్‌పిని రూ.9351గా ప్రకటించాలని తెలంగాణ కోరుతుంటే కేంద్రం రూ.5440 మాత్రమే ప్రకటించింది. అంటే క్వింటాల్‌కు రూ.3911 చొప్పున నష్టంతో తెలంగాణ రైతులు హెక్టార్‌కు రూ.58,665 నష్టపోతున్నారు. ఓట్లేసి గెలిపిస్తే డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామంటూ మోసాలకు ఒడిగడుతున్న బిజెపిని నామరూపాల్లేకుండా చేయడం ద్వారానే ఇలాంటి వంచనలకు గురికాకుండా గట్టెక్కగలం. స్వామినాథన్ ప్రతిపాదనలకు అనుగుణంగా (సి2 ప్లస్ 50)తో కనీస మద్దతు ధర ప్రతి పంటకూ దక్కేలా చట్టం తీసుకొస్తేనే వ్యవసాయానికి మనుగడ దక్కేది.

మహనీయుల మాట



ఆరోగ్యాన్ని ఎప్పుడూ
ఆదాయ వనరుగా చూడరాదు.
అది ప్రాథమిక మానవ హక్కు.
- నెల్సన్ మండేలా

వ్యాఖ్య

# ఇజ్రాయిల్ నేరాల్లో భాగస్వామి అమెరికా !

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఒక రోజు ఇజ్రాయిల్ పర్యటన వల్ల ఏదైనా ఫలితం కనిపించిందీ అంటే అది, సెటిలర్-వలసవాద రాజ్యమైన ఇజ్రాయిల్‌కు నిరంతరం, గుడ్డిగా మద్దతు ఇవ్వడమే. ఈ పర్యటన 1948 నుండి మారని వాస్తవికతను నొక్కి చెప్పింది-పశ్చిమాసియాలో తన ఔట్‌పోస్ట్‌గా ఇజ్రాయిల్‌ను అమెరికా పెంచి పోషిస్తూ వచ్చింది. మంచి పాటవంతో కూడిన సైనిక దండు కలిగిన దేశంగా ఇజ్రాయిల్‌ను మార్చడానికి వందల కోట్ల డాలర్ల విలువైన సాయం, అత్యంత అధునాతనమైన ఆయుధాలు, ఇతర పరికరాలు అమెరికా గుమ్మరించింది.

ఆ రకంగా చేయడం ద్వారా, పాలస్తీనియన్ల అణచివేతను, వారు అనుభవిస్తున్న ఇబ్బందులను, కష్టనష్టాలను, వెస్ట్ బ్యాంక్ వంటి ఆక్రమిత ప్రాంతాల్లో జరుగుతోన్న జాతి ప్రక్షాళన వంటి చర్యలను అమెరికా పట్టించుకోలేదు. అత్యంత సౌకర్యవంతమైన రీతిలో వాటిని విస్మరించింది. 23 లక్షల మంది పాలస్తీనియన్లు నివసిస్తున్న గాజాలో గత 16 సంవత్సరాలుగా కొనసాగుతున్న అమానవీయ ఆంక్షలను, దిగ్బంధనాన్ని సమర్థిస్తూ వచ్చింది. ఇటీవలి సంవత్సరాల్లో, వెస్ట్ బ్యాంక్‌లో యూదు ఆవాసాలను విస్తరించడం ద్వారా రెండు దేశాల ఏర్పాటు ఫార్ములాను ఇజ్రాయిల్ చురుకుగా దెబ్బ తీస్తూ, వర్ణ వివక్ష వంటి వ్యవస్థను అమలు చేస్తున్నపుడు, ఈ ద్వంద్వ ప్రణాళికలో అమెరికా, దాని పశ్చిమ మిత్రపక్షాలు కుమ్మక్కయ్యాయి. కానీ, రెండు దేశాల ఏర్పాటు పరిష్కారం గురించి ఊరికే ప్రచారం చేస్తూ వచ్చాయి. బైడెన్ పర్యటనకు ముందుగా, విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇజ్రాయిల్, మరో ఐదు అరబ్ దేశాల్లో పర్యటించారు. గాజాలో పదాతిదళ దాడికి ఇజ్రాయిల్ సన్నద్ధమవుతుంటే, ఈజిప్ట్, జోర్డాన్ వంటి ఇరుగు పొరుగు దేశాలు సహకరించాలని కోరేందుకు ఆయా దేశాల్లో బ్లింకెన్ పర్యటించారు. రాఫా క్రాసింగ్ ద్వారా ఈజిప్ట్‌లోకి వెళ్ళేందుకు గాజా నుండి పాలస్తీనియన్లను అనుమతించేందుకు ఈజిప్ట్ అధ్యక్షుడిని ఒప్పించడంలో బ్లింకెన్ విఫలమయ్యారు. పాలస్తీనియన్లు ఒకసారి ఈజిప్ట్‌లోకి ప్రవేశిస్తే ఇక వారిని తిరిగి గాజాకు వెళ్ళేందుకు అనుమతించేది లేదని, వారు ఇక ఈజిప్ట్‌లో శాశ్వత శరణార్థులుగా వుండిపోతారని ఈజిప్ట్ అధ్యక్షుడు సిసి ప్రకటించారు. జోర్డాన్ లోకి పాలస్తీనియన్ల రాకపోకలను జోర్డాన్ కూడా తిరస్కరించింది.




PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

**ఈ నెల 15వ తేదీన అల్ అహ్లి అస్పత్రిపై రాకెట్ దాడి జరిగింది. ఆస్పత్రిపై దాడికి తాము బాధ్యులం కాదంటూ ఇజ్రాయిల్ ఇప్పుడు వాదిస్తోంది. ఇస్లామిక్ జిహాద్ ప్రయోగించిన రాకెట్ గురి తప్పి ఆస్పత్రిపై పడిందని, దాంతో ఈ దాడి చోటు చేసుకుందని చెబుతోంది. అయితే ఇంతటి భయంకరమైన విధ్వంసాన్ని సృష్టించగలిగేంత శక్తివంతమైన రాకెట్లు గాజా మిలిటెంట్ల వద్ద లేవని సైనిక నిపుణులు, పలువురు మీడియా వ్యాఖ్యాతలు పేర్కొంటున్నారు. అటువంటి శక్తివంతమైన బాంబులను కలిగివున్నది ఇజ్రాయిల్ మిలటరీ మాత్రమే. ఈ దాడికి సంబంధించి ఇజ్రాయిల్ చెబుతున్న కథనాన్ని బైడెన్ కూడా నిస్సిగ్గుగా సమర్ధించారు. 'ప్రత్యర్ధి బృందమే ఈ దాడికి పాల్పడింది' అంటూ ప్రకటించారు. ఆ రకంగా, ఇజ్రాయిల్ పాల్పడిన యుద్ధ నేరాల్లో బైడెన్ కూడా భాగస్వామి అయ్యారు.**

ఆత్మ రక్షణ కోసం గాజాపై దండెత్తడానికి ఇజ్రాయిల్‌కు హక్కు వుందంటూ అమెరికా పూర్తిగా సమర్ధించింది. మరోవైపు రాబోయే మానవ విపత్తును తప్పించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

టెల్ అవీవ్‌కు రావడానికి ముందు రోజు రాత్రి దక్షిణ గాజా లోని అల్ అహ్లి ఆస్పత్రిపై బాంబు దాడితో భయంకరమైన రీతిలో మారణకాండ చోటు చేసుకుంది. ఇప్పటివరకు 471 మంది మరణించినట్లు వెల్లడైంది. 24 గంటల్లోగా రోగులు, సిబ్బంది అందరూ ఖాళీ చేయాలని లేనిపక్షంలో పర్యవసానాలను ఎదుర్కోనాల్సి వుందంటూ ఉత్తర గాజాలోని 22 ఆస్పత్రులను ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశించిన నేపథ్యంలో ఈ దారుణమైన దాడి జరిగింది. అక్టోబరు 12 సాయంత్రం ప్రజలను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. 15వ తేదీన అల్ అహ్లి అస్పత్రిపై రాకెట్ దాడి జరిగింది. ఆస్పత్రిపై దాడికి తాము బాధ్యులం కాదంటూ ఇజ్రాయిల్ ఇప్పుడు వాదిస్తోంది. ఇస్లామిక్ జిహాద్ ప్రయోగించిన రాకెట్ గురి తప్పి ఆస్పత్రిపై పడిందని, దాంతో ఈ దాడి చోటు చేసుకుందని చెబుతోంది. అయితే ఇంతటి భయంకరమైన విధ్వంసాన్ని సృష్టించగలిగేంత శక్తివంతమైన రాకెట్లు గాజా మిలిటెంట్ల వద్ద లేవని సైనిక నిపుణులు, పలువురు మీడియా వ్యాఖ్యాతలు పేర్కొంటున్నారు. అటువంటి శక్తివంతమైన బాంబులను కలిగివున్నది ఇజ్రాయిల్ మిలటరీ మాత్రమే. ఈ దాడికి సంబంధించి ఇజ్రాయిల్ చెబుతున్న కథనాన్ని బైడెన్ కూడా నిస్సిగ్గుగా సమర్ధించారు. 'ప్రత్యర్ధి బృందమే ఈ దాడికి పాల్పడింది' అంటూ ప్రకటించారు. ఆ రకంగా, ఇజ్రాయిల్ పాల్పడిన యుద్ధ నేరాల్లో బైడెన్ కూడా భాగస్వామి అయ్యారు. అమ్మాన్‌లో జోర్డాన్, ఈజిప్ట్, పాలస్తీనా అథారిటీ నేతలతో జరగాల్సిన సమావేశాల రద్దు గురించి అస్సలేమీ మాట్లాడకుండా మౌనం పాటించారు. ఈ భయంకరమైన నేరానికి ఇజ్రాయిల్ పాల్పడిన సమయంలో ఏ అరబ్ నేత కూడా చివరకు అమెరికా మిత్రపక్షాలు కూడా బైడెన్‌తో సమావేశమవలేదు.

ఇజ్రాయిల్‌కు రక్షణగా నిలబడేందుకు అమెరికా ఎంతకైనా తెగిస్తుందనే విషయం బైడెన్ ఇజ్రాయిల్‌కు వచ్చిన మొదటి రోజే స్పష్టమైంది. గాజాలోకి ప్రాణాధార ఔషధాలు, ఇతర సరఫరాలు అనుమతించేందుకు వీలుగా మానవతా కారిడార్‌లను ఏర్పాటు చేయాలని పిలుపిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో బ్రెజిల్ ప్రతిపాదించిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. గాజాలోకి మానవతా సాయం వెళ్లనివ్వకుండా ఆ ప్రతిపాదనను వీటో చేయడం ద్వారా గాజాలో ప్రజలు ఆహారం, మందులు లేక కరువుబారిన పడేందుకు అమెరికా అనుమతించినట్లు అయింది.

పైగా ఇజ్రాయిల్‌లో పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత బైడెన్ మాట్లాడుతూ, రాఫా క్రాసింగ్ ద్వారా గాజాలోకి మానవతా సాయం అందించేందుకు అనుమతించాలంటూ ఇజ్రాయిల్ యుద్ధ కేబినెట్‌ను కోరినట్లు తెలిపారు. ఫలితంగా, అక్టోబరు 20న రాఫా క్రాసింగ్‌ను దాటేందుకు 20 ట్రక్కులను అనుమతించనున్నారు. ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో ధ్వంసమైన క్రాసింగ్ వద్ద రోడ్లను ఈజిప్ట్ మరమ్మత్తులు చేస్తేనే ఇదైనా జరుగుతుంది. గాజా ప్రజలకు కాస్తయినా ఉపశమనం కలగాలంటే రోజూ కనీసం వంద ట్రక్కుల వరకు సాయం అందాల్సి వుంటుందని ఐక్యరాజ్య సమితి సహాయ సంస్థ తెలిపింది.

గాజాపై ఇజ్రాయిల్ పదాతి దాడికి పాల్పడినట్లైతే ఈ ప్రాంతంలో ఘర్షణ ఇంకా విస్తృతమవుతుంది. ఒకవేళ అటువంటి దాడి జరిగినట్లైతే తాము చూస్తూ ఊరుకోబోమని ఇప్పటికే లెబనాన్‌లో హిజ్బుల్లా ప్రకటించింది. అరబ్ ప్రపంచవ్యాప్తంగా, పశ్చిమాసియాలో ప్రజలు గాజాలో ఇజ్రాయిల్ కిరాతక దాడులను నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. ఇప్పటికి యుద్ధం ప్రారంభమై 11 రోజులు గడిచింది. ఇప్పటివరకు 1100 మంది చిన్నారులతో సహా 3 వేల మందికి పైగా మరణించారు. ఇజ్రాయిల్‌కు రాజకీయ, సైనిక తోడ్పాటు అందించడం ద్వారా అమెరికా ఇస్తున్న మద్దతు ప్రపంచ దేశాల దృష్టిలో ఖండించదగ్గది.

( 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం )

సందర్భం

## అయోడిన్ లోపం రుగ్మతలు

శరీరంలో అయోడిన్ కొరత ఏర్పడితే పలు 'అయోడిన్ లోప రుగ్మతలు' కలుగుతాయి. అయోడిన్‌తో కూడిన ఆహార పదార్థాలను నిరంతరం సక్రమంగా తీసు కోవాలి. అప్పుడు ఈ రుగ్మతలు నివారించబడి సంపూర్ణ ఆరోగ్యం సమ కూరుతుంది. ఈ అవగాహన కల్పించ డానికి ప్రతి ఏటా 21 అక్టోబర్ రోజున ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినం పాటిస్తున్నాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే వివరాల ప్రకారం ప్రపంచ జనాభాలో 1/3 వంతు మంది ప్రజలు అయోడిన్ లోపంతో బాధ పడుతున్నారని తేలింది. ఇండియాలో 20 కోట్ల మంది అయోడిన్ లోప రుగ్మతల ప్రమాదంలో ఉన్నారని, 7.1 కోట్ల మంది గాయిటర్ సంబంధ వ్యాధులతో బాధ పడుతున్నారని తేలింది. 1984లో భారత ప్రభుత్వం అయొడైజ్డ్ సాల్ట్ వాడకాన్ని తప్పనిసరి చేస్తూ, 1993లో నాన్-అయొడైజ్డ్ ఉప్పు వాడకాన్ని నిషేధించింది.

వ్యాధి చికిత్స కన్న నివారణే మిన్న అని, అయోడిన్ లోపం రాకుండా ముందే జాగ్రత్త పడాలని విశ్వ మానవాళికి అవగతం చేయడం మన కనీస బాధ్యత. అయోడిన్ ప్రాముఖ్యతను వివరించడం, అయోడిన్ లోప రుగ్మతల లక్షణాల అవగాహన, అయోడిన్ సహిత ఆహారాన్ని తీసుకోవడం, అయోడిన్ లోపానికి సంబంధించిన అనుమానాలను నివృత్తి చేయడం...లాంటి అంశాలను ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలి. అయోడిన్ లోప రుగ్మతలు నివారించ దగినవని, అయోడిన్ సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకుంటూ వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్ : 9949700037

**మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com**

పోరాటం

# ప్రజా పోరాట విజయం 'వాచాతి'



డి. రమాదేవి

రాజ్యం యొక్క పశుత్వానికి, నిరంకుశ దోపిడీకి చిహ్నం వాచాతి. ఈ నిరంకుశ దాడిని ప్రతిఘటించింది అమాయకులైన వాచాతి ప్రజలు. తమ ఆత్మగౌరవం కోసం ఎర్రజెండా అండతో పట్టుదలగా, నిజాయితీగా సాహసోపేతంగా పోరాడిన తీరును మనం అభినందించకుండా ఉండలేం.

గత నెల 29వ తేదీన మద్రాస్ హైకోర్టు 215 మంది ప్రభుత్వ (పోలీసు, రెవెన్యూ, అటవీ) ఉద్యోగులకు శిక్ష ఖరారు చేస్తూ ఇచ్చిన తీర్పు...పోరాడే శక్తులకు, అణగారిన వర్గాలకు ఉత్తేజాన్నిచ్చింది. దేశంలో మనువాద కార్పొరేట్ శక్తుల పాలనలో కోర్టులు కూడా అందుకనుగుణంగానే తీర్పులు ఇస్తున్న నేపథ్యంలో వాచాతి గ్రామ ప్రజలు సాధించిన ఈ విజయం అపురూపమైనది.

వాచాతి ఓ చిన్న ఆదివాసీ గ్రామం. తమిళనాడులోని సిథాలి కొండల్లో మైదాన ప్రాంతాలకు సుదూరంగా వుంటుంది. "మలయాళి" అనే ఆదివాసీ తెగ అక్కడ నివాస ముంటుంది. 1992 జూన్ 20 వాచాతి ప్రజలకు ఓ పీడకల. రాజ్యం తన బలగాలతో దాడి చేసింది. అటవీ అధికారులు, పోలీసు అధికారులు, ఐదుగురు రెవెన్యూ ఉద్యోగులు కలిసి వాచాతి ప్రజలపై విరుచుకు పడ్డారు. మూకుమ్మడిగా దాడి చేశారు. దొరికిన వారిని దొరికినట్లు ఊరి మధ్య ఉన్న రావి చెట్టు దగ్గరకు ఈడ్చుకుంటూ వెళ్ళారు. ఇళ్ళను ధ్వంసం చేశారు. ఇంట్లో ఉన్న కొద్దిపాటి బంగారం, డబ్బు దోచుకున్నారు. తినే ఆహార ధాన్యాలను నట్టింట పోశారు. పెట్రోల్ చల్లి తినడానికి పనికి రాకుండా చేశారు. కూల్చిన ఇళ్ళ శిథిలాల్లో కలిసిపోయాయి. పశువులను, మేకలను లారీలకు ఎక్కించుకున్నారు. తిన్నవి తినగా మిగిలినవి అమ్ముకున్నారు. కనీవినీ ఎరుగని బీభత్సాన్ని సృష్టించారు. అంతటితో ఆగలేదు.

బాధితులలో ఒకరైన జయ కోర్టుకు చెప్పిన సాక్ష్యం వింటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. 17 సంవత్సరాల జయ 5వ తరగతి వరకు చదువుకుంది. సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చి వంటకు సిద్ధమవుతున్న జయను జుట్టు పట్టుకొని లం...లం...డీ అంటూ బూతులతో ఊరి మధ్యకు లాక్కెళ్ళారు. అక్కడకు లాక్కురాబడ్డ జనంలో నుంచి అమ్మాయిలను ఎర్ర చందనం దుంగలు లారీలు ఎక్కించాలంటూ దూరంగా తీసుకెళ్ళారు. ఓ కుంట దరిదాపుల్లోకి తీసుకెళ్ళి ముగ్గురు వ్యక్తులు ఆమెను అత్యాచారం చేశారు. పరుగెత్తడానికి, తప్పించుకోవడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. 'నీలాంటి అందమైన ఫిగరు కనిపిస్తే వదులుతామా...!' అంటూ ఆటబొమ్మ మాదిరి నీచంగా ఆమెపై దాడి చేశారు. ఆమెతో పాటు మరో 17 మంది అమ్మాయిలను లారీ ఎక్కించి తాలుకా కేంద్రమైన హరూర్‌లో ఉన్న అటవీ కార్యాలయానికి తీసుకెళ్ళారు. ఓ చిన్న గదిలో పెట్టి తలుపు వేశారు. యూరిన్‌కి వెళ్ళాలని అడిగితే 'మా ముందే పొయ్యి...అన్నీ మేం చూసినవే కదా...' ఇదీ వారి తీరు. బయటకు వెళ్ళనివ్వకుండా కొట్టడం, తిట్టడంతో బట్టల్లోనే యూరిన్ పడిపోయింది. ఆ రాత్రి మరింత ఘోరానికి పాల్పడ్డారు. ఊరిపెద్ద పెరుమాళ్ పైబట్టలు లాగేశారు. లో దుస్తులతో ఆ మహిళల ముందుకు తీసుకొచ్చారు. ఆ దుస్తులను తీసేయమని అమ్మాయిలను అడిగారు. అందుకు తిరస్కరించడంతో వారిని కొట్టారు. అంతటితో ఆగక అమ్మాయిల దుస్తులు లాగేయమని ఆ పెద్దను హింసించారు. అమ్మాయిలకు చీపుర్లు ఇచ్చి కొట్టించేందుకు పూనుకున్నారు.

తెల్లవారిన తర్వాత పురుగులున్న జావ తాగమని ఇచ్చారు. తాగలేమంటే బలవంతంగా తాగించేసరికి వాంతులయ్యాయి. నేల మీద రాలిన టేకు ఆకుల మీద తాము తిని పారేసిన ఎముకలతో కూడిన అన్నాన్ని వడ్డించి తినమన్నారు. రెండు రోజులు వారికి నరకాన్ని చూపించారు. మొత్తం 90 మంది మహిళలు, 20 మంది పిల్లలు, 10 మంది మగవారిని బందీలుగా తెచ్చిన అటవీ అధికారులు వారిని ఎర్రచందనం దొంగలుగా దుంగల ముందు పెట్టి ఫోటోలు తీసి జైలుకు పంపారు.

ఈ ఘోరమైన దాడిని గిరిజన సంఘం వెలుగులోకి తెచ్చింది. జులై 7న తమిళనాడు లోని గిరిజన సంఘం సిథారి కొండ జాతుల సభను నిర్వహించింది. ఆ సభలో పాల్గొన్న కొందరు గిరిజనులు వాచాతిలో జరిగిన దుర్మార్గాన్ని సభ దృష్టికి తెచ్చారు. అందులో పాల్గొన్న గిరిజన సంఘం నాయకులు బాషా, కృష్ణమూర్తి, రాష్ట్ర నాయకుడు షణ్ముగం దగ్గరకు వెళ్ళి జరిగిన విషయాన్ని వెల్లడించారు. దానితో గిరిజన సంఘం జులై 13న హరూర్ తాలుకా కేంద్రంలో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు మెమురాండం ఇచ్చింది. మాజీ ఎం.ఎల్.ఏ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో కలిసి రైతు, మహిళా సంఘాల బృందం జులై 14న ఆ గ్రామానికి మొదటిసారిగా వెళ్లింది. గ్రామంలో ఒక్క మనిషి కనిపించలేదు. అధికారులచేత నాశనం చేయబడ్డ ఒక్కొక్క ఇంటిని చూసుకుంటూ ఫోటోగ్రాఫర్ని తిరిగి తెచ్చుకొని ఫోటోలు తీశారు. భయపడవద్దు, సహాయం చేయడానికి వచ్చామని చెప్పగా చెట్ల చాటు నుంచి ముందుకు వచ్చింది ఓ యువతి. ఆ అమ్మాయి పేరు సాలా. ప్రజా సంఘాల బృందం వచ్చిన కారుకి ఉన్న ఎర్రజెండాను చూసిన సాలా వారి దగ్గరకు రావడానికి సాహసించింది. ఆ తర్వాత అడవిలో దాక్కున్న 49 మంది చిన్నగా వారి ముందుకు వచ్చారు. ముందురోజు గిరిజన సంఘం నిర్వహించిన ప్రదర్శన చూసిన, ఉపన్యాసాలు విన్న సాలా ఇతర గిరజనులకు నమ్మకాన్నిచ్చింది. పైగా మాజీ ఎమ్మెల్యే అన్నామలైని కూడా వారెరుగుదురు.

వారు చెప్పిన విషయాలు, కళ్ళెదుట కనిపిస్తున్న ఘోరాలు మాటలతో చెప్పగలిగేలా లేవు. అధికారుల దుశ్చర్యలు చూసిన నాయకత్వం చలించిపోయింది. ఇంతటి ఘోరానికి పాల్పడిన వారిని వదిలి పెట్టకూడదని, వాచాతి ప్రజలకు న్యాయం కోసం తుది దాకా పోరాడాలని నిర్ణయించుకుంది.

సేలం జైలుకెళ్ళి మహిళలతో మాట్లాడారు. ఆ తర్వాత వారు కలెక్టరుని కలిసి జరిగిన ఘోరాలను వివరించారు. 'మీరు పిటిషన్ ఇచ్చాకే నాకు తెల్సింద'న్నారు కలెక్టరు (అది అవాస్తవమని తర్వాత రుజువైంది). న్యాయం చేస్తామని నమ్మబలికారు. కాని ఎటువంటి చర్యా తీసుకోలేదు. అప్పుడు గిరిజన సంఘం, సిపిఎం ప్రతినిధులు ముఖ్యమంత్రికి పిటిషన్ ఇచ్చారు. పత్రికలకిచ్చారు. ఒక్క 'తీకధీర్' పత్రిక తప్ప ఈ వార్తను ఇతర పత్రికలేవీ ప్రచురించనే లేదు.

ముఖ్యమంత్రి, అధికారులందరూ ఇది తప్పుడు కథనమని తోసి పారేశారు. జులై 22న గిరిజన సంఘం ఆధ్వర్యంలో 1000 మంది ప్రజలతో హరూర్‌లో ఓ పెద్ద బహిరంగ సభ నిర్వహించారు. జులై 28న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి నల్లశివం, వరదరాజన్, పాపా ఉమానాథ్, ఇతర ప్రజా సంఘాల నాయకులందరూ ఆ గ్రామం సందర్శించారు. ఆ తర్వాత జిల్లా కేంద్రం ధర్మపురిలో కూడా పెద్ద సభ నిర్వహించారు. న్యాయ విచారణ చేయాలన్న ప్రజాసంఘాల డిమాండ్‌ను ఎఐడిఎంకె ప్రభుత్వం పట్టించుకోలేదు. గిరిజన సంఘం తరపున షణ్ముగం ఒక ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టులో ఫైల్ చేశారు. దీనిని స్వీకరించిన మొదటి మహిళా న్యాయమూర్తి "విద్యావంతులైన ఉన్నతోద్యోగులు ఇలాంటి చర్యలకు పాల్పడ్డారంటే నమ్మలేమ"ని పిల్‌ను కొట్టేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి నల్లశివం సెప్టెంబర్ 3న సుప్రీంకోర్టులో పిల్ ఫైల్ చేశారు. పార్లమెంట్‌లో లేవనెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు చేశారు. హరూర్‌లో నిరవధిక నిరాహార దీక్ష చేశారు షణ్ముగం.

ఐద్వా నాయకులు మైథిలీ శివరామన్ ఎస్సీ, ఎస్టీ కమిషనర్ భామతికి పిటిషన్ ఇచ్చాక ఆమె వాచాతి గ్రామాన్ని సందర్శించారు. ప్రజాసంఘాలు వెలుగులోకి తెచ్చిన అన్ని విషయాలు వాస్తవాలేనని నిర్ధారించుకొని రిపోర్టు ఇచ్చారు. ఆ తర్వాతనే మద్రాస్ హైకోర్టు డిసెంబర్ 11న ఎంక్వైరీ కమిటీ వేసింది. కోర్టు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, మంచినీళ్ళు, ధ్వంసం చేసిన రేషన్ కార్డులు, రవాణా సదుపాయాలను పునరుద్ధరించింది.

ఆ తర్వాత సిబిఐ విచారణకు కోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం కోర్టు తీర్పును రద్దు చేయాలని సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసింది. అన్ని ఆటంకాలను అధిగమించి విచారణ ప్రారంభించింది సిబిఐ. నిందితుల గుర్తింపు కోసం ఏర్పాట్లు చేయమని కోరితే మంత్రులు ప్రత్యక్షంగా జోక్యం చేసుకొని నిలిపి వేయించారు. తిరిగి కోర్టుని ఆశ్రయించారు. చివరకు అక్టోబర్ 9న నిందితుల గుర్తింపు కార్యక్రమం జరిగింది. 11 మంది నేరస్తులను బాధిత మహిళలు గుర్తించారు. 'ఎవరైతే ఈ హీనమైన పనులు చేశారో వారిని మాత్రమే బాధితులు చూపించారు. ఆదివాసీలు, వారికి మద్దతుగా నిల్చిన కమ్యూనిస్టులు నిజాయితీ కల్గిన వారు. కక్షపూరితంగా వ్యవహరించలేద'ని డిపార్టుమెంట్‌లో నిజాయితీ కల్గిన అధికారులు కొంతమంది పేర్కొన్నారు. 1996 ఏప్రిల్ 23న సిబిఐ చార్జిషీటు దాఖలు చేసింది. నిందితులను అరెస్ట్ చేశారు. ఎఐడిఎంకె స్థానంలో అధికారంలోకి వచ్చిన డిఎంకె ముఖ్యమంత్రి కరుణానిధి... కోర్టు ఆదేశాలతో నిమిత్తం లేకుండా నిందితులను జైలు నుంచి విడుదల చేయించారు.

పదే పదే ప్రజలను సమీకరించడం, జరిగిన అన్యాయాన్ని, ప్రభుత్వ ధోరణులను విస్తృతంగా ప్రచారం చేస్తూనే ప్రతి అంశానికి రిటన్ పిటిషన్లు వేస్తుండడంతో 2011న కోర్టు తీర్పు వెలువడింది.

అది ఒక చారిత్రాత్మక తీర్పు. 215 మంది ప్రభుత్వ ఉద్యోగులను నిందితులుగా గుర్తించి శిక్షించాల్సిందిగా పేర్కొంటూ ఇచ్చిన తీర్పు. అయితే ఆ తీర్పు అమలు జరగలేదు. చివరికి 2023 సెప్టెంబర్ 29న హైకోర్టు తుది తీర్పు ప్రకటించింది.

వాచాతి గాథ విచిత్రమైనది. అత్యాచార నిందితులకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించింది. న్యాయానికి అడుగడుగునా అడ్డం పడింది. అంతేగాక బాధితులను బెదిరించారు. లొంగదీసుకొనే ప్రయత్నం చేశారు. తప్పుడు కథనాలు ప్రచురించారు.

అయినా సరే... బాధితులు కాని, వారికి అండగా నిలబడిన ప్రజా సంఘాలు కాని వెనకడుగు వేయలేదు. నిజాయితీ పరులైన అధికారులు, స్వార్థ చింతన లేని న్యాయవాదులు, ఆధిపత్య భావజాలం లేని న్యాయమూర్తులు, అడుగడుగున అన్ని విధాల అండగా నిలిచిన వ్యక్తులు, సంస్థలు ఈ విజయ సాధనలో భాగస్వామలయ్యారు.

అడవి బిడ్డలను అడవికి దూరం చేసే చట్టాల దుర్మార్గానికి ఈ తీర్పు చెంప పెట్టు. స్మగ్లర్లు, దొంగలకు అండగా వుంటూ సామాన్యులను, అమాయకులను బలి చేసే రాజ్యానికి ఇది ఓ హెచ్చరిక.

షణ్ముగం ఈ పోరాటంలో చివరికంటా నిలబడిన నేత. ఆనాడు వాచాతికి వెళ్ళాలంటే వారి చేతిలో ఉన్నది 10 రూపాయలు మాత్రమే. ప్రజల సహకారంతోనే ఇంతటి సుదీర్ఘ పోరాటానికి నిధులు సేకరించగల్గారు. బాధితులకు బెయిల్ తెప్పించడం నుండి వారి జీవితాన్ని తిరిగి ప్రారంభించడానికి అవసరమైన ప్రతిదీ ప్రజల సహకారంతోనే సాధ్యమైంది.

శత్రువుల మిత్రులను కూడగట్టడం కూడా పోరాటం నుంచే నేర్చుకున్నారు వాచాతి ప్రజలు. ఓ ఎస్సీ, ఎస్టీ కమిషనర్ సభ్యురాలితో సహా.... కొందరు సిబిఐ అధికారులు, పోలీసు, జైలు అధికారులు న్యాయం కోసం తమ వంతు సహకరించారు. పోరాటంతో సాధించిన విజయం ఇది. భన్వారీ కేసు, కీలన్వేణి, వాకపల్లి, కారంచేడు, చుండూరు లాంటి కేసులు ఎన్నో ఈ వ్యవస్థలో వెలుగులోకి వచ్చాయి. పోరాటాలు సాగాయి. పాక్షిక విజయాలు సాధించాము. కానీ, వాచాతి కేసు ఓ సంపూర్ణ విజయాన్ని అందించిన ప్రజల గాథ. పోరాట గాథ. నేడు ఆధిపత్య శక్తులను ఎదిరిస్తున్న వారికి వాచాతి విజయం ఆత్మవిశ్వాసాన్నిస్తుంది.

/ వ్యాసకర్త ఐద్వా రాష్ట్ర కార్యదర్శి /



**వాచాతి గాథ విచిత్రమైనది. అత్యాచార నిందితులకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించింది. న్యాయానికి అడుగడుగునా అడ్డం పడింది. అంతేగాక బాధితులను బెదిరించారు. లొంగదీసుకొనే ప్రయత్నం చేశారు. తప్పుడు కథనాలు ప్రచురించారు. అయినా సరే... బాధితులు కాని, వారికి అండగా నిలబడిన ప్రజా సంఘాలు కాని వెనకడుగు వేయలేదు. నిజాయితీ పరులైన అధికారులు, స్వార్థ చింతన లేని న్యాయవాదులు, ఆధిపత్య భావజాలం లేని న్యాయమూర్తులు, అడుగడుగున అన్ని విధాల అండగా నిలిచిన వ్యక్తులు, సంస్థలు ఈ విజయ సాధనలో భాగస్వామలయ్యారు.**

# ఆల్ట్ న్యూస్ జుబేర్‌కు అంతర్జాతీయ అవార్డు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2023 సంవత్సరానికి జర్నలిజంలో 'ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అవార్డు ఫ్యాక్ట్ చెక్ సంస్థ ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబేర్‌ను వరించింది. ఇండెక్స్ ఆన్ సెన్సార్‌షిప్ ఈ అవార్డును శుక్రవారం ప్రకటించింది. "అధికార పార్టీకి చెందిన ప్రభావవంతమైన నేతలు ప్రచారంలో పెట్టే తప్పుడు సమాచారాన్ని సవాలు చేసినందుకు జుబేర్ చాలా బెదిరింపులను ఎదుర్కొన్నారు" అని సంస్థ తెలిపింది. ఇండెక్స్ ఆన్ సెన్సార్‌షిప్ అనేది లండన్ కేంద్రంగా భావ ప్రకటన స్వేచ్ఛ కోసం పని చేసే సంస్థ. బ్రిటన్ రాజధాని లండన్‌లో జరిగిన వేడుకలో విజేతలను సత్కరిస్తారు. ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు. ఈ అవార్డును స్వీకరించడం గురించి జుబేర్ స్పందిస్తూ తమ యువ సహోద్యోగులకు ఇది "ఆశాజ్యోతి" అని అన్నారు. "నేను పని చేసేటప్పుడు.. నాపై దాడి జరిగినప్పుడు, దూషణలకు గురైనప్పుడు, జైలు శిక్షకు గురైనప్పుడు నాకు అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు" అని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో జుబేర్ ఆరు కేసులు, ఢిల్లీలో ఒక కేసును ఎదుర్కొని జైలు పాలైన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదలయ్యారు.


**మహారాజశ్రీ నరసారావు పేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**

**E A No.: 23/26**
in
**E P No.: 15/2022**
in
**O.S. No.: 232/2021**

**బిట్వీన్:**

**ఎడెల్‌వైస్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ ప్రజెంటెడ్ బై ఆథరైజ్డ్ ఆఫీసర్**
**E. రాజేంద్ర ప్రసాద్ పిటీషనర్ / క్లయిమెంటు**
**మరియు**
**ఇమ్మడిశెట్టి సుహాసిని మరియు ఇతరులు రెస్పాండెంట్స్**

To,

**R2) వాసవి ఫర్టిలైజర్స్, ప్రొప్రయిటర్ కనమర్లపూడి చంద్రశేఖర్,** డి.నెం. 14-1-213, పెద్ద కూరగాయల మార్కెట్ వద్ద, వినుకొండ రోడ్డు, బ్రిడ్జి క్రింద, నరసారావుపేట టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా.

**R2) కనమర్లపూడి చంద్రశేఖర్, తండ్రి కృష్ణమూర్తి,** డి.నెం. 1-10-12, ఆంజనేయ స్వామి గుడి వద్ద, బరంపేట, నరసారావుపేట టౌను మరియు మండలము, పల్నాడు జిల్లా.

సదరు పై నెంబరు E.P. లో ఇందలి రెస్పాండెంట్స్ మీద ఈ పిటీషనరు క్లయిం పిటీషను దాఖలు చేసి యున్నారు. సదరు పై నెంబరు E.P. లో R2/JDR1 అయినటువంటి వాసవి ఫర్టిలైజర్స్ వారు మరియు R3/JDR1 అయినటువంటి కనమర్లపూడి చంద్రశేఖర్ వారులకు శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను, ఈ పిటీషన్ వ్యవహారం తెలిసి కూడా నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం **ది. 01.11.2023**కు వాయిదా వేసి ఉన్నారు. సదరు వాయిదా తేదీన **ఉదయం గం. 10.30 ని.లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలెను.

**శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో**

**వాయిదా తేది: 01.11.2023**

**ఇట్లు**
**పి. కోటేశ్వరావు, యం.యం. షరీఫ్**
**అప్పీలుదారు తరుపు న్యాయవాదులు**
**సెల్: 8978626315**



**FORM NO.14**
{See Regulation 33(2)}

**OFFICE OF THE RECOVERY OFFICER-I**
**DEBTS RECOVERY TRIBUNAL**
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawan,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

**DEMAND NOTICE**
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

**RC/45/2022** **08.09.2023**

**Canara Bank, Mangalagiri Road Branch, Guntur District**
**Versus**
**Mr. Gundebommu Eswaraiah**

To
**(CD-1) Mr. Gundebommu Eswaraiah,** D No. 4-15-103-6, Bharatpet, Guntur.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in **OA/1023/2018 an amount of Rs. 21,61,736.55 Ps/- (Rupees twenty one lakhs sixty one thousand seven hundred thirty six and fifty five paisa only)** minus Rs. 8,06,116/- (realized by the applicant bank on 19.12.2020) along with pendentellite and future interest @ 13.50% p.a. compounded with monthly rests from 11.09.2018 till realization / date of payment and costs of Rs. 52,005/- (Rupees fifty two thousand and five only) has become due against you (Jointly and severally /Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.

3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.

4. You are hereby ordered to appear before the undersigned on **30.10.2023** at **10:30 a.m.** for further proceedings.

5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

**(Given under my hand and the seal of the Tribunal, on this date: 08.09.2023)**
**(Avasarala Anil), Recovery Officer**



**FORM NO.14**
{See Regulation 33(2)}

**OFFICE OF THE RECOVERY OFFICER-I**
**DEBTS RECOVERY TRIBUNAL**
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawan,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

**DEMAND NOTICE**
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

**RC/345/2020** **16.08.2023**

**Canara Bank,** Governorpeta Branch, Eluru Road, Vijayawada, Krishna Dist.
**Versus**
**Smt. Chunduru Ramadevi and Others**

To
**(CD-3) Sri. Yella Chakravarthi Babu, S/o Sambasiva Rao,** D No. 7-105/1, Poranki, Vijayawada, Krishna District.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in **OA/1018/2017 an amount of Rs. 2,73,47,070/-** (Rupees two crore seventy three lakhs forty seven thousand and seventy only) minus Rs. 55,00,000/- (paid by the defendants on 28.06.2018; part satisfaction memo was filed on 31.12.2019) along with pendentellite and future interest @ 12% p.a. compounded with monthly rests from 20.11.2017 till realization / date of payment and costs of Rs. 1,93,000/- (Rupees one lakh ninety three thousand only) has become due against you (Jointly and severally /Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.

3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.

4. You are hereby ordered to appear before the undersigned on **30.10.2023** at **10:30 a.m.** for further proceedings.

5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

**(Given under my hand and the seal of the Tribunal, on this date: 16-08-2023)**
**(Avasarala Anil), Recovery Officer**



**FORM NO.14**
{See Regulation 33(2)}

**OFFICE OF THE RECOVERY OFFICER-I**
**DEBTS RECOVERY TRIBUNAL**
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawan,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

**DEMAND NOTICE**
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

**RC/415/2019 in OA 471 of 2017** **18.05.2023**

**Canara Bank, Chandramouli Nagar Branch, Guntur District**
**Versus**
**M/s Siva Traders and another**

To
**(CD 1) M/s Siva Traders, Rep. by its Prop. Smt Ravi Adi Lakshmi,** D.No. 9-42, Lingayyapalem, Ankireddypalem, Guntur District.
**(CD -2) Smt. Ravi Adi Lakshmi, W/o R. Chandraiah,** D.No. 9-42, Lingayyapalem, Ankireddypalem, Guntur District.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in **OA/471/2017 an amount of Rs.3,67,20,923/- (Rupees three crores sixty seven lakhs twenty thousand nine hundred and twenty three only)** along with pendentellite and future interest @ 11.70% p.a. compounded with Monthly rests from 16.06.2017 till realization along with costs of Rs. 1,89,000/-has become due against you (Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.

3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.

4. You are hereby ordered to appear before the undersigned on **23.10.2023** at **10:30 a.m.** for further proceedings.

5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

**(Given under my hand and the seal of the Tribunal, on this date: 18.05.2023)**
**(Avasarala Anil), Recovery Officer**


# బిజెపిని ఓడించాలి... దేశాన్ని రక్షించాలి

- ఎన్నికల రాష్ట్రాల్లో బిజెపికి వ్యతిరేకంగా రైతుల ప్రచారం
- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు




మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌కెఎం నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'బిజెపిని శిక్షించాలి.. ఓడించాలి. కార్పొరేట్లను వ్యతిరేకించాలి. దేశాన్ని రక్షించాలి' అనే నినాదంతో ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ప్రచారం చేస్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) స్పష్టం చేసింది. శుక్రవారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌కెఎం నేతలు హన్నన్ మొల్లా, బల్దేవ్‌సింగ్ నిహాల్కర్, రాజారామ్ సింగ్, పి.కృష్ణప్రసాద్, ప్రేమ్‌సింగ్, సత్యవాన్ మాట్లాడారు. "బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు లాభాలు తెచ్చే విధంగా విధానాలు రూపొందిస్తూ దేశంలోని రైతులను మోసం చేస్తోంది. మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నప్పటికీ, చారిత్రాత్మక పోరాటంలో రైతులకు ఇచ్చిన ఇతర వాగ్దానాలు నెరవేర్చలేదు. పోరాటంలో రైతులపై బనాయించిన అక్రమ కేసులు ఉపసంహరించుకోలేదు. లఖింపూర్ ఖేరీ హత్యాకాండ కుట్రలో ప్రమేయం ఉన్న కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రా మంత్రిగానే కొనసాగుతున్నారు. రైతుల పోరాటనికి మద్దతు తెలిపిన న్యూస్‌క్లిక్ వెబ్ పోర్టల్‌పై తప్పుడు కేసు పెట్టారు. ఈ కేసు ఎఫ్ఐఆర్‌లోకి రైతుల పోరాటాన్ని కూడా తీసుకొచ్చారు. దేశభక్తి ఉన్న రైతులను దేశ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తున్నారు. ఈ ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1 నుంచి 5 వరకు గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు దేశవ్యాప్తంగా ఎఫ్ఐఆర్ కాపీని తగులబెడతారు. 26 నుంచి 28 వరకు 72 గంటల పాటు రాత్రి పగలు రాష్ట్ర రాజధానుల్లోని రాజ్‌భవన్‌ల ఎదుట మహాధర్నా నిర్వహించాలని ఉమ్మడి కిసాన్ మోర్చా సమావేశంలో నిర్ణయించాం" అని తెలిపారు. రైతుల ఉద్యమానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడం ఆపాలని హితవు పలికారు. రైతులు పండించిన పంటల ప్రభుత్వ సేకరణ, కనీస మద్దతు ధర చట్టాన్ని నిషేధించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచారని, బ్లాక్ మార్కెటీర్లకు స్వేచ్ఛను ఇస్తున్నారని విమర్శించారు.

## మెయితీలకు ఎస్‌టి హోదా సిఫార్సుపై అప్పీల్‌కు

# మణిపూర్ హైకోర్టు అనుమతి

**ఇంఫాల్ :** మెయితీలకు ఎస్‌టి హోదా సిఫార్సు చేస్తూ తాము ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్ చేసుకోవడానికి గిరిజన సంఘాలకు మణిపూర్ హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఆల్ మణిపూర్ ట్రైబల్ యూనియన్ నేతృత్వంలో వివిధ గిరిజన సంఘాలు లేవనెత్తిన ఫిర్యాదులు, వాదనలు పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ అహంతేమ్ బిమోల్ సింగ్, జస్టిస్ ఎ.గుణేశ్వర్‌శర్మతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు గురువారం అనుమతించింది. గత విచారణలో గిరిజన సంఘాలను ప్రతివాదులుగా చేర్చలేదని కూడా వారి తరుపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. హైకోర్టు అనుమతితో గిరిజన సంఘాల అప్పీల్‌ను విచారణకు స్వీకరించేందుకు మార్గం సుగమమైంది. మెయితీలకు ఎస్‌టి హోదా సిఫార్సు చేస్తూ ఈ ఏడాది మార్చి 27న మణిపూర్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులపై మెయితీలు, కుకీల మధ్య పెద్దఎత్తున హింసాకాండ చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. మార్చి 27న ఉత్తర్వులు ఇచ్చిన అప్పటి మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి మురళీధరన్‌ను ప్రస్తుతం కొల్‌కత్తా హైకోర్టుకు బదిలీ చేశారు. మణిపూర్ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సిద్దార్థ్ మృదుల్ నేతృత్వంలోని ధర్మాసనం తాజా అప్పీల్‌ను విచారణ చేస్తుందని భావిస్తున్నారు. మెయితీలకు ఎస్‌టిల లక్షణాలు లేవని, క్షత్రియులుగా భావిస్తున్నారని పేర్కొంటూ గత 40 ఏళ్లలో రెండుసార్లు ఎస్‌టి హోదాను తిరస్కరించారు. ఈ విషయాన్ని ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన విచారణ సమయంలో మణిపూర్ హైకోర్టు దృష్టికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకెళ్లలేదు.

# ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ ఎంపి అఫర్ కాసిఫ్‌పై బహిష్కరణ వేటు




**టెల్ అవీవ్:** పాలస్తీనీయులపై ఇజ్రాయిలీ రక్షణ దళాలు జాతి ప్రక్షాళన సాగించే ప్రమాదముందని హెచ్చరించినందుకు ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ ఎంపి ఆఫర్ కాసిఫ్‌పై పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ 45 రోజుల పాటు బహిష్కరణ వేటు వేసింది. 45 రోజుల పాటు పార్లమెంటరీ సమావేశాల్లో పాల్గొనకుండా ఆయనపై నిషేధం విధించింది. కాసిఫ్ ఒక ఇంటర్వ్యూలో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు గాజాపై సాగిస్తున్న యుద్ధాన్ని విమర్శించారు. ఆయన ఇజ్రాయిలీ డెమొక్రటిక్ ఫ్రంట్ ఫర్ పీస్ అండ్ ఈక్వాలిటీ (హదాష్) తరపున పార్లమెంటుకు 2019 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయను యూదుడే అయినప్పటికీ యూదు ఆధిపత్యవాదాన్ని, జాత్యహంకారాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021లో తూర్పు జెరూసలెం నుంచి పాలస్తీనీయులను బలవంతంగా ఖాళీ చేయించడాన్ని నిరిసిస్తూ ప్రదర్శనలో పాల్గొన్నందుకు ఆయనను పోలీసులు చితకబాదారు. ప్రభుత్వం ఎంత నిర్బంధాన్ని ప్రయోగించినా ఆయన నమ్మిన సిద్ధాంతానికే కట్టుబడి ఉండడం పలువురి మన్ననలు అందుకుంది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

## 23నుండి ఒరిస్సాలో వర్షాలు

**భువనేశ్వర్ :** బంగాళాఖాతంలో శుక్రవారం అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఒడిశా తీర ప్రాంత జిల్లాల్లో ఈ నెల 23 నుంచి 25 మధ్యలో వర్షాలు పడే అవకాశం వుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఎక్స్‌లో భువనేశ్వర్‌లోని ఐఎండి కార్యాలయం పోస్ట్ పెట్టింది. ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం 23 నాటికి మరింత బలపడే అవకాశం వుందని భావిస్తున్నారు. ఈ ప్రభావంతో, తీర ప్రాంత జిల్లాల్లో వర్షాలు పడతాయని, భారీ వర్షాలు పడతాయా లేదా అనేది అల్పపీడనం కదలికలను బట్టి అంచనా వేయగలుగుతామని ఐఎండి సెంటర్ డైరెక్టర్ హెచ్.ఆర్.బిశ్వాస్ తెలిపారు.

# 'ఒక దేశం-ఒకే ఎన్నికల'పై 25న కమిటీ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఒక దేశం-ఒకే ఎన్నికలు'పై విధివిధానాలను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ తదుపరి సమావేశం ఈనెల 25న జరుగనుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన తొలి అధికారిక సమావేశం ఇటీవలి ఢిల్లీలోని ఆయన నివాసంలో జరిగింది. ఈ సమావేశంలో హోం మంత్రి అమిత్‌షా, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌పాల్ కూడా పాల్గొన్నారు. రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు, భాగస్వామ్యపక్షాల అభిప్రాయాలను తెలుసుకోవాలనిసమావేశం నిర్ణయించింది.

# వాఘా సరిహద్దుల్లో జాతీయ పతాకావిష్కరణ

**అమృత్‌సర్ :** అమృత్‌సర్ జిల్లాలోని అత్తారి-వాఘా సరిహద్దు వద్ద 418 అడుగుల జాతీయ జెండాను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గురువారం ఆవిష్కరించారు. ఇది దేశంలోనే ఎత్తయిన జెండా. ఈ కార్యక్రమంలో గడ్కరీతోపాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, అమృత్‌సర్ ఎంపి గుర్జిత్ సింగ్ ఔజ్లా, బిఎస్‌ఎఫ్ సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. వాఘా సరిహద్దు వద్ద ప్రతిరోజూ సూర్యాస్తమయానికి ముందు భారత్-పాకిస్థాన్‌లు తమ జాతీయ జెండాలను ఒకేసారి అవనతం చేస్తాయి.

# హెచ్‌సిఎ అధ్యక్షుడిగా జగన్మోహనరావు

## అమర్‌నాథ్ ఒక్క ఓటు తేడాతో గెలుపు



**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) నూతన అధ్యక్షుడిగా జగన్మోహనరావు ఎన్నిక య్యారు. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం(ఉప్పల్)లో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సిఎ ప్యానెల్ నుంచి పోటీ చేసిన జగన్ మోహన్ రావు కేవలం ఒక్క ఓటు తేడాతో అనిల్ కుమార్‌పై విజయం సాధించారు. మొత్తం 173మంది ఓట్లకు గాను 169ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, కౌన్సిలర్ పదవులకు ఎన్నికలు జరిగాయి. జగన్‌మోహన్ రావుకు అనుకూలంగా 63 ఓట్లు రాగా.. అమర్‌నాథ్‌కు 62 ఓట్లు వచ్చాయి. గుడ్ గవర్నెన్స్ నుంచి బరిలో ఉన్న కె.అనిల్ కుమార్‌కు 10, ఆనెస్ట్ హార్డ్ వర్కింగ్ హెచ్‌సిఏ ప్యానెల్ తరపున పోటీపడిన పీఎల్ శ్రీనివాస్‌కు 34 ఓట్లు వచ్చాయి. వివిఎస్ లక్ష్మణ్, వెంకటపతిరాజు, మిథాలీ రాజ్, ప్రజ్ఞాన్ ఓఝా, టిఎస్ఆర్టీసి ఎండి విసి సజ్జనార్, జిహెచ్ఎంసి కమిషనర్ రొనాల్డ్ రాస్, తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు. రిటర్నింగ్ అధికారిగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి విఎస్ సంపత్ వ్యవహరించారు. ఉదయం 10గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై.. మధ్యాహ్నం3గంటలకు ముగిసింది. సాయంత్రం 4గంటలకు ఓట్ల లెక్కింపు చేశారు.

**నూతన కార్యవర్గం...**

| | |
|---|---|
| జగన్మోహన్ రావు | : అధ్యక్షుడు(యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్ సిఏ ప్యానెల్) |
| దల్జీత్ సింగ్ | : ఉపాధ్యక్షుడు(గుడ్ గవర్నెన్స్ ప్యానెల్) |
| దేవరాజు | : కార్యదర్శి(క్రికెట్ ఫస్ట్ ప్యానెల్) |
| బసవరాజు | : సంయుక్త కార్యదర్శి(గుడ్ గవర్నెన్స్ ప్యానెల్) |
| సీజే శ్రీనివాసరావు | : ట్రెజరర్(యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్ సిఏ ప్యానెల్) |
| కౌన్సిలర్ | : సునీల్ అగర్వాల్(క్రికెట్ ఫస్ట్ ప్యానెల్) |

# పంటలపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి - రామకుప్పం

చిత్తూరు జిల్లా రామకుప్పం మండల పరిధిలోని పంద్యాల మడుగు పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో పంట పొలాల పై ఏనుగులు దాడి చేశాయి. గురువారం రాత్రి గంట్లప్ప, బాబు అనే రైతులకు చెందిన వరి, అరటి తోటలను తీవ్రంగా నష్ట పరిచాయి. మూడు ఏనుగుల గుంపు కోతకు వచ్చిన పంటలను తిన్నంత తిని.. తొక్కి నాశనం చేసి పోవటం తో చేసేది లేక బాధిత రైతులు గుండెలు పగిలేలా విలపిస్తున్నారు. అటవీ సరిహద్దు ప్రాంతంలోనీ గ్రామాల వైపు తరచూ ఏనుగులు పంటలు నాశనం చేస్తూ... రైతులని మరింత అప్పుల ఊబి లోకి నెట్టేస్తున్నా ... ప్రభుత్వ యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపక పోవటం కొసమెరుపు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఎన్నో సార్లు అధికార్లు కు రైతులు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు వాపోతున్నారు. అదే విధంగా అడవుల్లో జంతువులకు నీరు, ఆహారం సంవద్ధి గా లభించే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే ... జంతువులు అడవిని దాటి గ్రామాల వైపు రావని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అడవుల్లో ఆహారం లభించక... ఆహార అన్వేషణలో భాగంగా ఏనుగులు గ్రామాల పై పడుతున్నాయి. చీకటి పడితే పొలాల వైపు వెళ్ళాలంటే అటవీ సమీప రైతులు హడలిపోతున్నారు . ముఖ్యంగా అటవీ సరిహద్దు ప్రాంతం చుట్టూ అసం పూర్తిగా ఉన్న కంద కాలను పూర్తి చేసి... సోలార్ ఫెన్సింగ్ ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

# పంజాబ్ అసెంబ్లీ సెషన్ రద్దు

## గవర్నర్‌పై సుప్రీంకోర్టుకు ఆప్ ప్రభుత్వం

**చండీగఢ్ :** ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పాలనకు అడ్డుపడేలా గవర్నర్ల వ్యవస్థను కేంద్రం దుర్వినియోగం చేస్తోంది. తాజాగా పంజాబ్‌లోనూ అదే పరిస్థితి మరోసారి పునరావృతమైంది. ఈ నెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే అసెంబ్లీ సెషన్ సమావేశాలు చట్టవిరుద్ధమైనవి, కాబట్టి ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే మూడు బిల్లులకు ఆమోదం తెలపనని గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ స్పష్టం చేయడంతో తాజా వివాదం రాజుకుంది. తొలిరోజు శుక్రవారం సభ సమావేశమైన కొన్ని గంటల తరువాత సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు. తమ ప్రభుత్వం ఎలాంటి బిల్లులను ప్రవేశపెట్టడం లేదని స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వన్‌కు ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ తెలిపారు. అసెంబ్లీని వాయిదా వేయాలని కోరారు. దీంతో సభను వాయిదా వేయాలనే తీర్మానాన్ని ఆమోదించారు. గవర్నర్‌కు వ్యతిరే కంగా సుప్రీంకోర్టుకు వెళతామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే అసెంబ్లీ సమావేశాలు చట్ట విరుద్ధమైనవి, ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే మూడు బిల్లు లను తాను ఆమోదించనని గురువారం ముఖ్యమంత్రికి గవర్నర్ లేఖ రాశారు. ఆప్ ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించింది. ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ మాట్లాడుతూ... ఈ సమావేశాలు చట్టబద్ధమైనవే అని నిర్ధారణ అయ్యే వరకూ సభను నిర్వహించబోమని తెలిపారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు చెప్పారు.


Chola
Enter a better life

**చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**
కార్పొరేట్ కార్యాలయం: చోళ క్రెస్ట్, సూపర్ బి, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600 032.

**స్వాధీనత నోటీసు [(అనుబంధం IV )(రూల్ 8(1)] క్రిందరి**

ఏదైతే మెస్సర్స్ **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు, సెక్యూరిటీజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోపట దానిపిమ్మట వడ్డీ మరియు సదరు నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు రుణగ్రహీతలు (పేరులు మరియు చిరునామా దిగువ పేర్కొనబడినాయి) పిలుస్తూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు జారీచేయబడింది. రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద నా అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ దిగువ వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైనదని ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది. ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు ఇక్కడ క్రింద పేర్కొన్న మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీ మెస్సర్స్. **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క చార్జ్‌కు లోబడి జరుపవచ్చును. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టంలోని సెక్షన్13 యొక్క సబ్-సెక్షన్ 8 నిబంధనలు ఆహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించగలరు.

| క్ర. సం | రుణగ్రహీత/లు పేరు మరియు చిరునామా మరియు రుణ ఖాతా నెంబర్ | డిమాండ్ నోటీసు తేది | బాకీపడిన మొత్తం | స్వాధీనతా ఆస్తి వివరణ | స్వాధీనతా తేది |
|---|---|---|---|---|---|
| 1. | రుణ ఖాతా నెం(లు): **HL05RAS000000220** 1. మాధవరావు గడిపూడి, గడిపూడి సుబ్బాయమ్మ, మాధవరావు గడిపూడి గడిపూడి సుబ్బాయమ్మ, అందరి నివాసం: డో.నం.1-46, రాములవారి గుడి వద్ద, శావల్యాపురం, ఆంధ్రప్రదేశ్-522646, ఇక్కడ కూడా : డో.నం.1-46, పొట్లూరు ఆంజనేయస్వామి గుడి వద్ద, శావల్యాపురం 522646 | 09-08-2023 | 08.08.2023 నాటికి రూ.28,18,557/- (ఇరవై ఎనిమిది లక్షల పద్దెనిమిది వేల ఐదు వందల యాభై ఏడు రూపాయలు మాత్రమే) | ఆస్తి షెడ్యూల్ : గుంటూరు జిల్లా, పొట్లూరు గ్రామ పంచాయతీ ఏరియా, పొట్లూరు గ్రామం వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ ఖాళీ ఇంటి సైట్ నం.520-డి, విస్తీర్ణం ఎసి. 0-04 1/2 సెంట్లు.= 217-8 చ.గ.లు. ప్రస్తుత ఆర్.సి.సి. భవనం (ప్లాన్ ప్రకారం) తో దానిపై ఫిక్చర్లు మరియు ఫిట్టింగులు, హద్దులు : తూర్పు: గడిపూడి పూర్ణచంద్రరావు ఆస్తి, దక్షిణం: గడిపూడి సరేంద్ర ఆస్తి, పడమర: గడిపూడి గోవిందరాజులు ఆస్తి, ఉత్తరం: రోడ్డు. | స్వాధీనత తేది: 17-అక్టోబర్-23 |

తేది: 17.10.2023
ప్రదేశం: గుంటూరు

అధీకృత అధికారి
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్



**భౌతిక స్వాధీనత నోటీసు**

ICICI Home Finance

**రిజిస్టర్డ్ కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400051.
**కార్పొరేట్ కార్యాలయం:** ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్స్, జెబి నగర్, అంధేరి కుర్లా రోడ్డు, అంధేరి ఈస్ట్, ముంబాయి-400059
**శాఖ కార్యాలయం:** 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010.

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిందమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

| క్ర. సం | రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య | ఆస్తి వివరణ/స్వాధీనత తేది | డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ) | శాఖ పేరు |
|---|---|---|---|---|
| 1. | బందరుపల్లి నారాయణరావు (రుణగ్రహీత), **LHVJW00001373387** | 8 82, ఫ్లాట్ నం.301, ఎ బ్లాక్, 3వ అంతస్తు, ట్రెండ్‌సెట్ టవర్స్, నందిగామా, పిన్‌కోడ్-521175, నా, నందిగామా-521185. హద్దులు: ఉత్తరం: కామన్ కారిడార్, దక్షిణం: ఓపెన్ టూ స్కై, తూర్పు: మెట్ల కేస్ మరియు కామన్ కారిడార్, పడమర: ఓపెన్ టూ స్కై, ఢిల్లీ-110040. స్వాధీనతా తేది: 17-10-2023. | 10-10-2022 Rs. 23,29,575/- | విజయ వాడ-బి. |

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది: అక్టోబర్ 21, 2023,
ప్రదేశం: నందిగామ.

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్



Chola
Enter a better life

**చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**
కార్పొరేట్ ఆఫీసు: చోల క్రెస్ట్, సూపర్ బి, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600 032, టి.ఎన్.

**డిమాండ్ నోటీసు**

**సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్స్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 ("చట్టం") మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ("రూల్స్") యొక్క నిబంధనల క్రింద**

దిగువసంతకందారు అయిన **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క ఆధీకృత అధికారి (సెక్యూర్డ్ క్రెడిటార్) చట్టంలోని సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాలను అమలు చేసూ, నిబంధన 3తో చదివిన సెక్షన్ కింద డిమాండ్ నోటీసు(లు) జారీ చేయబడింది. చట్టంలోని 13(2) పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు సంబంధిత నోటీసు (ల)లో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత(లు)ని పిలవడం జరిగింది. రుణగ్రహీత (లు) డిమాండ్ నోటీసు (ల) సేవలను తప్పించుకుంటున్నారని/ నివారిస్తున్నారని దిగువ సంతకం చేసిన వారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు. కాబట్టి నిబంధనల ప్రకారం అనుబంధం చేయడం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు సేవ ప్రభావితమవుతుంది. డిమాండ్ నోటీసు(ల)లోని విషయాలు ఇక్కడ దిగువన సంగ్రహించబడ్డాయి.

| క్ర. సం | రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు మరియు చిరునామా | రుణం మొత్తం | డిమాండ్ నోటీసు తేది మరియు బాకీపడిన మొత్తం | సెక్యూర్డ్ అసెట్/ ఆస్తి వివరణ |
|---|---|---|---|---|
| 1. | రుణ ఖాతా నెం. **HL01VJI000038482** **1) నాగుల్ మీరావలి షేక్, 2) షకీల షేక్** **ఇరువురి నివాసం:** 24-28/3-284, రాజీవ్‌గాంధీ వీధి, సుందరనగర్ కాలనీ, విజయవాడ (అర్బన్), ఆంధ్రప్రదేశ్-520 003. **ఇక్కడ కూడా** : 204, ఒకటవ అంతస్తు, ఆర్.ఎస్.నం.143/4. 144/5, గుణదల, వంతెన, విజయవాడ (అర్బన్) 520 004, ఆంధ్రప్రదేశ్. | ₹ 32,80,000/- | 16.10.2023 రూ.33,77,170/- (ముప్పై మూడు లక్షల డెబ్బై ఏడు వేల ఒక వందా డెబ్బై రూపాయలు మాత్రమే) 14.10.2023 - నాటికి. | **ఏ- షెడ్యూల్** : కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు జిల్లా రిజిస్ట్రేషన్, గుణదల సబ్ రిజిస్ట్రార్స్ కార్యాలయం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, గుణదల బేరింగ్ ఆర్.ఎస్.నం.143/4, 144/5, డో.నం.49-4-12 వద్ద విస్తీర్ణం 968.88 చ.గ.లు. సైట్ ఉన్న హద్దులు : **సరిహద్దులు** : **తూర్పు:** గట్టి శకుంతల ఆస్తి 80.0 అ.లు., **దక్షిణం:** 33.0 అ.లు. వెడల్పు రోడ్డు 109.0 అ.లు., **పడమర:** దీప నివాస్ కు చెందిన సరిహద్దు గోడ 80.0 అ.లు., **ఉత్తరం:** కలపాల ప్రసాదరావు, కలపాల అంబేద్కర్ ఆస్తి 109.0 అ.లు. ఈ నాలుగు సరిహద్దుల సైట్ 968.88 చ.గ.లు. లేదా 810.1 చ.మీ.లు. సైట్ యొక్క ఆ అవిభక్త ఉమ్మడి వాటా 46.58 చ.గ.లు. లేదా 38.94 చ.మీ.లు. **బి- షెడ్యూల్** : పై ఏ-షెడ్యూల్ మొత్తం సైట్ లో **"శ్రీ కనకదుర్గా కన్‌స్ట్రక్షన్స్"** పేరు మరియు శైలిలో నిర్మించబడిన అపార్ట్‌మెంట్‌లో ఆ గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నం.103 ఉన్న హద్దులు : **సరిహద్దులు** : **తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర** : కామన్ కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై ఫ్లాట్ యొక్క నాలుగు సరిహద్దుల మధ్య ప్లింత్ ఏరియా 875 చ.అ.లు., ఫ్లాట్ యొక్క కామన్ ఏరియా 257 చ.అ.లు., పార్కింగ్ ఏరియా 100 చ.అ.లు. మరియు అందులో అన్నీ సౌలభ్య హక్కులతో. |

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు (లు)కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి **60 రోజులలోపు** వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చులు మరియు ఖర్చులతోపాటు అందులో పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని చెల్లింపు యొక్క సాక్షాత్కార తేదీ వరకు చెల్లించాలని దీని ద్వారా సూచించారు. **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ** లిమిటెడ్ సురక్షిత రుణదా అని మరియు రుణగ్రహీత (లు) పొందే రుణ సదుపాయం స్థిరాస్తి/ ఆస్తులు తనఖాగా ఉంచిన సురక్షి ఆస్తి (లు)కి వ్యతిరేకంగా సురక్షి రుణం అని రుణగ్రహీత (లు) గమనించవచ్చు. రుణగ్రహీతలు నిర్దీ గడువులోగా తమ బాధ్యతలను పూర్తి చేయడంలో విఫలమైతే, సురక్షితమైన ఆస్తులు (లు) స్వాధీనం చేసుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13 (4) ప్రకారం అన్ని హక్కులను వినియోగించుకోడానికి సురక్షి రుణదాకు అర్హత ఉంటుంది. విక్రయం ద్వారా చట్టం మరియు దాని క్రింద ఉన్న నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని అమలు చేయడం ద్వారా మరియు ద్వారా వాటిని బదిలీ చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా. సురక్షిత రుణదాతకు అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సురక్షి ఆస్తులు(లు) అటాచ్ చేయడానికి మరియు/లేదా సీల్ చేయడానికి కూడా అధికారం ఉంది. సురక్షిత ఆస్తుల (ల) విక్రయం ర్యా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన ఆస్తుల విలువ సరిపోకపోతే, బ్యాలెన్స్ బకాయిలను తిరిగి పొందటానికి ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఉంది. ఈ పరిహారం అదనంగా మరియు ఏదైనా ఇతర చట్టం ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్‌కు అందుబాటులో ఉన్న అన్ని ఇతర నివారణలకు స్వతంత్రంగా ఉంటుంది.
అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) కి, సురక్షిత ఆస్తులను మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి రుణగ్రహీతల దృష్టిని ఆహ్వానిస్తున్నారు. దీని ద్వారా రుణగ్రహీత (లు) సురక్షిత ఆస్తి (ల)ను పాడు చేయడం లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సురక్షి ఆస్తి(ల) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా బదిలీ చేయడం నుండి నిరోధించబడింది/ నిషేధించబడింది సెక్యూర్డ్ క్రెడిటార్ మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ కింద సంతకం చేసిన వారి వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత (లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ వేళల్లో ఏదైనా పని దినాన దిగువ సంతకం చేసిన వారి నుండి సేకరించుకోవచ్చును.

ప్రదేశం: విజయవాడ, ఆంధ్రప్రదేశ్
తేది: 16.10.2023

సం/-
అధీకృత అధికారి
మెసెర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్. తరపున



homefirst
We'll take you home

**Home First Finance Company India Limited,**
**CIN:L65990MH2010PLC240703,**
**Website: homefirstindia.com**
**Phone No.: 180030008425**
**Email ID: loanfirst@homefirstindia.com**

**స్వాధీనతా నోటీసు**

**రెఫ్ : సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 యొక్క సబ్ రూల్ (1) కింద స్వాధీనతా నోటీసు.**

ఏదైతే, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు, క్రింద ఇవ్వబడిన దాని సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసుకు అనుగుణంగా, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క యాక్ట్ నం.54) కింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) కింద అతని అందించబడిన అధికారాలను ఉపయోగిస్తూ సంబంధిత నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోపట మిగిలిన బకాయిలు చెల్లించమని పేరు క్రింద మిమ్మల్ని/రుణగ్రహీతలను కోరడమైనది. మీరు/ రుణగ్రహీతలు, ఏది ఏమైనా నిర్ణీత సమయంలోపట మిగిలిన బకాయిలు చెల్లించుటలో విఫలం చెందినారు, కావునా **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** వారు అధ్యాయనం చేసి మరియు ఆక్కడ క్రింద రూల్స్‌తో చదువుతూ SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) నిబంధనల క్రింద నిర్ణయించే హక్కులు కలిగి ఉండి, ఇక్కడ దిగువ పేర్కొన్న సెక్యూర్డ్ అస్సెట్స్ స్వాధీనం చేసుకోవడమైనది:

| క్ర. సం. | ఖాతా, రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/హామీదారుల పేరు | తనఖా ఆస్తి వివరణ | యు/ఎస్ 13(2) డిమాండ్ నోటీసు తేది | డిమాండ్ నోటీసు తేది నాటికి మొత్తం బకాయిలు (రూ.లో) | స్వాధీనతా తేది |
|---|---|---|---|---|---|
| 1. | షేక్ జాన్ షరీఫ్, షేక్ సైదా, షేక్ సుమియా బేగం | డో నం.229/2, డో నం.15-40/1, మూల్యాంకనం నం.1132005984, పిడుగురాల్లా గ్రామ పంచాయతీ మరియు గ్రామం, పిడుగురాల్లా ఎస్ఆర్‌ఓ గుంటూరు జిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522413 | 03-08-2023 | 23,58,572 | 17-10-2023 |
| 2 | మదల ప్రసాదరావు, సుజాత అంకోలు | డో నం.2-22 వద్ద, సర్వే నం.35/2, తటిగుమి గ్రామం, వీరులపాడు మండలం, కంచికచర్ల సబ్ రిజిస్ట్రీ ఎల్లక, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521185 | 03-08-2023 | 20,09,491 | 17-10-2023 |

రుణగ్రహీత మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత/హామీదారుడు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతను అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు.
ప్రత్యేకంగా **రుణగ్రహీతలు/హామీదారులు** మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిందమేమనగా పైన సూచించిన ఆస్తులు/సెక్యూర్డ్ అస్సెట్స్ ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు పూర్తి మొత్తం చెల్లింపు వరకు తదుపరి వడ్డీతో ఆస్తులు/సెక్యూర్డ్ అస్సెట్స్ ఎదురుగా పైన పేర్కొన్న మొత్తం **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** చార్జ్‌కు లోబడి ఉండవలెను.
సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలు ఆహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను.

ప్రదేశం: గుంటూరు తేది: 21.10.2023

సం/- ఆధీకృత అధికారి,హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

## శత వసంతాలు పూర్తి చేసుకున్న విఎస్

- అచ్యుతానందన్ జీవిత కథ 'ఏ సెంచరీ ఆఫ్ స్ట్రగుల్'ను ఆవిష్కరించిన పినరయి విజయన్



**తిరువనంతపురం :** ప్రముఖ కమ్యూనిస్టు నేత, మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ వందేళ్లు పూర్తి చేసుకుని 101వ వసంతంలోకి శుక్రవారం అడుగిడారు. ఈ సందర్భంగా తిరువనంత పురంలోని అయ్యంకాళి హాలులో ఆయన జీవిత కథ 'సెంచరీ ఆఫ్ స్ట్రగుల్'ను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆవిష్కరించారు. దర్శకుడు షాజీ ఎన్ కరుణ్ పుస్తకాన్ని అందుకున్నారు. రచయిత కె.వి.సుధాకరన్ రాసిన ఈ పుస్తకాన్ని చింతా పబ్లిషర్స్ ప్రచురించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రతో ముడిపడివున్న విఎస్ జీవితాన్ని ఈ పుస్తకంలో చక్కగా వివరించారని తెలిపారు. గతంలో వచ్చిన పుస్తకాలు అలా లేవని, పార్టీ నుంచి విడదీసి విఎస్‌ను ప్రత్యేకంగా చూపే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ఎనిమిది దశాబ్దాలుగా విఎస్ ప్రజల పక్షాన చురుగ్గా పనిచేశారని తెలిపారు. 96 ఏళ్ల వయసులో అనుకోకుండా కొన్ని శారీరక సమస్యలు ఎదురయ్యాయని చెప్పారు. అప్పటి నుంచి విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు.

## పాలస్తీనా రచయితల గొంతు నొక్కేస్తున్నారు!

- ప్రపంచవ్యాప్తంగా 1300మందికి పైగా రచయితలు, ప్రచురణకర్తల నిరసన
- మద్దతు లేఖపై సంతకాలు

**న్యూఢిల్లీ :** రచయిత అదానియా షిబ్లితో సహా పాలస్తీనా సాహిత్య కళాకారులకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా 1300మందికి పైగా రచయితలు, ప్రచురణకర్తలు ఒక లేఖపై సంతకాలు చేశారు. వీరిలో నోబెల్ బహుమతి గ్రహీతలు కూడా వున్నారు. ఇజ్రాయిల్‌పై హమస్ దాడి నేపథ్యంలో పాలస్తీనియన్ల కళలు, కథనాలు, వారి రచనలకు సంబంధించిన కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా రద్దు చేస్తున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో వీరందరూ మద్దతు లేఖను విడుదల చేశారు. అరబిక్ నుంచి అనువాదం చేసిన అనేక రచనలతో మూడు మాసాలకోసారి వెలువడే అరబ్‌లిట్ మేగజైన్‌ను ప్రచురించే సంస్థ అరబ్‌లిట్ ప్రయత్నాల మేరకు ఈ మద్దతు లేఖ విడుదల చేశారు. పాలస్తీనా రచయితలకు సంబంధించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలను పలు యురోపియన్ దేశాల్లో రద్దు చేసినట్లు వార్తలు వెలువడ్డాయని అరబ్‌లిట్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ప్రతిష్టాత్మక అవార్డు పొందిన పాలస్తీనియన్ రచయిత అదానియా షిబ్లి ఆ అవార్డును అందుకునే కార్యక్రమాన్ని రద్దు చేయడాన్ని ఆ లేఖ ప్రస్తావించింది. వచ్చే వారం ఫ్రాంక్‌ఫర్ట్‌లో పుస్తక ప్రదర్శన ప్రారంభం కానుంది. అందులో షిబ్లి రాసిన పుస్తకానికి గానూ 2023 సంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన జర్మనీ అవార్డు అందుకోవాల్సి వుంది. ఈ పుస్తక ప్రదర్శనలో ఆమె ఆ అవార్డును అందుకోలేరంటూ నిర్వాహకులు ఈ నెల 13న తెలియజేశారు. పైగా పుస్తక ప్రదర్శనలో షిబ్లి, ఆమె అనువాదకురాలితో జరగాల్సిన చర్చను కూడా రద్దు చేశారు. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందుగా షిబ్లికి తెలియచేశామని నిర్వాహకులు తప్పుడు ప్రకటన చేశారు. కానీ షిబ్లి ముందుగా తనకు ఏ విషయం తెలియజేయలేదని, నిర్ణయం తీసుకున్న తర్వాతే తెలియజేశారని చెప్పారు. ఇజ్రాయిల్‌లో యుద్ధం కారణంగా అదానియా షిబ్లి వాణిని నొక్కివేయడానికి చేసే ప్రయత్నంలోనే ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారని ఆ లేఖ విమర్శించింది. ఇది పిరికిపంద చర్య తప్ప మరొకటి కాదని వ్యాఖ్యానించింది.

# 'ఉపాధి' నుంచి ఐదు కోట్లమంది తొలగింపు

- రికార్డు స్థాయిలో జాబ్ కార్డులపై కోత
- వార్షిక సగటు కంటే అధికంగా వేటు



**ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో**

2022-23లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) డేటాబేస్ నుంచి జాబ్ కార్డ్‌ల తొలగింపు ఐదు కోట్లకు చేరుకుంది. లిబ్‌టెక్ ఇండియా పరిశోధనా సంస్థ నివేదిక ప్రకారం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 2022-23లో ఉపాధి హామీ డేటాబేస్ నుండి ఐదు కోట్ల జాబ్ కార్డ్‌లను తొలగించాయి. ఇది డ్యూ ప్రోసీజర్‌ను ఉల్లంఘించిందని సూచిస్తుందని తెలిపింది. ఇది వార్షిక సగటు 1 కోటి నుంచి 1.5 కోట్ల తొలగింపుల కంటే చాలా ఎక్కువని పేర్కొంది.

లిబ్‌టెక్ సంస్థ దేశం గ్రామీణ ప్రజా సేవల పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య విధానాన్ని మెరుగుపరచడానికి వివిధ అంశాలపై దృష్టి పెడుతుంది. లిబ్‌టెక్ ఇండియా అక్టోబర్ 2022- జూన్ 2023 మధ్య తెలంగాణ,,ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒడిశా, జార్ఖండ్‌లలో కార్డ్‌లు తొలగించబడిన 600 మంది కార్మికులను ఇంటర్వ్యూ చేయడంతో ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించింది. మొత్తం 600 తొలగింపులలో నియమాలు ఉల్లంఘించబడ్డాయని, 380 సందర్భాలలో ఉదహరించిన కారణాలు తప్పుగా ఉన్నాయని గుర్తించింది. నకిలీ కార్డులు, మరణాలు, కార్డ్ హోల్డర్లు పథకం కింద పని చేయడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాలను పేర్కొంటూ, ఇది సాధారణ నవీకరణ అని ప్రభుత్వాలు పేర్కొన్నాయి. లిబ్‌టెక్ ఇండియా పరిశోధకురాలు లావణ్య తమంగ్ 2022-23లో భారీ సంఖ్యలో తొలగింపులను ఉదహరించారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా సంఖ్యలను సరిచేయాలని సూచించాయి. ఇది ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్)తో ఉపాధి హామీ వేతన చెల్లింపులు జరిగేలా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడి వల్లే ఇలా జరిగింది. "కేంద్రగ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 100 శాతం ఎబిపిఎస్ చేయాలని పట్టుబట్టడంతో రాష్ట్రాలు జాబ్ కార్డుల తొలగింపును వేగవంతం చేసినట్టు కనిపిస్తోంది" అని తమంగ్ అన్నారు.

### జాబ్ కార్డులు తొలగింపులో నిబంధనలకు పాతర

ఉపాధి హామీ కింద జారీ చేయబడిన వార్షిక మాస్టర్ సర్క్యులర్‌లు (ఎంసిలు) 13 నిర్దిష్ట కారణాలపై జాబ్ కార్డ్ రద్దులను అనుమతిస్తాయి. జాబ్‌కార్డుల జోడింపు, తొలగింపు సంబంధిత గ్రామసభ ముందు తప్పనిసరిగా సమర్పించాలి. ఫీల్డ్ వెరిఫికేషన్ ఎక్సర్‌సైజ్‌లో 600 డిలీట్‌లలో గ్రామసభలను సంప్రదించలేదని తేలిందని తమంగ్ చెప్పారు. "చాలా సందర్భాలలో పంచాయతీలో పనిచేయడానికి ఇష్టపడకపోవడం, పనికి వెళ్లకపోవడం వంటి కారణాలను రాష్ట్రాలు ప్రస్తావించాయి. ధ్రువీకరణ తర్వాత, ఇంటర్వ్యూ చేసిన 600 మంది కార్మికులలో 380 మంది విషయంలో అధికారిక పత్రాలలో ఉదహరించిన కారణాలు నిజం కాదని మేము కనుగొన్నాము" అని తమాంగ్ తెలిపారు.

గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ 2023 జూలై 25న లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ప్రకారం ఉపాధి హామీ జాబ్ కార్డ్‌ల మొత్తం తొలగింపు 2021-22లో 1.5 కోట్లు కాగా, 2022-23లో 5.18 కోట్లకు చేరుకుంది. 2022-23లో 83 లక్షల జాబ్ కార్డుల తొలగింపుతో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో నిలిచింది. "జాబ్ కార్డ్‌ల తొలగింపుకు సంబంధించిన వివిధ కారణాల్లో. నకిలీ జాబ్ కార్డ్ (తప్పు జాబ్ కార్డ్)., డూప్లికేట్ జాబ్ కార్డ్. , పని చేయడానికి ఇష్టపడకపోవడం., గ్రామ పంచాయితీ నుంచి కుటుంబాన్ని శాశ్వతంగా మార్చాడం. జాబ్ కార్డ్‌లోని ఉన్న ఒకే వ్యక్తి మరణించడం" అని సమాధానంలో తెలిపారు.

### కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఉపాధి హామీ నిర్వీర్యం: బి.వెంకట్

కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఉపాధి హామీ నిర్వీర్యం అవుతుందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. జాబ్ కార్డులు తొలగించి, ఈ పథకాన్నే అటకెక్కించేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ కార్డుల తొలగింపునకు సరైనా కారణాలు చెప్పటం లేదని, ఎబిపిఎస్ విధానంతో జాబ్ కార్డులు తగ్గిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాలకు ఉపాధి హామీ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, వాటిని విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు. మరోవైపు ఉపాధి హామీకి బడ్జెట్ కేటాయింపులు కూడా తగ్గించారని, దీంతో ఆ పథకాన్ని అటకెక్కించేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. కేంద్రం నిధుల కేటాయింపులు పెంచటంతోపాటు జాబ్ కార్డుల తొలగింపును ఆపాలని డిమాండ్ చేశారు.

## నమో భారత్ రైలు ప్రారంభం

- ఆర్‌ఆర్‌టిఎస్ రైళ్లకు మోడీ పేరు పెట్టడంపై అభ్యంతరాలు



**న్యూఢిల్లీ:** ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ మధ్య రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్‌ఆర్‌టిఎస్) కారిడార్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం ప్రారంభించారు. 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ కారిడార్ శనివారం నుండి అందుబాటులోకి వస్తుంది. ర్యాపిడ్‌ఎక్స్ ట్రైన్‌కు 'నమో భారత్ రైలుగా' పేరు పెట్టారు. సహిబాబాద్ నుంచి దుహాయి డిపో మధ్య రైలును నడిపారు. ఆ రైలులో ప్రధాని మోడీ పర్యటించారు. స్కూల్ పిల్లలు, సిబ్బందితో ఆయన రైలులో ముచ్చటించారు. ఢిల్లీ-మీరట్ కారిడార్ మొత్తం 2025 నాటికి పూర్తి కానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి పాల్గొన్నారు. కనీస టికెట్ ధర రూ.20 కాగా, గరిష్ఠంగా రూ.100 టికెట్ ఉండనున్నది. ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాల సహకారంతో ఆర్‌ఆర్‌టిఎస్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు.

### 'నమో భారత్' పేరుపై అభ్యంతరం

రైళ్లకు 'నమో భారత్' అని పేరు పెట్టడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దేశం పేరును నమో అని మార్చేయండంటూ కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్‌ఖేరా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 2024 ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే కొత్త ర్యాపిడ్ రైలు వ్యవస్థకు 'నమో భారత్' అని పేరు పెట్టారని టిఎంసి నేత సాకేత్ గోఖలే ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## రాహుల్‌పై పిల్ కొట్టివేత

### పిటిషనర్‌కు లక్ష జరిమానా : సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడాన్ని సవాలు చేస్తున్న పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధించింది. పిటిషనర్ ప్రాథమిక హక్కులేవీ ఉల్లంఘించబడలేదని, కేవలం చట్టక్రమాన్ని ఈ పిటిషన్ దుర్వినియోగం చేసిందని జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని పునరుద్ధరించడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది అశోక్ పాండే ఈ పిటిషన్ దాఖలు చేశారు. మోడీ ఇంటి పేరు గురించి 2019లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో రాహుల్ నేర నిరూపణపై ఆగస్టు 4న సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ ఏడాది మార్చిలో హైకోర్టు నేర నిరూపణ చేసి, రెండేళ్ల జైలు శిక్ష విధించిన వెంటనే లోక్‌సభ సభ్యత్వానికి రాహుల్‌ను అనర్హుడిగా లోక్‌సభ సచివాలయం ప్రకటించింది. ఆగస్టు 4న సుప్రీంకోర్టు ఆ తీరుపై స్టే ఇవ్వడంతో లోక్‌సభ సచివాలయం రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరించింది.

ANDHRA PRADESH STATE GOVERNMENT EMPLOYEES MUTUALLY AIDED COOPERATIVE HOUSE BUILDING SOCIETY LIMITED
(REGD. NO.AMC/KNA/DCO/2016/122)
D.No.54-16-3/3, Plat No.48, Loyola gardens colony, Road No.3, Opp: Loyola College, VIJAYAWADA - 520 008, Krishna District, A.P.,

ప్రకటన

ఎన్నికల నోటిఫికేషన్, సెడ్యూల్ రద్దు చేయబడినది

పై సొసైటి వారి డైరక్టర్ల పోస్టులకు ఎన్నికలు నిర్వహించుటకు, ఎన్నికల అధికారి గారి Notification No.2/2023, Dt:14.10.2023 ద్వారా ఎన్నికల సెడ్యూల్ జారీ చేయబడినది. ది.16.10. 2023 వ తేదీన సదరు నోటిఫికేషన్ విషయమై దిన పత్రికలలో ప్రకటనను జారీ చేయడమైనది. కానీ, వివిధ అభ్యంతరాలు, టెక్నికల్, ఇతర కారణముల వలన ఎన్నికల అధికారి గారు నోటిఫికేషన్ ను రద్దు చేస్తూ, సదరు బాధ్యతల నుండి తప్పుకున్నందున, ఎన్నికల నోటిఫికేషన్ రద్దు కాబడినది. దానిని అనుసరించి తదుపరి నిర్ణయం తీసుకొనే వరకూ ఎన్నికల సెడ్యూల్, ఎన్నిక ప్రక్రియ నిలుపుదల చేయనైనది. సొసైటి సభ్యులకు తెలియ జేయనైనది.

Sd/- అడ్డాల సుబ్బరాజు
సొసైటి అధ్యక్షుడు
Date: 20.10.2023

## సింగరేణి కార్మికులకు దసరా బోనస్

- ఒక్కొక్కరికి రూ.1.53 లక్షలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సింగరేణి కార్మికులకు దసరా బోనస్ అందనుంది. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం రూ.711 కోట్లు విడుదల చేసింది. పండుగకు ఒక్కటి, రెండు రోజుల ముందే కార్మికుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. 42 వేల మంది సింగరేణి కార్మికులకు రూ.1.53 లక్షల చొప్పున జమ చేయనుంది. ఒకటి రెండు రోజుల్లో దసరా పండగ అడ్వాన్స్ కూడా చెల్లించే అవకాశం ఉందని సింగరేణి వర్గాల సమాచారం. సింగరేణి సంస్థ గతేడాది సాధించిన రూ.2,222.46 కోట్ల లాభంలో 32 శాతాన్ని దసరా పండుగకు ముందే చెల్లించనున్నట్టు సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్ ఇటీవల తెలిపారు.

# పసుపునకు మద్దతు ధర

- మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

' కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పసుపు పంటకు మద్దతు ధర కల్పిస్తాం.. వరి ధాన్యానికి బోనస్ ఇస్తాం.. మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం.. బిఆర్ఎస్ పాలనలో దోచుకున్న ప్రజల సొమ్మును బయటకు తీస్తాం' అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. టిపిసిసి విజయభేరి బస్సు యాత్రలో భాగంగా ఆయన మాట్లాడుతూ..కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు సర్వీస్‌లాగానే తెలంగాణలో సైతం ఆర్‌టిసిలో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి నెలా రూ.2500 ప్రతి కుటుంబానికీ అందిస్తామన్నారు. 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికీ 200 యూనిట్‌ల కరెంట్ ఉచితంగా ఇస్తామని చెప్పారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధరతోపాటు పసుపు మద్దతు ధర కల్పిస్తామని, ఎంఎస్‌పి కంటే అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇండ్లు లేని అందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లు నిర్మిస్తామన్నారు. చేయూత పథకం ద్వారా నాలుగు వేల రూపాయల పింఛన్ అందిస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని గద్దె దించి కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. బాల్కొండలో సునీల్‌రెడ్డిని, ఆర్మూర్‌లో వినయ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

### రాహుల్‌తో కోదండరాం భేటీ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టిజెఎస్ అధ్యక్షులు కోదండరాం భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం కరీంనగర్ వి పార్క్ హోటల్‌కు చేరుకుని రాహుల్‌తో సమావేశం అయ్యారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని కోదండరాంను రాహుల్ కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని కూడా సూచించారు. పోటీకి ఆసక్తి లేదని కోదండరాం పేర్కొన్నారు. ఎన్నికల్లో అవగాహన, బిఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. తెలంగాణ ప్రయోజనల కోసం, రాష్ట్రంలో రాజకీయ



పునరేకీకరణ జరగాలని కోదండరాం అన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని జన సమితి నిర్ణయించిందన్నారు. పొత్తులో భాగంగా కాంగ్రెస్ బలహీనంగా ఉన్న ముథోల్, ఎల్లారెడ్డి, కోరుట్ల, జహీరాబాద్ స్థానాలను తెలంగాణ జనసమితి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. కెసిఆర్ నియంత పాలనను దించడానికే టిజెఎస్ ఏర్పడిందని కోదండరాం వెల్లడించారు. ఈ భేటీలో కెసి వేణు గోపాల్, రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్-గాజా యుద్ధంలో 21 మంది జర్నలిస్టులు మృతి

**న్యూఢిల్లీ:** ఈ నెల 7న హమస్ దాడి, ఆ తరువాత ఇజ్రాయిల్ మారణకాండ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ 21 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. కమిటీ టూ ప్రొటెక్ట్ (సిపిజె) ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. మరణించిన జర్నలిస్టుల్లో 17 మంది పాలస్తీనియున్లు, ముగ్గురు ఇజ్రాయిలీలు, ఒక లెబనాన్‌కు చెందిన జర్నలిస్టు ఉన్నారు. ఈ యుద్ధంలో మరో ఎనిమింది జర్నలిస్టులు గాయపడ్డారని తెలిపింది. మరో ముగ్గురు గల్లంతు కావడం లేదా నిర్బంధంలో ఉన్నట్లు పేర్కొంది. మరణించిన 21 మంది జర్నలిస్టుల పేర్లు, వారి వృత్తి పరమైన వివరాలను కూడా సిపిజె ప్రకటనలో ప్రచురించింది. 'హృదయ విదారక యుద్ధాన్ని కవర్ చేయడానికి ఈ ప్రాంతంలో జర్నలిస్టులు గొప్ప త్యాగాలు చేస్తున్నారు. అన్ని దేశాలు వారి భద్రతను కాపాడడానికి చర్యలు తీసుకోవాలి' అని సిపిజె ప్రకటనలో తెలిపింది. ఈ యుద్ధంలో మరణించిన, గాయపడిన, నిర్బంధించబడిన జర్నలిస్టులకు చెందిన అన్ని వార్తలపై విచారణ చేస్తున్నట్లు తెలిపింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకూ నాలుగు వేల మంది కంటే ఎక్కువ మంది మరణించినట్లు భావిస్తున్నారు. మృతుల్లో అత్యధికులు పాలస్తీనీయులే.

### సహాయ ట్రక్కులకు అనుమతివ్వండి : ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్

ఇజ్రాయిల్ దిగ్బంధనంతో ఇబ్బందులు పడుతున్న గాజా ప్రజలకు సాయం అందేందుకు వీలుగా సహాయ ట్రక్కులను అనుమతించాల్సిందిగా ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన రాఫా సరిహద్దు క్రాసింగ్‌ను సందర్శించారు. పాలస్తీనియన్లు కూడా అందబోయే సాయం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. లెబనాన్‌తో గల సరిహద్దులో హిజ్బులా తీవ్రవాదులతో రోజుల తరబడి ఘర్షణలు కొనసాగించిన అనంతరం ఉత్తర ప్రాంత కిర్యాత్ షామోనా నగరాన్ని ఖాళీ చేయనున్నట్లు శుక్రవారం ఇజ్రాయిల్ అధికారులు ప్రకటించారు.

## ఉపాధ్యాయుల దీక్షలు భగ్నం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్.ప్రసాద్ తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి విలేకరులతో వారు మాట్లాడారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తానన్న ముఖ్యమంత్రి జిపిఎస్‌ను తీసుకురావడం శోచనీయమన్నారు. 2040 నాటికి పెన్షన్ భారం వేల కోట్ల రూపాయలు పెరగనుందని ముఖ్యమంత్రి చెబుతున్నారని, జిపిఎస్ జిఒలో మాత్రం కేవలం రూ.2,500 కోట్లు అని ప్రభుత్వం పేర్కొందని తెలిపారు. కంట్రిబ్యూషన్‌లేని పెన్షన్‌ను ఉద్యోగులు కోరుతున్నారని తెలిపారు. పాత పెన్షన్ పునరుద్ధరణకు నిరవధిక దీక్షలు చేపడతామని, ఈ నెల 9న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తాము నోటీసు అందించామని తెలిపారు. అయినా, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరవధిక దీక్షలకు దిగాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 3.5 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత పెన్షన్ అమలు చేయకుండా జిపిఎస్ అమలు చేయడం తగదన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒపిఎస్ పునరుద్ధరిస్తామనే పార్టీకే ఓట్లు వేయాలనే ప్రచారం చేస్తామన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఒపిఎస్ పునరుద్ధరణ డిమాండ్‌ను సజీవంగా ఉంచాలనే డిమాండ్‌తో చేపట్టిన యుటిఎఫ్ దీక్షలు విజయవంతమయ్యాయని తెలిపారు. ఒపిఎస్ పునరుద్ధరణకు రాష్ట్రంలో పలుచోట్ల చోట్ల బహిరంగ సభలు నిర్వహించి ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులను సమైఖ్య పరుస్తామన్నారు. యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహాధ్యక్షులు ఎఎస్ కుసుమకుమారి, ఎస్‌పి మనోహర్‌కుమార్, ప్రచురణల విభాగం చైర్మన్ ఎం హనుమంతరావు పాల్గొన్నారు.

## మారణకాండను సమర్థిస్తున్నారా?

- రిషి సునాక్ వ్యాఖ్యలపై మండిపడ్డ పాలస్తీనా సంస్థ



**జెరూసలెం :** 'ఈ యుద్ధంలో మీరు గెలవాలని మేం కోరుకుంటున్నాం' అంటూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో చెప్పడంపై సర్వత్రా విమర్శలు, ఖండనలు వెల్లువెత్తాయి. సునాక్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, 'ఈ ఊచకోత, మారణకాండ కొనసాగించేందుకు ఇజ్రాయిల్‌కు ఆమోదం తెలిపినట్లు వుంది.' అని పాలస్తీనా సాలిడారిటీ క్యాంపెయిన్ (పిఎస్‌సి) విమర్శించింది. ప్రతి రోజూ ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో పదుల సంఖ్యలో ప్రజలు చనిపోతున్నారని, ఆహారం, నీరు, విద్యుత్, ఇంధనం లేకుండా గాజా ప్రజలు రోజుల తరబడి గడుపుతున్నారని ఆ గ్రూపు హెచ్చరించింది. కనీస సరఫరాలు లేక ఆస్పత్రులు దాదాపు కుప్పకూలే దశకు చేరుకున్నాయన్నారు. పిఎస్‌సి డైరెక్టర్ బెన్ జమాల్ మాట్లాడుతూ, సైనిక ఆక్రమణలో దశాబ్దాల తరబడి పాలస్తీనియన్లను అణచివేస్తున్న, వర్ణ వివక్ష వ్యవస్థను అమలు చేస్తున్న ఇజ్రాయిల్‌కు సంఘీభావం తెలియచేయడం కోసమే రిషి సునాక్ పర్యటన ఉద్దేశించినట్టైతే ఆయన దాన్ని రద్దు చేసుకోవాలని వ్యాఖ్యానించారు. సునాక్ మాట్లాడిన తీరు చూస్తుంటే అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా విడిచిపెట్టి, యుద్ధ నేరాలకు పాల్పడడాన్ని సమర్థిస్తున్నారని అన్నారు. కాల్పుల విరమణ జరిపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవడం, గాజా దిగ్బంధనానికి అంతం పలకడం, గాజా ప్రజలకు మానవతా సాయం అందేలా చూడడం ఆయన ఈ పర్యటనలో సాధించదగ్గ ఏకైక విషయమని అన్నారు. కానీ, ఆయన అలా చేయలేదని, అది సిగ్గుచేటైన విషయమని జమాల్ విమర్శించారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence

**లారస్ ల్యాబ్స్ లిమిటెడ్**

**రిజిస్టర్డ్ ఆఫీస్:** లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ.బోనంగి (గ్రా), పరవాడ (మం), అనకాపల్లి (జి) -531 021, ఆంధ్రప్రదేశ్.
**కార్పొరేట్ ఆఫీస్:** 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం.7, బంజారాహిల్స్, హైదరాబాద్-500 034, తెలంగాణ
Tel: +91 40 3980 4333 ; Fax : +91 040 3980 4320 ; E-mail: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com
(CIN: L24239AP2005PLC047518)

**30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం & అర్ధ సంవత్సరానికి లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ యొక్క ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను అనుసరించి సిద్ధం చేయబడినవి** (రూ.కోట్లలో)

| క్ర. సం. | వివరాలు | ముగిసిన త్రైమాసికం | | | ముగిసిన అర్ధ సంవత్సరం | | ముగిసిన సంవత్సరం |
|---|---|---|---|---|---|---|---|
| | | 30-Sep-23 | 30-Jun-23 | 30-Sep-22 | 30-Sep-23 | 30-Sep-22 | 31-Mar-23 |
| | | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేసినవి) |
| 1 | ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం | 1,224.45 | 1,181.79 | 1,575.89 | 2,406.24 | 3,114.83 | 6,040.55 |
| 2 | కాలవ్యవధి కొరకు నికర లాభం (పన్ను, మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటెంలకు ముందు) | 53.89 | 40.58 | 328.07 | 94.47 | 683.95 | 1,108.94 |
| 3 | పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత) | 53.89 | 40.58 | 328.07 | 94.47 | 683.95 | 1,108.94 |
| 4 | పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత) | 37.12 | 26.79 | 233.39 | 63.91 | 485.62 | 793.43 |
| 5 | కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం | 35.47 | 24.36 | 228.78 | 59.83 | 480.01 | 787.80 |
| 6 | పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత) అట్రిబ్యూటెడ్ | | | | | | |
| | 1) కంపెనీయొక్క ఈక్విటీ వాటాదారులు | 36.95 | 24.85 | 232.81 | 61.80 | 484.09 | 790.11 |
| | 2) నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్స్ | 0.17 | 1.94 | 0.58 | 2.11 | 1.53 | 3.32 |
| 7 | కాలవ్యవధి అట్రిబ్యూటెడ్ కొరకు పూర్తి సమగ్ర ఆదాయం | | | | | | |
| | 1) కంపెనీయొక్క ఈక్విటీ వాటాదారులు | 35.30 | 22.42 | 228.20 | 57.72 | 478.48 | 784.53 |
| | 2) నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్స్ | 0.17 | 1.94 | 0.58 | 2.11 | 1.53 | 3.27 |
| 8 | ఈక్విటీ వాటా మూలధనం | 107.73 | 107.73 | 107.47 | 107.73 | 107.47 | 107.73 |
| 9 | ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివ్యాల్యూవేషన్ రిజర్వు మినహాయించి) మరియు నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్స్ | | | | | | 3,929.80 |
| 10 | వాటా ఒక్కింటికి రాబడి (రూ.2/- చొప్పున) | | | | | | |
| | 1. బేసిక్ : రూ. | 0.69 | 0.46 | 4.33 | 1.15 | 9.01 | 14.69 |
| | 2. డైల్యూటెడ్: రూ. | 0.68 | 0.46 | 4.32 | 1.14 | 8.98 | 14.64 |

ముగిసిన త్రైమాసికం మరియు అర్ధ సంవత్సరానికి కొరకు వార్షికం కానివి.

**గమనికలు:**

**1. 30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు అర్ధ సంవత్సరానికి ఆడిట్‌చేయని స్టాండ్అలోన్ ఆర్థిక ఫలితాలపై అదనపు సమాచారం.** (రూ.కోట్లలో)

| క్ర. సం. | వివరాలు | ముగిసిన త్రైమాసికం | | | ముగిసిన అర్ధ సంవత్సరం | | ముగిసిన సంవత్సరం |
|---|---|---|---|---|---|---|---|
| | | 30-Sep-23 | 30-Jun-23 | 30-Sep-22 | 30-Sep-23 | 30-Sep-22 | 31-Mar-23 |
| | | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేయనివి) | (ఆడిట్‌చేసినవి) |
| 1 | ఆపరేషన్ల నుండి పూర్తి రెవెన్యూ | 1,158.03 | 1,107.65 | 1,498.16 | 2,265.68 | 2,993.41 | 5,773.45 |
| 2 | పన్నుకు ముందు లాభం | 63.21 | 17.25 | 316.68 | 80.46 | 644.29 | 1,051.43 |
| 3 | పన్ను తరువాత లాభం | 46.67 | 13.07 | 227.44 | 59.74 | 459.05 | 760.38 |
| 4 | కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం | 45.44 | 11.85 | 227.28 | 57.29 | 458.74 | 761.17 |

2) సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీతో దాఖలు చేయబడిన త్రైమాసికం/ అర్ధ సంవత్సరానికి ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం పై విధంగా ఉన్నవి. త్రైమాసికం/ అర్ధ సంవత్సరానికి ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజి వెబ్‌సైట్ మరియు కంపెనీ పేరు www.bseindia.com, www.nseindia.com and www.lauruslabs.com నందు అందుబాటులో ఉన్నాయి.

3) ఆడిట్ కమిటీచే సమీక్షించినట్లుగా కంపెనీ యొక్క పై ఆర్థిక ఫలితాలు 20 అక్టోబర్, 2023న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదించబడినవి.

బోర్డు ఆదేశాల మేరకు
**లారస్ ల్యాబ్స్ లిమిటెడ్** తరపున
**డా.సత్యనారాయణ చావ**
పూర్తికాలపు డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ప్రదేశం : హైదరాబాద్
తేది: 20 అక్టోబర్, 2023



### మీకోసం

తరచూ తుమ్ములు, జలుబు, దురదలు వస్తుంటే ఆహారంలో అల్లం, పసుపు, జీలకర్ర ఎక్కువగా తీసుకోవాలి.

### జీవన సౌరభం

ఇతరులకు అర్థమయ్యేటట్లు చెప్పలేకపోవడమంటే ఆ విషయం నీకే సరిగ్గా అర్థం కాలేదన్నమాట.

JEEVANA జీవన the family

## అత్యాశ



చెట్టు మీద ఉన్న గండు చీమకు నీటిపై ప్రయాణం చేయాలని ఆశ కలిగింది. చెట్టునుండి కిందకు రాలిన ఆకును తనని నీటిపై తీసుకెళ్ళమని అడిగింది. ఆకు సరేనని తన వీపుపై చీమని ఎక్కించుకుని ప్రయాణం చేయసాగింది. నీటిపై ప్రయాణం చేస్తున్న చీమకు ఈత కొడుతున్న చేపను చూసి తను కూడా ఈత కొట్టాలని కోరిక కలిగింది. వెంటనే చేపతో 'చేప మిత్రమా! నాకు ఈత నేర్పించవా' అని అడిగింది. చేప సరే అంటూ చీమకు ఈత ఎలా కొట్టాలో నేర్పించింది. చీమ ఆనందంగా ఈత కొట్టింది.

ఇంతలో గాలిలో ఎగురుతున్న పిచ్చుకను చూసి గాలిలో ప్రయాణం చేయాలని అనిపించి పిచ్చుకతో 'పిచ్చుక బావా నన్ను గాలిలో తిప్పవా' అని అడిగింది. పిచ్చుక సరేనంటూ తనపై ఎక్కించుకుని గాలిలో తిప్పింది. ఈసారి చీమకి తాను పిచ్చుకలా గాల్లో ఎగరాలని అత్యాశ కలిగింది. వెంటనే పిచ్చుకతో 'నాకు నీలా ఎగరాలని ఉంది .నీ ఈకలు ఇస్తే ఎగురుతాను' అని అంది. అందుకు పిచ్చుక 'ఎగరడానికి రెక్కలు ఉండాలి గాని, ఈకలతో ఎగరలేము' అని అంది.

'పరవాలేదు నేను ఎగురుతాను. వాటిని అంటించుకున్నాక. నన్ను పై నుండి వదిలేయి. అలాగే ఎగురు కుంటూ వస్తాను' అని పట్టు పట్టింది చీమ. 'సరే నీ ఇష్టం' అంటూ పిచ్చుక రెండు ఈకలు ఇచ్చి గాల్లో వదిలేసింది.

అంతే! వాటిని అంటించుకున్న చీమ, గింగిరాలు కొడుతూ కింద పడింది. ఇంకేముంది కాళ్ళు విరిగి, నడవలేక, ఈదలేక, ఎగరలేక ఓ మూల కూర్చుంది. తన అత్యాశ వల్ల తనకీ గతి పట్టిందని దు:ఖించింది.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం,
77802 77240

### అంకెలు కలపండి

పిల్లలూ, కింద ఇచ్చిన అంకెలను వరుసగా కలిపి చూడండి.



### నేను గీసిన బొమ్మ



టి.ముని అవినాష్,
2వ తరగతి,
దిగువ సాంబయ్య పాళెం,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

## క్రీడాకారుల తయారీలో ...

**కొంతమంది వ్యక్తులు సమాజాన్ని చైతన్యం చేయడంలో నిరంతరం కృషి చేస్తుంటారు. మరికొంతమంది సామాజిక సేవలో భాగం అవుతారు. చాలా కొద్దిమంది మాత్రమే ఇతరులు ఉన్నత శిఖరాలు చేరుకునేలా శ్రమిస్తారు. అలాంటివారిలో ఒకరే తమిళనాడు వెల్లూరుకు చెందిన 63 ఏళ్ల ఆర్ ఎం నారాయణన్. ఎల్ఐసి ఉద్యోగిగా ప్రస్తుతం రిటైర్డ్ అయిన ఈ వ్యక్తి 20 ఏళ్లుగా ప్రమోషన్లు కూడా వద్దనుకుని ఒకే ప్రాంతంలో ఉండిపోయారు. కారణమేమంటే తన లక్ష్యం నెరవేరాలంటే అతను అక్కడ తప్పక ఉండాలి మరి. క్రీడలపట్ల ఆసక్తి ఉండి శిక్షణ ఖర్చు భరించలేని పేద కుటుంబాలకు చెందిన వారికి ఉచితంగా షాట్ పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో వంటి క్రీడలు నేర్పించడమే ఆయన లక్ష్యం. అలా 1989 నుండి ఇప్పటివరకు వెయ్యి మంది క్రీడాకారులను తయారుచేశారు. ఆదాయం నుండి కొంత మొత్తం, పెన్షన్ డబ్బులను కూడా శిక్షణ కోసం ఉపయోగించారు.**



63 ఏళ్ల వ్యక్తి అయినా- తెల్లవారుజామునే నడక ప్రారంభిస్తారు. రోజుకు 5 కిలోమీటర్లు పరుగెత్తుతారు. 'ఎక్కువ మంది క్రీడాకారులకు ఎక్కువకాలం శిక్షణ ఇవ్వాలంటే నేను ఆరోగ్యంగా ఉండడం చాలా ముఖ్యం' అంటున్న ఈ పెద్దాయన 2017-18 ఏడాదికి గాను తమిళనాడు ప్రభుత్వం నుండి ఉత్తమ శిక్షకుడు అవార్డును కూడా అందుకున్నారు.

'ఉచితంగా వచ్చే దేనికైనా విలువ ఉండదని చాలా మంది అనుకుంటారు. రికార్డులు బద్దలుకొడుతున్న నా విద్యార్థులు ద్వారా ఉత్తమమైన వాటిని చూపించాలని, సమాజానికి సేవ చేయడమే ధ్యేయంగా నా ప్రయత్నాలు ఉన్నాయని నిరూపిస్తున్నాను' అంటున్న రామాయణన్ విద్యార్థుల్లో నలుగురు అంతర్జాతీయ క్రీడాకారులు, బంగారు పతకాలు సాధించిన 8 మంది జాతీయ క్రీడాకారులు ఉన్నారు.

ప్రభుత్వరంగ ఉద్యోగిగా ఉంటూ క్రీడాకారులను తయారు చేయాలని ఎందుకు లక్ష్యం పెట్టుకున్నారు అనడిగితే- 'స్కూల్లో ఉన్నప్పటి నుండే నాకు క్రీడల పట్ల ఆసక్తి ఎక్కువ. 1976లో ప్రభుత్వ క్రీడాప్రాంగణంలో చేరి శిక్షణ తీసుకున్నాను. పలు రాష్ట్ర, జాతీయ, స్థాయి జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, 400 మీటర్ల హర్డిల్స్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. అయితే 1986 నాటికి ఉద్యోగంలో స్థిరపడ్డాను. ఉద్యోగానికి క్రీడలకు సమన్యాయం చేయలేక, తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ కాలం క్రీడారంగంలో కొనసాగలేకపోయాను. అయితే నాకున్న పరిజ్ఞానంతో మరింత మంది క్రీడాకారులను తయారు చేయాలనుకుని లక్ష్యం పెట్టుకున్నాను. ఆ దిశగానే 1989 నుండి ఉచితంగా శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను' అంటున్నారు.

ఆటపై ఆసక్తితో పాటు శారీరక దృఢత్వంపై పట్టు ఉన్నవారినే నారాయణన్ శిక్షణకు తీసుకుంటారు. రోజుకు 6 గంటలు శిక్షణ ఇస్తారు. 35 ఏళ్లుగా ఇదే విధానం. ఆయన రిటైర్డ్ అయినప్పటి నుండి పారా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. 'దీనికోసం నేను మరికొన్ని గంటలు అదనంగా పనిచేయాల్సి వస్తోంది. కలలు సాకారం చేసుకోవాలనుకుని నా దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరి పట్ల శ్రద్ధ పెట్టడం నా విధి' అంటున్నారు.

అయితే.. ఇప్పటివరకు శిక్షణ ఇచ్చింది వేరు. ఇప్పుడు పారా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం వేరు. ఆర్థిక ఇబ్బందులు, వైకల్యం వారిని ఉచిత శిక్షణ వరకు తీసుకువచ్చినా క్రీడల్లో పాల్గొనే అవకాశం అందరికీ ఉండదు. అందుకే నారాయణన్ తన దగ్గరకి వచ్చిన పారా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి ఊరుకోకుండా పలు పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సాయం కూడా చేస్తున్నారు.

'రెండేళ్ల క్రితం నుండి నారాయణన్ సార్ దగ్గర శిక్షణకు వస్తున్నాను. శిక్షణతో సరిపెట్టకుండా, మా ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్‌లు వచ్చే వీలు కూడా కల్పిస్తున్నారు. అలా నా జిమ్ ఖర్చుల కోసం ఏడాదికి రూ.30 వేల స్కాలర్‌షిప్ అందుతోంది' అంటూ నారాయణన్ పట్ల తనకున్న అభిమానాన్ని పంచుకుంది పారా క్రీడాకారిణి కీర్తిక. మా బృందంలో ముథురాజ్ అనే క్రీడాకారుడు ఉన్నాడు. రోజూ గ్రౌండ్‌కి వచ్చేందుకు అతనికి బైక్ లేదు. సార్ అతనికి బైక్ ఇప్పించారు' అంటూ తన తోటి క్రీడాకారుడి పట్ల నారాయణన్ ఔదార్యాన్ని కూడా చెప్పింది.

'రిటైర్డ్ అయిన తరువాత పూర్తికాలం శిక్షణ ఇవ్వాలని ముందుగానే అనుకున్నాను. అయితే పారా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాక, వారి అంకిత భావం చూసి, నాలో మరింత ఉత్సాహం పెరిగింది. పారా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేవారు చాలా తక్కువ మంది ఉన్నారు. కానీ ఎంతో అంకిత భావంతో తామెంటో నిరూపించుకోవాలనుకునే పారా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం కోసం శిక్షకులు ముందుకురావాలి' అని ఆయన ఆశిస్తున్నారు.

## వైట్ టీ ఉపయోగాలు బోలెడు

**చాలా మందికి బ్లాక్ టీ, గ్రీన్ టీ గురించి తెలుసు కానీ, వైట్ టీ గురించి మాత్రం అంతగా తెలియదు. దీన్నే 'కెమిల్లా టీ' అని పిలుస్తారు. ఇది మనకు బయట లభిస్తుంది. కెమిల్లా సైనసిస్ అనే మూలిక నుంచి ఈ టీని తయారు చేస్తారు. ఈ టీలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా పాలిఫినాల్స్ ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకుంటాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.**

- వైట్ టీని రోజూ తాగడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉండదు.
- ఈ టీలో కెఫీన్, ఏజీసీజీ సమ్మేళనాలు ఉండటం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో బరువును తగ్గించుకోవచ్చు.
- ఫ్లోరైడ్స్ అధికంగా ఉండడం వల్ల సూక్ష్మ క్రిములను చంపి, దంతాలు, చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. నోటి దుర్వాసన తగ్గుతుంది. నోట్లో బాక్టీరియా నశిస్తుంది.



- అలాగే క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించే గుణాలు ఇందులో ఉంటాయని పరిశోధకులు చెబుతున్నారు.
- ఇందులో ఉండే పాలిఫినాల్స్ శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది.
- ఎముకలు బలహీనంగా మారి విరిగిపోయే ఆస్టియోపోరోసిస్ సమస్యను వైట్ టీలో ఉండే పాలిఫినాల్స్, కాటెకిన్స్ తగ్గిస్తాయి. ఎముకలను బలంగా మారుస్తాయి.
- వైట్ టీని రోజూ తీసుకోవడం వల్ల చర్మం మీద ముడతలు ఏర్పడకుండా ఉంటాయి.

ఇదీ, తయారీ విధానం

200 ఎంఎల్ నీటిని 5 నిమిషాలు మరిగించాలి. బుడగలు వస్తున్నప్పుడు నీటిని కప్పులో పొయ్యాలి. అందులో వైట్ టీ బ్యాగ్ వెయ్యాలి. రెండు నిమిషాల్లో అందులోని సారం నీటిలో చేరుతుంది. దీనికి తీపిదనం కోసం చక్కెర లేదా తేనె కలుపుకోవాలి. బరువు తగ్గాలనుకునేవారు తేనె కలుపుకుంటే ప్రయోజనం ఉంటుంది.

## 'ఆపరేషన్ వాలెంటైన్' షూటింగ్ పూర్తి



హీరో వరుణ్ తేజ్ నటిస్తున్న తెలుగు-హిందీ ద్విభాషా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' ఈ సినిమాతో వరుణ్ తేజ్ హిందీలో అరంగేట్రం చేస్తున్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్‌గా కనిపించనున్నారు. తాజాగా ఈ చిత్ర అప్‌డేట్‌ని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని పేర్కొన్నారు. 'ఆపరేషన్ వాలెంటైన్ షూటింగ్ పూర్తి' అని రాసి ఉన్న పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. మానుషి చిల్లర్ తెలుగులో తొలిగా నటించనున్నారు. ఈ సినిమాలో ఆమె రాడార్ ఆఫీసర్ పాత్రను పోషించింది. కీలక పాత్రలో నవదీప్ నటించినట్లుగా సమాచారం. డిసెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నందకుమార్ అబ్బినేని, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ సహ నిర్మాతలు.



## స్వేచ్ఛ లేకుండా జీవించలేను

'నేను మంచి స్థాయికి ఎదిగాను. నేను ఏం చేయాలో ఇంకొకరు చెప్పాలని నేను అనుకోను. నా పెళ్లి విషయంలో నా తల్లిదండ్రులు నన్ను అర్థం చేసుకున్నారు. వారు నాకు స్వేచ్ఛ ఇచ్చారు. నేను స్వేచ్ఛ లేకుండా జీవించలేను. అది వాళ్లకు తెలుసు. 'మా అమ్మమ్మ బతికి ఉన్నప్పుడు పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేది. పెళ్లి చేసుకోకూడదా అని అడుగుతూనే ఉండేది. ఆమె ఇప్పుడు ఈ లోకంలో లేరు. ఆమె తప్ప మరెవరూ ఈ విషయంలో పెద్దగా పట్టించుకోలేదు' అని నిత్య మీనన్ తన పెళ్లి విషయంపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

## 'కీడా కోలా' ఫస్ట్ సింగిల్




తరుణ్ భాస్కర్ దర్శకత్వంతో వస్తున్న తాజా చిత్రం 'కీడా కోలా'. తరుణ్ భాస్కర్, బ్రహ్మానందం, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం దగ్గుబాటి రానా సమర్పణలో నవంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్, ట్రైలర్‌లను విడుదల చేశారు. తాజాగా చిత్రబృందం ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చింది. 'డిపిరి డిపిరి' అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. ఈ పాటకు భరద్వాజ్ లిరిక్స్ అందించగా, హనుమాన్ పాడారు. వివేక్ సాగర్ సంగీతం సమకూర్చారు. వీజీ సైన్మా సంస్థ ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## సునీతతో విబేధాల్లేవు : ఉష

గాయని సునీతతో తనకు ఎలాంటి విభేదాల్లేవని మరో గాయని ఉష స్పష్టంచేశారు. 'చిత్రం' సినిమాతో ఆమె నేపథ్య గాయనిగా వెండితెరకు పరిచయమైన విషయం తెలిసిందే. ఎన్నో ప్రేమ, కుటుంబ కథా చిత్రాల్లో గీతాలు ఆలపించారు. 'నువ్వు నేను', 'నువ్వు లేక నేను లేను', 'మనసంతా నువ్వే', 'నీ స్నేహం', 'సంతోషం' 'ఇంద్ర', 'దిల్' వంటి చిత్రాలు ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. సునీతతో విబేధాలు ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై ఆమె ఈ విధంగా స్పందించారు. 'మా మధ్య మంచి అనుబంధం ఉంది. కలిసి ప్రోగ్రామ్స్ కూడా చేశాం. అమెరికా వెళ్లిన తర్వాత నేను ఎవరితోనూ టచ్‌లో లేను. దాంతో మా మధ్య గొడవలు అయ్యాయంటూ వదంతులు సృష్టించారు. ఇలాంటి వాటిని నేను ప్రోత్సహించను. గతంలో ఇలాగే వార్తలు వస్తే నేను క్లారిటీ కూడా ఇచ్చా. మా మధ్య మంచి స్నేహపూర్వక వాతావరణం ఉంది. ఇటీవల మేమిద్దరం కలిసి కొన్ని కార్యక్రమాలు కూడా చేశాం' అని వెల్లడించారు.

## నవంబరు 3న 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని'



శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని' అనే సినిమా తెరకెక్కుతోంది. శ్రీ భారత ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ సినిమాకి జి.సందీప్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా పోస్టర్‌ను అల్లరి నరేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని' టైటిల్ లాంచ్ చేయడం ఆనందంగా ఉంది, పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. దర్శకుడు నేను నటించిన 'సిల్లీ ఫెలోస్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు, ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా విజయవంతమై టీమ్ అందరికీ మంచి పేరు రావాలి, దర్శకుడిగా సందీప్ బిజీ కావాలి" అని అన్నారు. నవంబర్ 3న సినిమా విడుదల చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు.

## 17న 'సప్త సాగరాలు దాటి - సైడ్ బి'



కన్నడ నటుడు రక్షిత్ శెట్టి, రుక్మిణీ వసంత్ జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'సప్త సాగరాలు దాటి'. ఈ సినిమా సీక్వెల్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. హేమంత్ ఎం.రావు దర్శకత్వం వహించారు. గత నెలలో ఈ చిత్రం విడుదలైన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'సప్తసాగరాలు దాటి సైడ్ బి' నవంబర్ 17న కన్నడతోపాటు తెలుగు, తమిళ, మలయాళీ భాషల్లో విడుదల కానుంది.

## వార్నర్, మార్ష్ శతకాలు



**తొలి వికెట్‌కు రికార్డు భాగస్వామ్యం ● జంపా మ్యాజిక్ బౌలింగ్**
**పాక్‌పై 62పరుగుల తేడాతో ఆసీస్ గెలుపు ● షాహిన్ అఫ్రిదికి ఐదు వికెట్లు**

**బెంగళూరు:** ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకొని టాప్-4కు చేరుకుంది. చిన్నస్వామి స్టేడియంలో పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 62పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 367పరుగుల భారీస్కోర్ చేయగా.. ఛేదనలో పాకిస్తాన్ 45.3ఓవర్లలో 305పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో పాక్ జట్టు ఓ దశలో 3వికెట్ల నష్టానికి 232పరుగులు చేసి పటిష్టంగా ఉన్నా.. ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి పరాజయాన్ని చవిచూసింది. పాక్ జట్టు ఓపెనర్లు అబ్దుల్లా(64), ఇమామ్(70) తొలి వికెట్‌కు 134పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు. ఆ తర్వాత కెప్టెన్ బాబర్(18) నిరాశపరిచినా.. షాద్ షకీల్(30) ఫర్వాలేదనిపించాడు. పాక్ జట్టు విజయానికి చేరువ అవుతున్న దశలో ఆడం జంపా ఒకే ఓవర్లో రిజ్వాన్(46), ఇఫ్తికార్(26)లను ఔట్ చేసి మ్యాచ్‌ను ఆసీస్‌వైపు తిప్పాడు. జంపాకు నాలుగు, స్టొయినీస్, కమిన్స్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

అంతకుముందు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు ఓపెనర్లు వార్నర్(163), మిఛెల్ మార్ష్ (121) తొలి వికెట్‌కు 259పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత ఆసీస్ జట్టు వరుసగా వికెట్లను కోల్పోయింది. షాహిన్ అఫ్రిదికి ఐదు, రవూఫ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డేవిడ్ వార్నర్‌కు లభించింది.

**ఆసీస్ రికార్డు భాగస్వామ్యం..**

వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్లు డేవిడ్ వార్నర్(163), మిచెల్ మార్ష్(121) రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సెంచరీలతో కదం తొక్కిన వీరు తొలి వికెట్‌కు వీరిద్దరూ ఏకంగా 259 పరుగుల జతచేశారు. దీంతో వన్డే వరల్డ్‌కప్‌లో ఆసీస్ తరఫున తొలి వికెట్‌కు రికార్డు భాగస్వామ్యం నమోదైంది. అలాగే ఆసీస్ ఓపెనర్లు ఇద్దరూ వన్డే ప్రపంచకప్‌లో సెంచరీ చేయడం కూడా ఇదే తొలిసారి. ఓవరాల్‌గా వన్డే ప్రపంచకప్‌లో తొలి వికెట్‌కు 200కు పైగా పరుగులు జతచేసిన వీరు ఆరో స్థానంలో నిలిచారు. ఇక ఆసీస్ తరఫున వన్డే ప్రపంచకప్‌లో భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పిన మూడు సందర్భాల్లోనూ వార్నర్ అంతకుముందు 178, 166, 163తో అరుదైన ఘనత దక్కించుకున్నాడు.

**వన్డే ప్రపంచకప్‌లో నేడు..**
**నెదర్లాండ్స్ × శ్రీలంక**
**(వేదిక: లక్నో; ఉ.10.30గం॥లకు)**
**ఇంగ్లండ్ × దక్షిణాఫ్రికా**
**(వేదిక: ముంబయి; మ.2.00గం॥లకు)**

### పాయింట్ల పట్టిక

| వ.స. | దేశం | ఆ | గె | ఓ | పా | నె.ర. |
|---|---|---|---|---|---|---|
| 1. | న్యూజిలాండ్ | 4 | 4 | 0 | 8 | +1.92 |
| 2. | భారత్ | 4 | 4 | 0 | 8 | +1.65 |
| 3. | దక్షిణాఫ్రికా | 3 | 2 | 1 | 4 | +1.07 |
| 4. | ఆస్ట్రేలియా | 4 | 2 | 2 | 4 | -0.19 |
| 5. | పాకిస్తాన్ | 4 | 2 | 2 | 4 | -0.45 |
| 5. | ఇంగ్లండ్ | 3 | 1 | 3 | 2 | -0.08 |
| 7. | బంగ్లాదేశ్ | 4 | 1 | 3 | 2 | -0.78 |
| 8. | నెదర్లాండ్స్ | 3 | 1 | 2 | 2 | -0.72 |
| 9. | ఆఫ్ఘనిస్తాన్ | 4 | 1 | 3 | 2 | -1.25 |
| 10. | శ్రీలంక | 3 | 0 | 3 | 0 | -1.53 |

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర:నెట్‌రన్‌రేట్

### స్కోర్‌బోర్డు..

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** వార్నర్ (సి)షాదాబ్ (బి)రవూఫ్ 163, మిచెల్ మార్ష్ (సి)ఉస్మా మీర్ (బి)షాహిన్ 121, మ్యాక్స్‌వెల్ (సి)బాబర్ (బి)షాహిన్ 0, స్టీవ్ స్మిత్ (సి అండ్ బి) ఉస్మా మీర్ 7, స్టొయినీస్ (ఎల్‌బి)షాహిన్ 21, ఇంగ్లిస్ (సి)రిజ్వాన్ (బి)రవూఫ్ 13, లబూషేన్ (సి)షాదాబ్ (బి)రవూఫ్ 8, కమిన్స్ (నాటౌట్) 6, స్టార్క్ (సి)షాద్ షకీల్ (బి)షాహిన్ 2, హేజిల్‌వుడ్ (సి)రిజ్వాన్ (బి)షాహిన్ 0, జంపా (నాటౌట్) 1, అదనం 25. (50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 367పరుగులు. **వికెట్ల పతనం:** 1/259, 2/259, 3/284, 4/325, 5/339, 6/354, 7/360, 8/363, 9/363 **బౌలింగ్:** షాహిన్ 10-1-54-5, హసన్ అలీ 8-0-57-0, ఇఫ్తికార్ 8-0-37-0, హారీస్ రవూఫ్ 8-0-83-3, ఉస్మా మీర్ 9-0-82-1, నవాజ్ 7-0-43-0

పాకిస్తాన్ ఇన్నింగ్స్: అబ్దుల్లా షఫీక్ (సి)మ్యాక్స్‌వెల్ (బి)స్టొయినీస్ 64, ఇమామ్-ఉల్-హక్ (సి)స్టార్క్ (బి)స్టొయినీస్ 70, బాబర్ (సి)కమిన్స్ (బి)జంపా 18, రిజ్వాన్ (ఎల్‌బి)జంపా 46, షాద్ షకీల్ (సి)స్టొయినీస్ (బి)కమిన్స్ 30, ఇఫ్తికార్ అహ్మద్ (ఎల్‌బి)జంపా 26, నవాజ్ (స్టంప్)ఇంగ్లిస్ (బి)జంపా 14, ఉస్మాన్ మిర్ (సి)స్టార్క్ (బి)హేజిల్‌వుడ్ 0, షాహిన్ అఫ్రిది (సి)లబూషేన్ (బి)కమిన్స్ 10, హసన్ అలీ (సి)ఇంగ్లిస్ (బి)స్టార్క్ 8, రవూఫ్ (నాటౌట్) 0, అదనం 19. (45.3ఓవర్లలో) 305పరుగులకు ఆలౌట్. వికెట్ల పతనం: 1/134, 2/154, 3/175, 4/232, 5/269, 6/274, 7/277, 8/287, 9/301, 10/305 బౌలింగ్: స్టార్క్ 8-0-65-1, హేజిల్‌వుడ్ 10-1-37-1, కమిన్స్ 7,3-0-62-2, ఆడం జంపా 10-0-53-4, మ్యాక్స్‌వెల్ 5-0-45-0, స్టొయినీస్ 5-0-40-2.

## సెమీస్‌కు సింధు

### డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



**ఓడెన్సె(డెన్మార్క్):** డెన్మార్క్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి పివి సింధు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సింధు 21-19, 21-12తో సుపరింద(థాయ్‌లాండ్)పై వరుససెట్లలో విజయం సాధించింది. తొలి గేమ్‌ను హోరాహోరీ పోరులో నెగ్గిన సింధు.. రెండో గేమ్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఈ మ్యాచ్ సుమారు 47నిమిషాలసేపు సాగింది. ఈ టోర్నమెంట్‌లో మిగిలిన ఏకైక భారత షట్లర్ సింధు మాత్రమే. మరో క్వార్టర్‌ఫైనల్లో మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణి మారిన్ 19-21, 21-15, 21-18తో టాప్‌సీడ్ తైజు-యింగ్(తైపీ)ను ఓడించి సెమీస్‌కు చేరింది.

## న్యూజిలాండ్‌తో పోరుకు హార్దిక్ దూరం..

**బెంగళూరు:** టీమిండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా న్యూజిలాండ్‌తో కీలక పోరుకు దూరమయ్యాడు. గురువారం బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా హార్దిక్ మడిమకు గాయం కావడంతో ఆట మధ్యలోనే మైదానాన్ని వీడాడు.దీంతో అతడు బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సిఏ)కు వెళ్లాడు.ఎన్‌సిఏలో పాండ్యా గాయం తీవ్రతను వైద్య నిపుణులు పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో హార్దిక్ గాయానికి సంబంధించి బిసిసిఐ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. పాండ్యా గాయం తీవ్రంగా ఉందని.. దీంతో 22న ధర్మశాల వేదికగా న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌కు మాత్రం అతడు అందుబాటులో ఉండేది అనుమానమేనని తెలిపాడు. ఇంగ్లాండ్‌తో అక్టోబర్ 29న లక్నో వేదికగా జరుగబోయే మ్యాచ్ నాటికి ఫిట్‌నెస్ సాధిస్తాడు' అని ఆయన తెలిపారు.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68